మంగళవారం
1-4-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 189
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

400 ఎకరాలు ప్రభుత్వానివే

- సెంట్రల్ వర్సిటీకి అంగుళం కూడా లేదు
- వివాదం చేయడం కోర్టు ధిక్కారమే
- భూమి చదును పనులు ప్రారంభం

విశాలాంధ్ర–హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచె గచ్చిబౌలిలో 400 ఎకరాలపై యాజమాన్య హక్కు తనదేనని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ భూమిపై సమగ్ర సమాచారంతో కూడిన ప్రకటన కూడా ప్రభుత్వం విడుదల చేసింది. సెంట్రల్ యూనివర్సిటీ భూమి లేదని స్పష్టం చేసింది. ఆ భూమి యజమాని తానేనని న్యాయస్థానం ద్వారా తెలంగాణ ప్రభుత్వం నిరూపించుకుందని, ప్రైవేటు సంస్థకు 21 ఏళ్ల క్రితం కేటాయించిన భూమిని న్యాయపోరాటం ద్వారా ప్రభుత్వం దక్కించుకుందని పేర్కొంది. ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహించే వేలం, అభివృద్ధి పనులు అక్కడ ఉన్న రాళ్లను దెబ్బతీయవని, అభివృద్ధికి ఇచ్చిన భూమిలో చెరువు కూడా లేదని తెలిపింది. 2004లో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రైవేటు సంస్థకు ఈ భూమిని కేటాయించిందని, అయితే

- మిగతా 2 లో

చత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

మావోయిస్టు అగ్రనేత రేణుక మృతి

విశాలాంధ్ర–చింతూరు: మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. చత్తీస్‌గఢ్ అడవుల్లో సోమవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత రేణుక అలియాస్ చైతు అలియాస్ సరస్వతి మృతిచెందింది. బస్తర్ ప్రాంతంలో భద్రతా సిబ్బంది, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో రేణుక మృతి చెందింది. ఆమెను వరంగల్ జిల్లా జనగామ వాసిగా గుర్తించారు. రేణుక ప్రముఖ మావోయిస్టు శాఖమూరి అప్పారావు భార్య. మృతురాలి తలపై రూ.45 లక్షల రివార్డు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో చత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.25 లక్షలు, తెలంగాణ ప్రభుత్వం రూ.20 లక్షలు ప్రకటించి ఉన్నాయి. దంతెవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు దాగి ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో డీఆర్‌జీ సిబ్బంది యాంటీ-నక్సలైట్ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో మావోయిస్టులు కాల్పులు ప్రారంభించగా... భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరిపారు. ఎన్‌కౌంటర్ అనంతరం ఘటనాస్థలంలో మహిళా మావోయిస్టు మృతదేహాన్ని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. మృతురాలిని తెలంగాణలోని వరంగల్‌కు చెందిన రేణుక అలియాస్ చైతి అలియాస్ సరస్వతిగా గుర్తించారు. ఆమె మావోయిస్టు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలిగా వ్యవహరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రెస్ టీమ్ ఇంచార్జ్‌గా ఉన్నట్లు పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో భారీఎత్తున తుపాకులు, ఇతర ఆయుధాలు, పేలుడు పదార్థాలను భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. తాజా ఎన్‌కౌంటర్‌తో కలిపి ఈ ఏడాది ఇప్పటివరకు చత్తీస్‌గఢ్‌లో 135 మంది మావోయిస్టులను భద్రతా సిబ్బంది హతమార్చారు. ఇందులో 119 మంది బస్తర్ డివిజన్‌లోనే మరణించినట్లు అధికారులు తెలిపారు. గత శనివారం సుక్మా, బీజాపూర్‌లో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో 18 మంది మావోయిస్టులు

- మిగతా 2 లో

ప్రధాని ప్రైవేట్ సెక్రటరీగా నిధి తివారీ

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రైవేట్ సెక్రటరీగా ఇండియన్ ఫారెన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) అధికారి నిధి తివారీ నియామితులయ్యారు. కేంద్ర కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆమె నియామకాన్ని ఆమోదించింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీవోపీటీ) ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. వారణాసిలోని మెహమూర్‌గంజ్‌కు చెందిన నిధి తివారీ... సివిల్ సర్వీసెస్ పరీక్షలో 96వ ర్యాంక్ సాధించారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఆమె గతంలో వారణాసిలో అసిస్టెంట్ కమిషనర్(వాణిజ్య పన్నులు)గా

- మిగతా 2 లో

మూడు నెలలూ
మండే ఎండలే!

ఐఎండీ వెల్లడి

న్యూఢిల్లీ: ఏప్రిల్ నుంచి జూన్ వరకు దేశ వ్యాప్తంగా సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదు కానున్నట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం హెచ్చరించింది. మధ్య, తూర్పు, వాయువ్య ప్రాంతాల్లో వేడిమి మరింత ఎక్కువగా ఉంటుందని, పశ్చిమ, తూర్పు భారతంలోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయని తెలిపింది. కనిష్ట ఉష్ణోగ్రతలు అనేక ప్రాంతాల్లో

- మిగతా 2 లో

'నోబెల్ శాంతి' రేసులో ఇమ్రాన్‌ఖాన్

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నోబెల్ శాంతి బహుమతి కోసం నామినేట్ అయ్యారు. మానవ హక్కులు, ప్రజాస్వామ్యం కోసం చేసిన కృషికి గాను ఆయనకు ఈ నామినేషన్ లభించింది. నార్వేలోని రాజకీయ పార్టీ "పార్టియట్ సెంట్రం" సభ్యులు, పాకిస్తాన్ వరల్డ్ అలయన్స్ (పీడబ్ల్యూఏ) అనే సంస్థతో కలిసి ఇమ్రాన్ పేరును నోబెల్ శాంతి బహుమతికి ప్రతిపాదించారు. "ఇమ్రాన్ ఖాన్‌ను నోబెల్ శాంతి బహుమతికి

- మిగతా 2 లో

'వక్ఫ్' బిల్లును
అడ్డుకుందాం

- మోదీ పాలన రాజ్యాంగ విరుద్ధం
- ఆర్‌ఎస్‌ఎస్‌తో కలిసి కుట్రలకు పన్నాగం
- సోదర, మతసామరస్యానికి వేదిక

కొత్తగూడెం: కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో – కొత్తగూడెం: శతాబ్దాల నుంచి భిన్నత్వంలో ఏకత్వంగా కొనసాగుతున్న భారతదేశంలో మతాల మధ్య చిచ్చుపెట్టి బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గత పదేళ్లుగా మోదీ ప్రభుత్వ విధానాలు ముస్లింలపై విద్వేషాన్ని రెచ్చగొట్టి సమాజానికి విఘాతంగా మారాయని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టబోతున్న కుట్రలతో కూడిన వక్ఫ్ బోర్డు బిల్లులు సమైక్యంగా అడ్డుకుందామని పిలుపునిచ్చారు. పవిత్ర రంజాన్ ను పురస్కరించుకుని సోమవారం బోడగుట్ట ఈద్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింలను ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ముస్లింలు వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా చేతులకు నల్ల బ్యాడ్జిలు ధరించి ప్రార్థనలు చేశారు. కూనంనేని మాట్లాడుతూ

- మిగతా 2 లో

విద్య కాషాయీకరణకే...

- ఎన్‌ఈపీ పేరుతో భారీ కుట్ర
- బీజేపీ చెబుతున్న లక్ష్యాలు వాస్తవ విరుద్ధం
- మోదీ సర్కారుపై సోనియా మండిపాటు

న్యూఢిల్లీ: జాతీయ విద్యావిధానం- (ఎన్ఈపీ)202 పై కాంగ్రెస్ అగ్రనేత, రాజ్యసభ సభ్యురాలు సోనియాగాంధీ తీవ్ర విమర్శలు చేశారు. నూతన జాతీయ విద్యావిధానం పేరుతో బీజేపీ ప్రభుత్వం దేశంలో భారీ కుట్రకు తెరలేపిందని అన్నారు. పూర్తిస్థాయిలో సంప్రదింపులు జరపకుండా రాజకీయ స్వలాభం కోసం విద్యావ్యవస్థను నాశనం చేసేందుకు ఈ విధానం తీసుకొస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రముఖ పత్రిక ఓపెన్ పేజ్‌కు రాసిన ఆర్టికల్‌లో ఎన్‌ఈపీపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాన్ని తప్పుపట్టారు. కొత్త విద్యావిధానం వెనుక ఉన్న బీజేపీ ఎజెండా 'విద్య కాషాయీకరణ, కేంద్రీకరణ, వ్యాపారం' అని దుయ్యబట్టారు. విద్యావ్యవస్థను వెంటాడుతున్న ఈ మూడు అంశాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని కేంద్రీకృతంగా ఉన్న విద్యావ్యవస్థపై కేంద్రానిదే పెత్తనం అని పేర్కొన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ కింద రాష్ట్రాలకు రావాల్సిన గ్రాంట్‌లను నిలిపివేయడం మోదీ ప్రభుత్వం చేసిన అత్యంత అవమానకరమైన చర్యల్లో ఒకటి అని ధ్వజమెత్తారు. ఎన్ఈపీ ద్వారా బీజేపీ ప్రభుత్వం చెబుతున్న లక్ష్యాలు వాస్తవాలకు చాలా దూరంగా ఉంటాయని, బయటికి చెప్పేది ఒకటైతే... అంతర్గతంగా ఉన్న ఎజెండా మరొకటని అన్నారు. దేశంలో ఉన్న పిల్లలు, యువకులకు విజ్ఞానంతో కూడిన విద్య అందించడం కాకుండా విద్యార్థుల్లో మత భావాలు ఎక్కించడమే లక్ష్యంగా తీసుకొచ్చారని

- మిగతా 2 లో

రెండు వేలు దాటిన మృతులు

- మైన్మార్ భూకంప బాధిత ప్రాంతాల్లో కొనసాగుతున్న సహాయ చర్యలు
- ప్రార్థనలు చేస్తూ 700 మంది సజీవ సమాధి

2లో

హైదరాబాద్‌లో వాన్‌గార్డ్ జీసీసీ

- ఈ ఏడాది చివరి నాటికి ప్రారంభం
- నాలుగేళ్లలో 2,300 ఉద్యోగావకాశాలు
- సీఎం రేవంత్‌తో సంస్థ ప్రతినిధి బృందం భేటీ

విశాలాంధ్ర – హైదరాబాద్: ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మక సంస్థలలో ఒకటైన వాన్‌గార్డ్ కంపెనీ హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. మన దేశంలో వాన్‌గార్డ్ నెలకొల్పే తొలి జీసీసీ ఇదే. వాన్‌గార్డ్ ప్రతినిధి బృందం సోమవారం ఉదయం బంజారాహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయింది. వాన్‌గార్డ్ సీఈఓ సలీం రాంజీ, ఐటీ డివిజన్ సీఐఓ, ఎండీ నితిన్ టాండన్, చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ జాన్ కౌచర్, జీసీసీ–వాన్‌గార్డ్ ఇండియా హెడ్ వెంకటేష్ నటరాజన్ నేతృత్వంలో కంపెనీ ప్రతినిధి బృందంలో ఉన్నారు. చర్చల అనంతరం హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటు చేస్తామని సంస్థ ప్రకటించింది. ఈ ఏడాది చివరి నాటికి జీసీసీ కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించనున్నట్లు తెలిపింది. రాబోయే నాలుగు సంవత్సరాల్లో 2,300 మంది ఉద్యోగులను నియమించుకోవాలని లక్ష్యంగా నిర్ణయించింది. వాన్‌గార్డ్ ప్రపంచంలో పేరొందిన పెట్టుబడి సంస్థ. సుమారు 10 ట్రిలియన్ డాలర్ల విలువైన ఆస్తులను ఈ కంపెనీ నిర్వహిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా 50 మిలియన్లకు పైగా పెట్టుబడిదారులకు తమ సేవలు అందిస్తుంది. ఇన్నోవేషన్ హబ్‌గా పనిచేయనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్, మొబైల్ ఇంజినీరింగ్ తదితర అధునాతన సాంకేతిక రంగాల్లో అవసరమైన ఇంజినీర్లను తక్షణమే నియమించుకోవాలని ప్రణాళిక చేస్తోంది. హైదరాబాద్ లో వాన్‌గార్డ్ జీసీసీ ఏర్పాటుకు ముందుకు రావటం ఆనందంగా ఉందని రేవంత్ రెడ్డి అన్నారు. వాన్‌గార్డ్ రాకతో ప్రపంచ

- మిగతా 2 లో

'ఔటర్'పై టోల్ బాదుడు

విశాలాంధ్ర–హైదరాబాద్: నగరంలో ఔటర్ రింగ్ రోడ్డు ఎక్కితే టోల్ చార్జీల మోత మోగించేందకు అధికారులు సిద్ధం అయ్యారు. ప్రభుత్వం నుంచి అనుమతి లభించడంతో అధికారులు చార్జీలు పెంచేందుకు రంగం సిద్ధం చేశారు. పెరిగిన చార్జీలు మంగళవారం నుంచే అమల్లోకి రానున్నాయి. కారు, జీపు, లైట్ వెయిట్ వాహనాలకు కిలోమీటర్‌కు రూ.2.34 నుంచి రూ.2.44కు పెంచనున్నారు. మినీ బస్, ఎల్సీవీలకు కిలోమీటర్‌కు రూ.3.77 నుంచి రూ.3.94కు పెరగనుండగా 2 యాక్సిల్ బస్సులకు కిలోమీటర్‌కు రూ.6.69 నుంచి రూ.7కు పెంచనున్నారు. భారీ వాహనాలకు కిలోమీటర్‌కు రూ.15.09 నుంచి రూ.15.78కు పెంచేందుకు సిద్ధమయ్యారు.

ఇదీ లోకం!



యువతిపై సామూహిక అత్యాచారం

- నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండలో ఘటన
- దైవ దర్శనానికి వెళ్లగా... దారుణ అకృత్యం
- నిందితులు 9 మందిలో పోలీసుల అదుపులో ఆరుగురు

విశాలాంధ్ర–హైదరాబాద్: సభ్య సమాజం తలదించుకునే దారుణ ఘటన నాగర్ కర్నూలు జిల్లా ఊర్కొండ మండలంలో చోటుచేసుకుంది. దైవాదర్శనానికి వచ్చిన యువతిపై 9 మంది అత్యాచారం చేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. వివరాల ప్రకారం మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఓ యువతి తన బంధువుతో కలిసి ఊర్కొండపేట ఆంజనేయ స్వామి ఆలయంలో మొక్కులు తీర్చుకోవడానికి శనివారం సాయంత్రం వెళ్లింది. స్వామివారిని దర్శించుకున్న అనంతరం రాత్రి ఆలయం ప్రాంగణంలోనే నిద్ర చేయాలనుకున్నారు. ఈ క్రమంలో యువతి కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీపంలోని గుట్ట ప్రాంతంలోకి వెళ్లింది. ఆమె వెంట బంధువు కూడా వెళ్లారు. అక్కడే ఉన్న 9 మంది యువకులు యువతి వెంట వచ్చిన బంధువుపై దాడి చేశారు. అనంతరం అతని కాళ్లు, చేతులు కట్టేశారు. అనంతరం యువతిని గుట్ట ప్రాంతంలో నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి యువకులు ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఊర్కొండ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. నిందితులను ఊర్కొండ పేటకు చెందిన 9 మందిగా గుర్తించారు. యువతిపై

- మిగతా 2 లో

రాజీవ్ యువ వికాసానికి అధిక దరఖాస్తులు

కలెక్టర్లు, ఉన్నతాధికారులతో భట్టి వీడియో కాన్ఫరెన్స్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్–మల్కాజిగిరి: రాజీవ్ యువ వికాస పథకానికి వీలైనంత ఎక్కువమంది దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకంపై సోమవారం సాయంత్రం హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భట్టి మాట్లాడుతూ... రాష్ట్రంలో దాదాపు ఐదు లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర వెనకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఉన్నారన్నారు. ఈ పథకం అమలు ద్వారా వారందరికీ ఉపాధి లభించడంతో రాష్ట్రంలో నిరుద్యోగం తగ్గుతుందన్నారు. అర్హులు ఏప్రిల్ ఐదో తేదీలోపు దరఖాస్తు చేసుకునే విధంగా అధికారులు యువతకు అవగాహన కల్పించాలన్నారు. రూ.50 వేల రుణం వంద శాతం మాఫీ, రూ.లక్ష లోపు 90 శాతం, రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం రాయితీ... రూ.రెండు లక్షల నుంచి రూ.నాలుగు లక్షల వరకు 70 శాతం రాయితీ లభిస్తుందన్నారు. రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని బ్యాంకులోన్ల ద్వారా అందిస్తారన్నారు. కుటుంబంలో ఒక్కరికే

- మిగతా 2 లో

సీపీఐ ప్రధాన కార్యదర్శులు - 3
పి.సి.జోషి

పి.సి.జోషిగా ప్రసిద్ధుడైన పూరన్ చంద్ జోషి తొలితరం కమ్యూనిస్టు నాయకులలో ఒకరు. ఆయన 1935 నుంచి 1947 దాకా పన్నెండేళ్ల పాటు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆయన ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు చాలా కాలం సీపీఐపై నిషేధం ఉండేది.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

రెండు వేలు దాటిన మృతులు

- మైన్మార్ భూకంప బాధిత ప్రాంతాల్లో కొనసాగుతున్న సహాయ చర్యలు
- ప్రార్థనలు చేస్తూ 700 మంది సజీవ సమాధి

నేపిడో: అధికారిక సమాచారం ప్రకారం మైన్మార్ భూకంప విలయంలో మృతుల సంఖ్య రెండు వేలు దాటింది. ఈ ఘటనలో దాదాపు నాలుగువేలమంది వరకు గాయాలపాలయ్యారు. ఇంకా వందలాది మంది ఆచూకీ తెలియరాలేదని అధికారులు పేర్కొన్నారు. శిథిలాల కింద చిక్కుకున్న వేలాది మందిని రక్షించేందుకు పెద్దఎత్తున సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భూకంపం వచ్చి రెండు రోజులు గడుస్తున్న నేపథ్యంలో శిథిలాల కింద చిక్కుకుపోయిన వారి పరిస్థితిపై ఆందోళన కొనసాగుతోంది. కాగా భూకంపానికి తీవ్రంగా దెబ్బతిన్న అనేక ప్రాంతాలకు సహాయక బృందాలు ఇంకా చేరుకోని పరిస్థితి ఉంది. దీంతో మృతుల సంఖ్య భారీగా ఉండొచ్చని భావిస్తున్నారు. కాగా వీధుల్లో మృతదేహాలు కుళ్లిపోతుండటం వల్ల దుర్గంధం మొత్తం వ్యాపిస్తున్నట్లు సమాచారం. భూకంపం వల్ల ముఖ్యంగా మాండలేలో భారీ భవనాలు, ఆధ్యాత్మిక, పర్యటక ప్రదేశాలతోపాటు అనేక మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వంతెనలు కూలిపోవడం, రోడ్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. సహాయ చర్యలకు ఇబ్బందిగా మారింది. దీంతో భారీ పరికరాలు లేకుండానే రంగంలోకి దిగిన స్థానికులు, చేతులతోనే శిథిలాలను తొలగించేందుకు యత్నిస్తున్నారు. రంజాన్‌కు ముందు శుక్రవారం ముస్లింలు ప్రార్థనలు చేస్తుండగా ఈ విపత్తు చోటుచేసుకోవడం వల్ల దేశవ్యాప్తంగా 700 మంది శిథిలాల కింద సజీవ సమాధి అయినట్లు స్ప్రింగ్ రివల్యూషన్ మయన్మార్ ముస్లిం నెట్‌వర్క్ కమిటీ సభ్యుడు టున్ కీ వెల్లడించారు. భూ ప్రకంపనల ధాటికి 60 మసీదులు తీవ్రంగా ధ్వంసమయ్యాయని... మధ్యాహ్నం సమయంలో ప్రార్థనలు చేస్తుండగా ఈ విపత్తు రావడం వల్ల శిథిలాల కిందే 700 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. అయితే, వీరి మరణాలను మయన్మార్ మిలిటరీ ప్రభుత్వం వెల్లడించిన మృతుల సంఖ్యలో చేర్చారా లేదా? అనేదానిపై స్పష్టత లేదు. కాగా రెండు రోజులుగా వరుస భూ ప్రకంపనలు మయన్మార్ వాసులను హడలెత్తిస్తున్నాయి. వరుస ప్రకంపనల కారణంగా దెబ్బతిన్న ఇళ్లు పూర్తిగా కూలిపోయే ప్రమాదం ఉందనే భయాలు స్థానికుల్లో నెలకొన్నాయి. దీంతో 15 లక్షల జనాభా ఉన్న మాండలేలో చాలావరకు ప్రజలు రాత్రి వేళల్లో వీధుల్లోనే నిద్రపోతున్నారు. ఆదివారం మధ్యాహ్నం 5.1 తీవ్రతతో మరోసారి భూకంపం రావడం వల్ల స్థానికులు కలవరపాటుకు గురయ్యారు.

థాయ్‌లాండ్‌లో...

థాయ్‌లాండ్‌లో కుప్పకూలిన 33 అంతస్తుల నిర్మాణ భవనంలో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే అందులోని వారంతా బతికుండే అవకాశాలు చాలా తక్కువని బ్యాంకాక్ పోలీసులు వెల్లడించారు. ఇప్పటివరకు బయటకు తీసిన వారిలో ఎవరూ ప్రాణాలతో లేరన్నారు. శిథిలాలను పూర్తిగా తొలగించేందుకు కనీసం రెండు నెలల సమయం పడుతుందన్నారు. ఇప్పటివరకు థాయ్‌లాండ్‌లో 18 మంది మరణించగా, 32 మంది గాయపడ్డారు. అయితే, భారీ అంతస్తు కుప్పకూలిన ఘటనకు సంబంధించి అక్కడ పనిచేస్తున్న 83 మంది ఆచూకీ తెలియరాలేదని అధికారులు తెలిపారు.

అన్ని దేశాలపైనా సుంకాలు తప్పవు: ట్రంప్

వాషింగ్టన్: వాణిజ్య యుద్ధం కొన్ని దేశాలకు మాత్రమే పరిమితం కాబోదని... ప్రపంచంలోని అన్ని దేశాలపైనా సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ విషయంలో ఎటువంటి మార్పు ఉండదన్నారు. అమెరికా పూర్వ వైభవం సాధించడానికి ఈ చర్యలు తీసుకోక తప్పదని వ్యాఖ్యానించారు. అనేక సంవత్సరాలుగా తాము ప్రపంచదేశాలతో ఉదారంగా వ్యవహరించినప్పటికీ చరిత్రలో ఏ దేశాన్ని దోచుకోనివిధంగా అవి అమెరికాను దోచుకున్నాయని ట్రంప్ తెలిపారు. వాణిజ్య విధానాల విషయంలో కొన్ని సార్లు అమెరికా మిత్రదేశాలు శత్రువుల కంటే దారుణంగా ప్రవర్తించాయన్నారు. దశబ్దాలుగా ప్రపంచదేశాలు వివిధ పేర్లతో దోచుకున్న దానికంటే ప్రస్తుతం అమెరికా ఇతర దేశాలపై విధిస్తున్న సుంకాలు చాలా తక్కువని చెప్పుకొచ్చారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా మాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్న ప్రపంచదేశాలన్నిటిపైనా వాణిజ్య టారిఫ్‌లు అమలవుతాయని ట్రంప్ తెలిపారు. భారత్, చైనాలపై ప్రతీకార సుంకాలను ఏప్రిల్ 2 నుంచి అమల్లోకి తెస్తామని ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

అఫ్గాన్ శరణార్థుల బహిష్కరణకు పాక్ సన్నాహాలు

ఇస్లామాబాద్: తమ దేశంలో నివసిస్తున్న దాదాపు మూడు మిలియన్ల (30 లక్షలు) మంది అఫ్గానీయులను తరిమేసేందుకు పాకిస్థాన్ ప్రణాళికలు రచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అఫ్గాన్ నుంచి శరణార్థులుగా వచ్చినవారు తమ దేశం విడిచి వెళ్లడానికి ఇచ్చిన గడువు మార్చి 31తో ముగియడంతో ఈ చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. తమ దేశంలో అక్రమంగా నివసిస్తున్న అఫ్గాన్ దేశీయులను, ఇతర విదేశీయులను తిరిగి పంపడానికి 2023 అక్టోబర్ నుంచి పాక్ ఈ బహిష్కరణ అస్త్రాన్ని ప్రయోగిస్తోంది. అధికారిక వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 1 నుంచి దేశంలో అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించి బహిష్కరించాల్సి ఉంది. అయితే కొన్ని కారణాల రీత్యా బహిష్కరణలను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసినట్లు సమాచారం. ఆ దేశ సిటిజన్ కార్డు ఉన్నవారు స్వచ్ఛందంగా ఇస్లామాబాద్‌ను వదిలి వెళ్లాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. బహిష్కరణకు గురైన వారు తిరిగి పాకిస్థాన్‌లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని అక్కడి ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. గత 18 నెలల్లో సుమారు 8వేలకు పైగా అఫ్గానిస్థాన్‌కు చెందిన వలసదారులు పాక్‌ను వీడినట్లు ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం ఆ దేశంలో 3 మిలియన్ల మంది అఫ్గానిస్థాన్‌వాసులు ఆశ్రయం పొందుతుండగా... ఎటువంటి పత్రాలు లేకుండా చట్టవిరుద్ధంగా మరో పది లక్షల మంది ఉంటున్నారని పేర్కొన్నాయి.

గౌరవంగా తిరిగి రండి...

అఫ్గానిస్థాన్ శరణార్థుల మంత్రిత్వ శాఖ ప్రతినిధి అబ్దుల్ ముతాలిబ్ శరణార్థులనుద్దేశించి ప్రకటన చేశారు. గౌరవంగా స్వదేశానికి తిరిగి రావాలని తాలిబన్ ప్రభుత్వం కోరుకుంటోందని తెలిపారు. తాలిబన్ ప్రభుత్వానికి, ఐక్యరాజ్య సమితికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా పాకిస్థాన్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మతసామరస్యానికి ప్రతీక నల్లగొండ

లతీఫ్ సాబ్ దర్గాకు రూ.100 కోట్లతో ఘాట్ రోడ్: మంత్రి కోమటిరెడ్డి

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో: నల్లగొండ జిల్లా మతసామరస్యానికి పెట్టింది పేరని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని మునుగోడు రోడ్డు ఈద్గాలో సోమవారం ఆయన ప్రార్థనలు చేశారు. అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింల పాత్ర మరువలేనిదని అన్నారు. దేశాభివృద్ధికి ఎంతోమంది ముస్లింలు కృషి చేశారని, అందులో అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా, సైంటిస్ట్‌గా చేసిన సేవలు మరువలేనివని అన్నారు. నల్లగొండ పట్టణంలో దర్గాలు, ఈద్గాల అభివృద్ధికి తాను 25 సంవత్సరాలుగా కృషి చేస్తున్నానని తెలిపారు. ఇక్కడి ఈద్గా తెలంగాణలోనే అతిపెద్దదన్నారు. లతీఫ్ సాబ్ దర్గా కు ప్రతి సంవత్సరం నిర్వహించే ఉర్సు ఉత్సవాలకు లక్షల మంది వస్తారని, రూ.100 కోట్లతో ఘాట్ రోడ్ నిర్మిస్తున్నామని తెలిపారు. లతీఫ్ సాబ్ గుట్ట నుంచి బ్రహ్మంగారి గుట్ట వరకు రోప్ వే నిర్మిస్తున్నామని, రూ.500 కోట్లతో కొత్త బైపాస్ రోడ్ పనులు వారం రోజుల్లో మొదలవుతున్నాయన్నారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీ, మెడికల్ కళాశాల, కలెక్టరేట్ తదితర ప్రభుత్వ సంస్థలలో ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిపై అర్హులైన ముస్లిం అభ్యర్థులను నియమించేందుకు 10 శాతం రిజర్వేషన్ కల్పించేలా కలెక్టర్‌ను ఆదేశించినట్టు వెల్లడించారు. పేద ముస్లింలకు ఇళ్లు కట్టిస్తామన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవర్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

400 ఎకరాలు ప్రభుత్వానివే

(మొదటిపేజీ తరువాయి)

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కేసుల్లో చట్టపరంగా గెలవడం ద్వారా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూమిపై యాజమాన్యాన్ని దక్కించుకుందని స్పష్టం చేసింది. ఆ భూమిపై సృష్టించే ఎటువంటి వివాదమైనా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని, సర్వేలో ఒక్క అంగుళం భూమి కూడా యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (సెంట్రల్ యూనివర్సిటీ)ది కాదని తేలింది. కొత్తగా చేపడుతున్న అభివృద్ధి ప్రణాళిక అక్కడ ఉన్న రాళ్ల రూపాలను దెబ్బతీయదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం చేపడుతున్న ప్రతి ప్రణాళికలో స్థానిక సుస్థిరాభివృద్ధి... పర్యావరణ అవసరాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని చెబుతోంది. ప్రస్తుత ప్రాజెక్ట్ ను వ్యతిరేకించే వారంతా కొందరు రాజకీయ నాయకులు, స్థిరాస్తి వ్యాపారుల ప్రయోజనాలకు అనుగుణంగా విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడింది. కంచె గచ్చిబౌలి గ్రామంలోని సర్వే నంబర్ 25 లోని 400 ఎకరాల భూమికి సంబంధించి కొన్ని మీడియా సంస్థల్లో వచ్చిన తప్పుదోవ పట్టించే కథనాలు తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ) దృష్టికి వచ్చిన నేపథ్యంలో ఆ భూమికి సంబంధించిన వాస్తవాలు ప్రజల ముందుంచుతున్నామని స్పష్టం చేసింది.

చట్టపరమైన అంశాలు...

400 ఎకరాల భూమిని 2004, జనవరి 13న నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రీడా వసతుల అభివృద్ధికి ఐఎంజీ అకడమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్‌కు మెమో నంబర్ 39612/(2) 2003 ప్రకారం కేటాయించింది. ఐఎంజీ ... తన ప్రాజెక్టును ప్రారంభించకపోవడంతో 2006, నవంబరు 21న జీవో 111080/1/2003 ప్రకారం ఆ కేటాయింపును రద్దు చేసి ఏపీ యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం అండ్ కల్చరల్ డిపార్ట్‌మెంట్‌కు దానిని కేటాయించింది. దీనిపై ఐఎంజీ ... హైకోర్టులో 2006లో రిట్ పిటిషన్ నంబర్ 24781/2006 దాఖలు చేసింది. ఈ న్యాయపోరాటం సుదీర్ఘ కాలం కొనసాగింది. రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం ఈ అంశాన్ని చాలా తీవ్రంగా పరిగణించింది. ఈ కేసులో (రిట్ పిటిషన్ నంబర్ 24781/2006) హైకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా 2024, మార్చి 7న ఉత్తర్వులు ఇచ్చింది. హైకోర్టు తీర్పును 'ఐఎంజీ' సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (సీ) నంబర్ 9265/2024 ద్వారా సవాల్ చేసింది. ఈ పిటిషన్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం పోరాడింది. 2024, మే 3వ తేదీన సుప్రీంకోర్టు ... ఐఎంజీ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. దీంతో ఆ 400 ఎకరాల భూమి ప్రభుత్వానికి దక్కింది. టీజీఐఐసీ విజ్ఞప్తి మేరకు శేరిలింగంపల్లి మండలం డిప్యూటీ కలెక్టర్ మరియు తహసీల్దార్ రెవెన్యూ రికార్డుల ప్రకారం కంచెగచ్చిబౌలి సర్వే నెంబర్ 25లోని 400 ఎకరాలు కంచ అస్తబల్ పోరంబోకు సర్కారీ (అంటే... ప్రభుత్వ భూమి అని) అని నిర్ధారించారు. ఆక్రమణలకు గురికాకుండా తర్వాత అభివృద్ధి పనులకుగానూ ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని వారు సూచించారు. 2022, సెప్టెంబరు 14న జారీ చేసిన జీవో 571, రెవెన్యూ (అస్సైన్-1) డిపార్ట్ మెంట్ ప్రకారం భూ కేటాయింపులకు సంబంధించిన కొత్త విధానం ఆధారంగా 400 ఎకరాల భూమిని కొలిచి హక్కులు బదిలీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ఐ అండ్ సీ విభాగం 2024, జూన్ 19న సూచించింది. ఐటీ మరియు ఇతర ప్రాజెక్టుల ఏర్పాటుకు తమకు ఆ 400 ఎకరాలు కేటాయించాలని టీజీఐఐసీ 2024, జూన్ 19న ప్రతిపాదనలు సమర్పించింది. ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి... 400 ఎకరాల ప్రభుత్వ భూమి హక్కులను టీజీ ఐఐసీకి బదలాయిస్తూ 2024, జూన్ 24న ఉత్తర్వులు జారీ చేశారు. శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులు ఆ 400 ఎకరాల భూమికి సంబంధించి పంచనామా నిర్వహించి 2024, జులై ఒకటో తేదీన టీజీఐఐసీకి అప్పగించారు. కొన్ని మీడియాల్లో తప్పుడుగా వస్తున్నట్లు ... అటవీ భూమి లేదని రెవెన్యూ రికార్డుల్లోనూ ప్రభుత్వ భూమిగానే ఉందని స్పష్టమవుతోంది.

సెంట్రల్ వర్సిటీ అధికారుల సమన్వయంతోనే హద్దుల గుర్తింపు

తమకు కేటాయించిన 400 ఎకరాల భూమికి సంబంధించిన ఉమ్మడి హద్దుల గుర్తింపునకు తమ అధికారులకు సహకరించాలని కోరుతూ టీజీఐఐసీ సైబరాబాద్ జోనల్ మేనేజర్ వర్సిటీ రిజిస్ట్రార్‌కు 2024, జులై నాలుగున లేఖ రాశారు. టీజీఐఐసీ అధికారులు తమ బృందంతో పాటు యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ను 2024, జులై 7న వ్యక్తిగతంగా కలిసి తమ ప్రాజెక్ట్ ప్రతిపాదనలను ఆయనకు వివరించారు. సర్వే నిర్వహణ విషయంపై టీజీఐఐసీ జోనల్ మేనేజర్ 2024, జులై 18న వర్సిటీ రిజిస్ట్రార్ మెయిల్ (registrar@uohyd.ac.in)కు మెయిల్ చేశారు. రిజిస్ట్రార్ సమ్మతితోనే 2024, జులై 19న ... రిజిస్ట్రార్, వర్సిటీ ఇంజినీర్, వర్సిటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, రెవెన్యూ అధికారులు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మండల సర్వేయర్ సమక్షంలో సర్వే జరిగింది. అదే రోజు హద్దులు నిర్ధారించారు. టీజీఐఐసీ అభివృద్ధి చేస్తున్న 400 ఎకరాల్లో బఫెల్లో లేక్, పీకాక్ లేక్ లేవు. కొన్ని మీడియాల్లో వీటి విషయంలో తప్పుడు వార్తలు వస్తున్నాయి.

చత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

చనిపోయారు. వీరిలో 11 మంది మహిళలు ఉన్నారు.

రేణుక ఉద్యమ నేపథ్యం...

ఎన్‌కౌంటర్ వివరాలను డీఐజీలు సుందర్ రాజ్ పట్నా, కమలోచన్ కస్యప్, ఎస్పీ గౌరవ్‌రాయ్ వెల్లడించారు. వరంగల్ జిల్లా ఖండవెల్లి గ్రామానికి చెందిన రేణుక 35 ఏళ్ల క్రితం పీపుల్స్‌వార్ పార్టీలు చేరారు. చత్తీస్‌గఢ్ దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు. రేణుక ఎల్ఎల్‌బీ చదివిన తిరుపతిలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ... అలిపిరిలో చంద్రబాబుపై మావోయిస్టుల దాడి తర్వాత రేణుక మావోయిస్టు పార్టీలో పూర్తిస్థాయి కార్యకర్తగా పనిచేశారు. ఆమె మావోయిస్టు సహచరుడు ఎర్రంరెడ్డి సంతోశ్‌రెడ్డిని వివాహం చేసుకుంది. ఆయన ఎన్‌కౌంటర్ తర్వాత మరో మావోయిస్టు నేత శాఖమూరి అప్పారావు సహచరిగా కొనసాగుతూ విప్లవోద్యమంలో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలిగా ఎదిగారు. రేణుక తండ్రి సోమయ్య ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆమెకు ఇద్దరు సోదరులు ఉన్నారు. ఒక సోదరుడు గుమ్మడివెల్లి రాజశేఖర్ న్యాయవాదిగా పనిచేస్తూ స్వచ్ఛంద సంస్థకు లీగల్ అడ్వైజర్‌గా కొనసాగుతున్నారు. మరో సోదరుడు గుమ్మడివెల్లి వెంకట కిషన్‌ప్రసాద్ ఇలియాస్ పూసండి ప్రస్తుతం దేశ రాజధాని దిల్లీలో బీబీసీ(తెలుగు)లో జర్నలిస్టుగా పనిచేస్తున్నట్టు సమాచారం. గతంలో ఇతను కూడా మావోయిస్టు అగ్రనేతగా పనిచేసి... అనారోగ్య కారణాల వల్ల ప్రభుత్వానికి లొంగిపోయాడు. ఖండవల్లి గ్రామం అంటేనే రజాకార్లకు గుండెల్లో వణుకు పుట్టించిన గ్రామం. విప్లవాల ఖిల్లాగా పేరుంది. రేణుక మరణంతో ఖండవల్లి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. రేణుక తల్లిదండ్రులు ప్రస్తుతం హైదరాబాదులోని నాగారంలో ఉంటున్నట్టు సమాచారం. తన మృతదేహాన్ని తీసుకురావడానికి కుటుంబ సభ్యులతో కలిసి చత్తీస్‌గఢ్ వెళుతున్నట్టు తెలిసింది.

50 మంది మావోయిస్టుల లొంగుబాటు

చత్తీస్‌గఢ్‌లో భారీగా మావోయిస్టులు లొంగిపోయారు. బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్, సీఆర్పీఎఫ్ అధికారుల ఎదుట ఆదివారం మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేత, కేంద్ర కమిటీ కార్యదర్శి బసవరాజ్ బాడీగార్డు సోనూ హేమ్లా సహా 50 మంది మావోయిస్టులు లొంగిపోయారు. పీఎల్‌జీఏ బెటాలియన్ నంబరు-1కు చెందిన ఒకరు, కంపెనీ నంబరు-2 నుంచి నలుగురు, కంపెనీ నంబరు-7 నుంచి ఒకరు, నేషనల్ పార్క్ కుతుల్ ఏరియా కమిటీ ప్లాటూన్ నంబరు-2 నుంచి ఇద్దరు సభ్యులు, పార్టీ ఇతర విభాగాలకు చెందిన వారు లొంగిపోయిన వారిలో ఉన్నారు. ఇందులో 14 మందిపై రూ.68 లక్షల రివార్డు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. తక్షణ సాయంగా రూ.25 వేల చొప్పున చెక్కులు అందించారు. ఇది ప్రభుత్వ పునరావాస విధానంతో పాటు భద్రతా బలగాల విజయమని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ పేర్కొన్నారు.

ప్రధాని ప్రైవేట్ సెక్రటరీగా నిధి తివారీ

(మొదటిపేజీ తరువాయి)

పని చేశారు. 2023 జనవరి 6 నుంచి ప్రధానమంత్రి కార్యాలయంలో డిప్యూటీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. 2022లో ఆమె అండర్ సెక్రటరీగా చేరారు. పీఎంవోలో చేరడానికి ముందు నిధి తివారీ విదేశాంగ మంత్రిత్వశాఖలో పనిచేశారు. ఆమె నిరాయుధీకరణ, అంతర్జాతీయ భద్రతా వ్యవహారాల విభాగంలో బాధ్యతలు నిర్వర్తించారు. అంతర్జాతీయ సంబంధాల మెరుగుదలలో ఆమెకు ఉన్న నైపుణ్యమే పీఎంవోలో కీలకపాత్ర పోషించే స్థాయికి తీసుకొచ్చింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌కు ఫారెన్ అండ్ సెక్యూరిటీకి చెందిన అంశాలను నేరుగా ఆయనకు నివేదించడంలో నిధి తివారీ కీలకపాత్ర వహించారు. ప్రస్తుతం డిప్యూటీ సెక్రటరీగా వ్యవహరిస్తున్న నిధి... త్వరలో కొత్త బాధ్యతలు చేపట్టనున్నారు. అందుకు సంబంధించిన ఆదేశాలు త్వరలో వెల్లడించనున్నామని డీవోపీటీ ఒక ప్రకటనలో పేర్కొంది.

రాజీవ్ యువ వికాసానికి అధిక దరఖాస్తులు

(మొదటిపేజీ తరువాయి)

వర్తిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలలోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.రెండు లక్షలలోపు ఉండాలన్నారు. దరఖాస్తు పత్రాలన్నింటినీ మున్సిపల్ లేదా ఎంపీడీవో కార్యాలయాల్లో అందించాలన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కూకట్ పల్లి ఎమ్మార్వో కార్యాలయం నుంచి కలెక్టర్ గౌతం మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటివరకు సుమారు 15,500 పైగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు రిజిస్టర్ అయ్యాయని తెలిపారు. వరుస సెలవులు వచ్చినందున గడువు ముగింపు తేదీ పెంచాలని కోరారు. కూకట్‌పల్లి ఎమ్మార్వో స్వామి, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి వినోద్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్ పాల్గొన్నారు.

యువతిపై సామూహిక అత్యాచారం

(మొదటిపేజీ తరువాయి)

అఘాయిత్యానికి పాల్పడిన వారిలో ఆరుగురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. మరో ఇద్దరి జాడ కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

నిందితులు ఎవరైనా వదిలేది లేదు: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

సామూహిక అత్యాచార సంఘటనలో నిందితులు ఎవరైనా వదిలేది లేదని, వారిని వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్పీని కోరానని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఘటన పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పవిత్ర ప్రదేశంలో ఈ దురాగతానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. అత్యాచారానికి పాల్పడిన వారు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారని తన దృష్టికి వచ్చిందన్నారు. అయితే దారుణానికి పాల్పడింది ఎవరైనప్పటికీ తాను రాజకీయాలు చేయదలచుకోలేదని, బాధిత యువతికి న్యాయం చేయాలన్నదే తన ఉద్దేశమని చెప్పారు. బాధిత యువతికి అండగా ఉంటానని అనిరుధ్ రెడ్డి హామీ ఇచ్చారు. ఊర్కొండ పోలీసులతో కూడా మాట్లాడి ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చి రాత్రి పూట బస చేసే భక్తులకు రక్షణ కల్పించాలని, గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

'నోబెల్ శాంతి' రేసులో ఇమ్రాన్‌ఖాన్

(మొదటిపేజీ తరువాయి)

నామినేట్ చేయడం గర్వంగా ఉంది" అని పార్టియట్ సెంట్రం ఒక ప్రకటనలో తెలిపింది. 2019లో కూడా ఇమ్రాన్ ఖాన్‌ను నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేశారు. దక్షిణాసియాలో శాంతిని ప్రోత్సహించేందుకు ఆయన చేసిన కృషికి ఈ నామినేషన్ లభించింది. ప్రతి సంవత్సరం నార్వే నోబెల్ కమిటీ వందలాది నామినేషన్లు అందుకుంటుంది. ఆ తర్వాత ఎనిమిది నెలలపాటు జరిగిన ఎంపిక ప్రక్రియలో విజేతను నిర్ణయిస్తారు. పాకిస్థాన్ ప్రధాన ప్రతిపక్ష పార్టీ పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పీటీఐ) స్థాపకుడైన ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి జైల్లో ఉన్నారు. అధికార దుర్వినియోగం, అవినీతికి సంబంధించి ఆయనకు 14 సంవత్సరాల జైలు శిక్ష విధించారు. ఇది ఆయనకు శిక్షపడిన నాలుగో ప్రధాన కేసు. ఇంతకు ముందు ఇమ్రాన్‌ఖాన్ పై ఉన్న ప్రభుత్వ బహుమతులను అమ్మడం, రహస్యాలను లీక్ చేయడం, అక్రమ వివాహం ఆరోపణల కేసుల్లో వచ్చిన శిక్షలను కోర్టులు రద్దు చేశాయి. కాగా 2022 ఏప్రిల్‌లో అవిశ్వాస ఓటుతో ఇమ్రాన్‌ఖాన్ ప్రధానమంత్రి పదవి కోల్పోయారు. తనపై ఉన్న అన్ని ఆరోపణలను రాజకీయ కుట్రగా ఆయన అనేకసార్లు ఖండించారు.

మూడు నెలలూ మండే ఎండలే!

(మొదటిపేజీ తరువాయి)

సాధారణం కన్నా అధికంగా ఉండనున్నట్లు ఐఎండీ చీఫ్ మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉత్తర, ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలతో పాటు మధ్య, వాయువ్య భారతంలో రెండు లేదా నాలుగు రోజుల పాటు అధిక ఉష్ణోగ్రత దినాలు నమోదు కానున్నట్లు వివరించారు. సాధారణంగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు భారత్‌లో నాలుగు నుంచి ఏడు అత్యధిక వేడిమి రోజులు ఉంటాయని ఈసారి ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు చెప్పారు. వాయువ్య ప్రాంతంలో ఈసారి వేడిమి రోజుల సంఖ్య రెట్టింపు కానున్నట్లు ఐఎండీ అధికారి తెలిపారు. రాజస్తాన్, గుజరాత్, హర్యానా, పంజాబ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, చత్తీస్‌గఢ్, తెలంగాణ, ఏపీ, తమిళనాడుతో పాటు కర్నాటక ఉత్తర ప్రాంతంలో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. ఈ వేసవి కాలంలో దేశ వ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ పెరగనున్నట్లు మహాపాత్ర చెప్పారు. గత ఏడాది మే 30న దేశ వ్యాప్తంగా 250 గిగావాట్ల వినియోగం జరిగిందని, ఇది 6.3 శాతం ఎక్కువని అన్నారు.

విద్య కాషాయీకరణకే...

(మొదటిపేజీ తరువాయి)

మండిపడ్డారు. పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వంతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాలలో వాళ్లు అనుసరిస్తున్న విధానాలను బట్టి అర్థం చేసుకోవచ్చునని అన్నారు. కొత్త విద్యా విధానం ద్వారా అధికార కేంద్రీకరణ, ప్రైవేట్ రంగం ఔట్ సోర్సింగ్ ద్వారా వ్యాపారీకరణ, పాఠ్యపుస్తకాలు, పాఠ్యాంశాలు, విద్యా సంస్థల కాషాయీకరణ లక్ష్యంగా ఈ పాలసీ తీసుకొచ్చారని సోనియా విమర్శించారు. దేశంలో బీజేపీ అధికారం చేపట్టాక... 2014 నుండి 89,441 పాఠశాలలు మూతబడ్డాయని సోనియా పేర్కొన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ నిధులు విడుదల చేయకపోవడం, విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్ల ఏకపక్ష నియామకాన్ని ఆమె తప్పు బట్టారు. మహాత్మా గాంధీ హత్యను పాఠ్యపుస్తకాల నుండి తొలగించడం, విశ్వవిద్యాలయాలను రుణాలపై ఆధారపడేలా చేయడం, విద్యార్థుల ఫీజులు పెంచడం వంటి చర్యలతో కేంద్రం చరిత్రను తిరిగి రాస్తోందని సోనియా ఆరోపించారు. గత దశాబ్ద కాలంలో విద్యాపరంగా కేంద్ర ప్రభుత్వం మూడు ప్రధాన ఎజెండా అంశాలను విజయవంతంగా అమలు చేయడంపై మాత్రమే శ్రద్ధ చూపుతోందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో విద్యామంత్రులతో కూడిన సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (సీఏబీఈ) సెప్టెంబర్ 2019 నుండి సమావేశమవ్వలేదని ఆమె వెల్లడించారు. 2025 నాటి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ముసాయిదా మార్గదర్శకాలను కూడా ఆమె 'క్రూరమైనది' అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలచే స్థాపించబడిన, నిధులు సమకూర్చబడిన, నిర్వహించబడుతున్న విశ్వవిద్యాలయాలలో వైస్-ఛాన్సలర్ల నియామకం నుండి ఆయా ప్రభుత్వాలను పూర్తిగా మినహాయించారని పేర్కొన్నారు. 'ఇది ఉమ్మడి జాబితాలోని ఒక అంశాన్ని కేంద్ర ప్రభుత్వ ఏకైక అధీనంలోకి మార్చడానికి దొడ్డిదారి ప్రయత్నం. సమాఖ్య వాదానికి అత్యంత తీవ్రమైన ముప్పులలో ఒకటి' అని ఆమె ఆరోపించారు. ఎన్‌ఈపీకి పూర్తి అనుగుణంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను వాణిజ్యీకరించడం ప్రత్యక్షంగా జరుగుతోందని కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఆరోపించారు. దేశంలోని పేదలు ప్రభుత్వ విద్య నుండి బలవంతంగా తొలగించబడ్డారని, చాలా ఖరీదైన, తక్కువ నియంత్రణ కలిగిన ప్రైవేట్ పాఠశాల వ్యవస్థ చేతుల్లోకి నెట్టబడ్డారని ఆమె పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాషా విధానంపై కేంద్రం-తమిళనాడు మధ్య జరుగుతున్న పరిణామాలపై కేంద్రం అనుసరిస్తున్న తీరుకు నిరసనగా సోనియా ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే ఎన్‌ఈపీ-2020ని తమిళనాడు, తెలంగాణ తదితర రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తమిళనాడు ఏకంగా వ్యతిరేక ఉద్యమాన్నే నిర్మిస్తోంది. హిందీని బలవంతంగా రుద్దడంపై సీఎం స్టాలిన్ ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలను ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవలే చెన్నైలో దక్షిణాది రాష్ట్రాల అధ్వర్యంలో డీలిమిటేషన్, నూతన విద్యావిధానం, హిందీ బలవంతంగా రుద్దడంపై సమావేశం నిర్వహించి బలమైన సంకేతం పంపారు. ఈ క్రమంలో జాతీయ విద్యా విధానంపై కేంద్రం అనుసరిస్తున్న విధానాలపై సోనియాగాంధీ తీవ్రస్థాయిలో విమర్శలకు దిగారు.

ఇటలీ కళ్లజోడు తొలగించండి

సోనియా విమర్శలపై బీజేపీ ఎదురుదాడి

న్యూదిల్లీ: జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)పై సోనియాగాంధీ చేసిన బీజేపీ కొట్టిపారేసింది. సోనియా విమర్శలు పరిశీలిస్తే... భారతదేశ వృద్ధిని అణచివేసిన వలసరాజ్యాల యుగం విధానాలకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని ఆరోపించింది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎన్‌ఈపీని సమర్థించారు. వలస విద్యా విధానాల వల్ల కలిగే నష్టాన్ని తొలగించడానికి ఇది అవసరమైన చర్య అన్నారు. ఎన్‌ఈపీ అంటే భారతదేశ విద్యా వ్యవస్థ 'భారతీయీకరణ'గా పేర్కొన్నారు. సోనియా ఇది అర్థం చేసుకోవాలన్నారు. అని నేను భావిస్తున్నాను. మన దేశాన్ని బానిసలుగా మార్చడానికి మెకాలే తీసుకువచ్చిన విద్యా విధానాన్ని భర్తీ చేస్తే, ఏ దేశభక్తుడైనా దానికి మద్దతు ఇస్తాడు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ స్పందిస్తూ... సోనియా భారతదేశాన్ని "వలసవాద కటకం" ద్వారా చూస్తున్నారని ఆరోపించారు. 'స్వాతంత్ర్యం వచ్చిన 60 సంవత్సరాల పాటు, కాంగ్రెస్ దేశాన్ని వలస వాద మనస్తత్వం గుప్పిట్లో ఉంచింది. భారతదేశ అద్భుత చరిత్రను బోధించడానికి బదులుగా, కాంగ్రెస్ విద్య ద్వారా మతతత్వం, బుజ్జగింపును వ్యాప్తి చేసింది. సోనియా గాంధీ తన కళ్ల నుండి ఇటాలియన్ కళ్లద్దాలను తొలగించుకుంటేనే నిజమైన దేశభక్తిని చూడగలుగుతారు' అని చుగ్ విమర్శించారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సయ్యద్ షానవాజ్ హుస్సేన్ స్పందిస్తూ... సోనియా కాలం చెల్లిన విభజన వ్యవస్థను సమర్థిస్తున్నారన్నారు. 'దేశ విద్యా విధానం అద్భుతమైనది. కానీ సోనియా గాంధీ దానిని వ్యతిరేకిస్తున్నారు. ప్రజలను రెచ్చగొట్టే విద్యా విధానాన్ని ఆమె ఇష్టపడతారు. ఆమె భారతదేశ విద్యా విధానాన్ని ప్రశ్నించడం దురదృష్టకరం" అని హుస్సేన్ అన్నారు. తెలంగాణ బీజేపీ అధికార ప్రతినిధి తుల్లా వీరేందర్ గౌడ్ స్పందిస్తూ... 'కేంద్రీకరణ, వాణిజ్యీకరణ, మత తత్వం గురించి సోనియా గాంధీ విలపించడం కపట నాటకం. కాంగ్రెస్ దశాబ్దాలుగా ఈ మూడింటినీ చేసింది. కాంగ్రెస్ స్కామ్‌లతో నిండిన విద్యా వ్యవస్థను నడిపింది. ఇక్కడ రాష్ట్రాలు కేవలం వాటాను మాత్రమే పంచుకున్నాయి. కాంగ్రెస్ భారతీయ విద్యకు నిధుల కొరతను మిగిల్చింది, విద్యార్థులను ప్రైవేట్ చేతుల్లోకి నెట్టివేసింది. ఎన్‌ఈపీ ప్రభుత్వ విద్య వ్యయాన్ని జీడీపీలో 6%కి పెంచుతుంది. స్కాలర్‌షిప్‌లు, డిజిటల్ విశ్వవిద్యాలయాలను అందిస్తుంది. కాంగ్రెస్ హయాంలో ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలు ఆక్రమణదారులను కీర్తించాయి. భారతదేశ వారసత్వాన్ని తుడిచిపెట్టాయి. ఎన్‌ఈపీ దీనిని సరిదిద్దుతుంది. విద్యను రాజకీయ అజెండాలలో కాకుండా సత్యంలో పాతుకుపోయేలా చేస్తుంది. భారతదేశ విద్య, బ్రెయిన్‌వాషింగ్‌పై వారి నియంత్రణను కోల్పోయినందున కాంగ్రెస్ " ఎన్‌ఈపీకి భయపడుతుంది" అని గౌడ్ 'ఎక్స్' వేదికగా రాసుకొచ్చారు.

హైదరాబాద్‌లో వాన్‌గార్డ్ జీసీసీ

(మొదటిపేజీ తరువాయి)

స్థాయిలో హైదరాబాద్ మరింత బలపడుతుందని చెప్పారు. ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామని కంపెనీ ప్రతినిధులకు భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లో వైవిధ్యమైన ప్రతిభతో పాటు, జీవననాణ్యత, సాంకేతిక నైపుణ్యం, ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణముందని కంపెనీ సీఈవో సలీం రాంజీ అభిప్రాయపడ్డారు. తమ వినియోగదారులకు ప్రపంచస్థాయి సేవలను అందించటంతో పాటు ఏఐ, మొబైల్, క్లౌడ్ టెక్నాలజీలో ప్రతిభావంతులైన ఇంజినీర్లకు అవకాశాలు కల్పించటం తమకు సంతోషంగా ఉందన్నారు. సీఎంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులు ఉన్నారు.

'వక్ఫ్' బిల్లును అడ్డుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలోనే సోదరభావం, మతసామరస్యానికి కొత్తగూడెం నియోజకవర్గం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పండుగలన్నీ ఐకమత్యంతో జరుపుకుంటారని వివరించారు. భిన్న మతాలు, విభిన్న కులాల సమ్మేళనమే భారత దేశమన్నారు. కలిసుంటేనే సమాజంలో సమగ్రత, దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ముస్లిం కుటుంబాలు తమ సంపాదనలో కొంతభాగాన్ని పేదల ఆకలితీర్చేందుకు కేటాయించడం మహోన్నతమైన ఆదర్శమన్నారు. మహమ్మద్ ప్రవక్త బోధనలు ఆచరిస్తే సమాజంలో శాంతి వర్థిల్లుతుందన్నారు. ముస్లింలకు రాంజ్యాంగం ప్రసాదించిన హక్కులను కాలరాసే కుట్రలకు మోదీ ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు దేశ లౌకిక, ప్రజాస్వామిక వ్యవస్థకు పెను ప్రమాదమన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ లు కావాలనే ఇలాంటి రాజ్యాంగ వ్యతిరేక కుట్రలకు పాల్పడుతున్నట్లు ధ్వజమెత్తారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా, ఉర్దూఘర్ చైర్మన్ నయీమ్ ఖురేషి, ఈద్గాల అధ్యక్షులు ఫారూఖ్ ఎజ్దాని, అబ్దుల్ రబ్, డీఎస్పీ రహమాన్, సంఘాల పెద్దలు అబిద్ హుస్సేన్, జహంగీర్ షరీఫ్, యండి. యూసుఫ్, జావీద్ సాటే, అబ్దుల్ బాసిత్, ఖాద్రి, యాకుబ్, నాగా సీతారాములు, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, ధర్మరాజు, బోయిన విజయ్ కుమార్, నేరెళ్ల శ్రీనివాస్, సత్యనారాయణాచారి పాల్గొన్నారు.

రాజీవ్ యువవికాస పథకంపై దృష్టి పెట్టండి

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోండి : కలెక్టర్ జితేష్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : అత్యధిక సబ్సిడీతో రుణాల అందించనున్న రాజీవ్ యువ వికాస్ పథకానికి వీలైనంత ఎక్కువమంది అర్హులు దరఖాస్తులు చేసునేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఈ పథకంపై ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని దాదాపు 5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర వెనకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా ఎదిగేందుకై ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు భట్టి స్పష్టం చేసారు. ఈ పథకం అమలు ద్వారా రాష్ట్రంలో నిరుద్యోగం తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అర్హులైన వారు ఏప్రిల్ 14, 2025 లోపు దరఖాస్తు చేసుకునే విధంగా అధికారులు యువతకు అవగాహన కల్పించాలన్నారు. రూ.50 వేల లోపు రుణం వంద శాతం మాఫీ కాగా రూ. లక్ష లోపు రుణానికి 90 శాతం మాఫీ ఉంటుందన్నారు. అదే లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం రాయితీ ఉండగా రూ. 2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు 70 శాతం రాయితీ లభిస్తుందన్నారు. రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని బ్యాంకు లోన్ల ద్వారా అందిస్తారని చెప్పారు. ఈ పథకం కుటుంబంలో ఒక్కరికే వర్తిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షల లోపు ఉండాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ. 2 లక్షల లోపు ఉండాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ ఈ పథకానికి ఎక్కువమంది అర్హులు దరఖాస్తులు చేసుకునే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా శాఖల ద్వారా పలుమార్లు పత్రిక ప్రకటనలు ఇచ్చామన్నారు. దరఖాస్తులు చేసుకున్న తర్వాత వాటిని తీసుకొని కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన హెల్ప్ డెస్క్ లలో ఆన్లైన్లో ఎంట్రీ చేస్తున్నామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, మైనార్టీ అధికారి సంజీవరావు, ఎస్సీ కార్పొరేషన్ ఉపేందర్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి అనసూయ, మెప్మా పిడి రాజేష్, డి ఆర్ డి ఓ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులు శేష జీవితాన్ని కుటుంబంతో సంతోషంగా గడపాలి

ఎస్పీ రోహిత్ రాజు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఇంతకాలం బాధ్యతగా విధి నిర్వహణ చేశామనే తృప్తితో శేష జీవితాన్ని కుటుంబానికి కేటాయించి సంతోషంగా గడపాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పోలీస్ అధికారులను కోరారు. జిల్లాలో పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీస్ అధికారుల దంపతులతో సహా సోమవారం జిల్లా కేంద్రంలోని తల కార్యాలయంలో ఎస్పీ ఘనంగా సత్కరించి సన్మానించారు. స్పెషల్ బ్రాంచ్ విభాగంలో ఎస్సైగా పనిచేస్తూ ఉమ్మడి జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన సూరిశెట్టి శ్రీనివాసరావును, అశ్వరావుపేటలో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ విరమణ పొందిన రెహమాన్‌తో పాటు అనారోగ్య సమస్యలతో వాలంటరీ రిటైర్మెంట్ పొందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ వజ్జ రామయ్య లను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డీఎస్పీ మల్లయ్య స్వామి, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఎస్బి ఇన్స్పెక్టర్ నాగరాజు, పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచారానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తుల అరెస్ట్:ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : అత్యాచారానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బాధితులు ఈనెల 24న పనిమీద సంగారెడ్డి పట్టణానికి వచ్చి, అనంతరం తిరిగి వారి ఆటోలో ఇంటికి వెళ్లుతుండగా దాదాపుగా రాత్రి ఒంటిగంట సమయంలో సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో గల మామిడిపల్లి చౌరస్తా వద్ద ఫిర్యాది భర్త మూత్ర విసర్జనకై ఆటోను ఆపగా, అదే సమయంలో తెలుపు రంగు గల స్కూటీపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు, ఫిర్యాది భర్తను కొట్టి, బాధితురాలిని స్కూటీపై నాందేడ్ హైవే పక్కన ఉన్న సర్వీస్ రోడ్డు గుండా నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకొని వెళ్ళి, ఇద్దరు వ్యక్తులు ఆమెపై బలవంతంగా అత్యాచారం చేశారని, సంగారెడ్డి రూరల్ పోలీసుస్టేషన్ నందు ధరఖాస్తు చేయగా సోమవారం ఉదయం 7 గంటలకు వారి ఇంటివద్ద అదుపులోనికి తీసుకోవడం జరిగిందని, నేరానికి వినియోగించిన స్కూటీ, 2-సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకొని, రిమాండుకు తరలించడం జరుగుతుందని ఎస్పీ వివరించారు. మహిళలు ఒంటరిగా ఉన్న సమయంలో మీ చుట్టూ ఎవరైయన అనుమానస్పదంగా కనిపించిన వెంటనే 100 డైల్ చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు.

వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లుపై ముస్లింల నిరసన

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు మండలంలో ముస్లింలు రంజాన్ పండుగ రోజున కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లుపై ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. ముస్లిం పెద్దలు ర్యాలీగా చేపట్టి మాట్లాడుతూ ముస్లింలను అణగతొక్కడానికి వివిధ రకాలుగా ప్రయత్నాలు జరుగుతున్నాయని రకరకాల సమస్యలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా ముస్లింలను అణగదొక్కడానికి చేయరాని పని అంటూ ఏది లేదని అలా చేస్తే తగిన చర్యలకు గురైతారని హెచ్చరించారు. వక్ఫ్ బోర్డు హక్కులను ముస్లింలకు చెందుతాయని బిజెపి ప్రభుత్వం ఆ హక్కులను లాగేసుకోవడానికి ప్రయత్నిస్తుందని, సవరణ బిల్లులో ముస్లింలకు సంబంధించిన వారిని కాకుండా మిగతా కులాల వారిని బోర్డులో భాగస్వామ్యం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ముస్లింలంతా ఏకతాటిపై కలిసికట్టుగా పోరాటం చేయాలని పెద్దలు పిలుపునిచ్చారు. మత పెద్దలు సలీం, ఖదీర్, కాసిం, యాకూబ్ ఖలీల్, ఇబ్రహీం, హుస్సేన్, రెహమాన్, యాకుబ్ పాషలు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబుబాబాద్, తొర్రూర్ : రంజాన్ పర్వదినం లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి తెలిపారు. రంజాన్ పర్వదినం సందర్భంగా జరిగిన వేడుకల్లో ఝాన్సీ రాజేందర్‌రెడ్డి పాల్గొని ముస్లింలు ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈద్-ఉల్-ఫితర్ వేడుకలను కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు.గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని పేర్కొన్నారు. శాంతి, ప్రేమ, దయాగుణాలను ప్రబోధిస్తుందని తన సందేశంలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని మతాలు, కులాలను సమానంగా చూస్తారన్నారు. తెలంగాణలో మైనారిటీలతో పాటు ప్రజలంతా సుఖశాంతులతో జీవిస్తున్నారని, అందరి భద్రతకు, సంక్షేమానికి సీఎం ప్రాధాన్యతనిస్తున్నారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, పెదగాని సోమయ్య, చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్, చెవిటి సధాకర్, దేవేందర్ రెడ్డి, మంగళపల్లి రామచంద్రయ్య, సురేందర్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, బిక్షం గౌడ్, యాకూబ్ రెడ్డి, మెరుగు మల్లేశం గౌడ్, తూనం శ్రావణ్ కుమార్, రమేష్ గౌడ్, ముద్దం మహబూబ్ రెడ్డి, మొగుళ్ల లింగన్న గౌడ్, బాలకృష్ణ, వెలుగు మహేశ్వరి, చిదిరాల రవి, రమేష్ నాయక్, ముస్లిం సోదరులు అలీమ్, జలీల్, చాంద్ పాషా, అమీర్, షాబీర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన కోటమైసమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు

చైర్మన్ పర్సా పట్టాభి రామారావు దంపతుల ఆధ్వర్యంలో హోమాలు

విశాలాంధ్ర - కారేపల్లి : మండల పరిధిలోని ఉసిరి కాయలపల్లి కోట మైసమ్మ దేవాలయం ప్రాంగణంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న పవిత్ర బ్రహ్మోత్సవాలు సోమవారం నుండి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ చైర్మన్ పర్సా పట్టాభి రామారావు-విజయలక్ష్మి దంపతులతో పాటు, దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ ఎం.వీరస్వామిలు ఉత్సవాలను ప్రారంభించగా ఆలయ ప్రధాన అర్చకుడు కొత్తలంక కైలాస శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటిరోజు ఇల్లందు పట్టణానికి చెందిన మార్గదర్శిని విద్యాసంస్థల యాజమాన్యం భక్తులకు అన్నదానమును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి వేణుగోపాలచార్యులు, సిబ్బంది పగడాల మోహనకృష్ణ, పర్స లలిత సాయి, అన్నదాతలు కడవెండి వేణుగోపాల్ గుప్తా, అర్వపల్లి రాధాకృష్ణ, తాటిపల్లి సుబ్బారావు, వ్యామసాని జనార్దన్‌రావు, ఎలుగూరి మధుబాబు, గందె సురేష్, కొల్లూరు సతీష్, సైఫా రాజశేఖర్, చందా చక్రధర్, భువనగిరి రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కళ్యాణానికి మాజీ మంత్రికి ఆహ్వానం

విశాలాంధ్ర-వనపర్తి : మాజీ కౌన్సిలర్ కంచె రవి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డినీ కలుసుకుని శ్రీరామనవమి సందర్భంగా ఏప్రిల్ 6వ తేదీన తిరుమల కాలనీ (6వార్డ్) నందు సీతారాముల కల్యాణం కోసం రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రమేష్, మహేష్, గోకం బాలరాజు, శివ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోటలో మార్చి 27 న ప్రేమ పేరుతో హత్య కాబడ్డ పూరెళ్ళ సాయి కుమార్ ది పరువు హత్య కాదని, కుట్రపూరితంగా చేసిన హత్యేనని పౌరహక్కుల, విప్లవ రచయితల సంఘం, తెలంగాణ ప్రజా ఫ్రంట్, దళిత లిబరేషన్ ఫ్రంట్ నాయకులు అన్నారు. హత్య జరిగిన ప్రదేశాన్ని సందర్శించిన అనంతరం మృతుని కుటుంబ సభ్యులతో వివరాలు సేకరించారు. అనంతరం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాధన కుమారస్వామి, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడీ సుదర్శన్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య మాట్లాడుతూ ముప్పిరితోట గౌడ కులంకు చెందిన పూరెళ్ల పరుశరాములు-జ్యోత్స్నల కొడుకు సాయి కుమార్ పదవ తరగతి పూర్తి చేసి డ్రైవర్ గా పనిచేస్తున్నాడని, అదే గ్రామం ముదిరాజ్ కులానికి చెందిన ముత్యం సమత-సదయ్యల కుమార్తె గత రెండు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారని తెలిసినట్లు వివరించారు. ప్రేమ వ్యవహారం, పెళ్లి ఇష్టం లేని అమ్మాయి తల్లిదండ్రులు ముత్యం సదయ్య, సమత, రంగాపూర్ గ్రామానికి చెందిన అమ్మాయి మేన మామ సిద్ద సారయ్య, అదే గ్రామానికి చెందిన చీకటి మల్లయ్య అతని కొడుకు చీకటి హరీష్‌ల ప్రోద్భలంతో హత్యకు కుట్ర పన్నారని పేర్కొన్నారు. స్నేహితులతో కలిసి తన పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్న సాయి కుమార్ ను విచక్షణ రహితంగా గొడ్డలితో నరికి చంపారని తమ విచారణలో తేలిందన్నారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అమ్మాయి తల్లిదండ్రులు ముత్యం సదయ్య - సమత, మేనమామ సిద్ద సారయ్య, చీకటి మల్లయ్య, హరీష్‌లలో ముగ్గురిని మాత్రమే అరెస్ట్ చేసారని కీలక వ్యక్తులు చీకటి మల్లయ్య, హరీష్ లను ఇంత వరకు అరెస్ట్ చేయలేదని వారు ఆరోపించారు. సమగ్ర విచారణ జరిపించి హంతకులను కఠినంగా శిక్షించాలని, మిగితా ఇద్దరినీ వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. కేసు విచారణ కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ఏర్పాటు చేయాలని, సాయి కుమార్ కుటుంబానికి ఒక కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శ్రీపతి రాజగోపాల్, విప్లవ రచయితల సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, పౌరహక్కుల సంఘం నాయకులు బొంకూరి లక్ష్మణ్, ఎన్. సత్యనారాయణ, పుట్ట రాజన్న, రెడ్డిరాజుల సంపత్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి : సిఐ

విశాలాంధ్ర- తొర్రూరు : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తొరూరు సిఐ గణేష్ అన్నారు. సోమవారం డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం అకాడమీ డైరెక్టర్ యువ కవి పున్నమి వెన్నెల ఫేం సైబర్ యోధుడు చిర్ర సతీష్ ఆధ్వర్యంలో తొర్రూరు సర్కిల్ ఇన్స్ పెక్టర్ కార్యాలయంలో సైబర్ నేరాలపై యుద్ధం సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుందాం సైబర్ నేరాల నివారణ కోసం కృషి చేద్దాం అనే వాల్ పోస్టర్ ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా తొర్రూరు పోలీస్ సర్కిల్ ఇన్స్ పెక్టర్ గణేష్ మాట్లాడుతూ టెక్నాలజీ పెరిగిన కొద్ది (ఆన్ లైన్ మోసాలు) సైబర్ మోసాలు పెరిగాయని, ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలనీ, ఇప్పుడు సైబర్ మోసాలు దేశానికి సరికొత్త సవాల్‌గా మారిందన్నారు.మహబూబాబాద్ జిల్లా సైబర్ యోధుడు యువ కవి పున్నమి వెన్నెల ఫేం చిర్ర సతీష్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ఎవరిని గుడ్డిగా నమ్మవద్దుని, అపరిచిత వ్యక్తులకి ఆధార్ కార్డు నంబర్, బ్యాంకు ఖాతా వివరాలు, పాన్ కార్డు నంబర్, ఎటిఎం పిన్ నెంబర్ ఎవరికీ తెలుపొద్దుని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వ్యాపార ప్రకటనలు నమ్మవద్దుని, ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలనీ ఆయన తెలిపారు.ఈ సైబర్ నేరాల నుండి బయటపడడానికి అవగాహనే సరైన పరిష్కారం అని, సైబర్ నేర రహిత భారతదేశం కోసం అందరూ కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సబ్ ఇన్స్ పెక్టర్ ఉపేందర్, సెకండ్ ఎస్ఐ రాంజీ నాయక్, స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు వాసి కిరణ్‌కు డాక్టరేట్ ప్రదానం

విశాలాంధ్ర - ఇల్లందు : పట్టణం పరిధిలోని 23వ వార్డు, 24 ఏరియాకి చెందిన ఓరం అశోక్ కుమార్, అనసూయ దంపతుల రెండవ కుమారుడు ఓరం కిరణ్ కుమార్ ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టా పొందారు. తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన హైడ్రా విభాగంలో సైంటిస్టుగా పనిచేస్తున్న కిరణ్ కరీంనగర్ జిల్లా శనిగారం ప్రాజెక్టులో నీటి పారుదల, లభ్యత, ఉపయోగంపై జియోగ్రాఫి ఇన్ఫర్మేషన్ సిస్టం, రిమోట్ సెన్సింగ్ విధానాలపై పరిశోధనలు చేసినందుకు గాను ఉస్మానియా యూనివర్సిటీ ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కిరణ్ మీడియాతో మాట్లాడుతూ, జియోగ్రఫీ ఇన్ఫర్మేషన్ సిస్టం రిమోట్ సెన్సింగ్ వలన కలిగే ఉపయోగాల పైనా కరీంనగర్ జిల్లాలోని శనిగరం ప్రాజెక్టు నీటిపారుదల నిర్వహణ పై పరిశోధనలు చేసినట్లు తెలిపారు. తాను చేసిన పరిశోధనలకు ప్రొఫెసర్ గీతారెడ్డి అనంత్ సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ఈ సందర్భంగా తనకు అన్ని విధాలా సహకరించిన గీతా రెడ్డి తో పాటు, ఇతర ప్రొఫెసర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కిరణ్ డాక్టర్ పొందిన సందర్భంగా తోటి ఉద్యోగులు, చిన్ననాటి స్నేహితులు ఏరియా పెద్దలు కిరణ్ కు అభినందనలు తెలిపారు.

పాలిటెక్నిక్ డిప్లొమా నుండి మొదలైన ప్రస్థానం

నేడు సింగరేణి డైరెక్టర్ స్థాయికి వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : కేవలం పాలిటెక్నిక్ డిప్లొమా స్థాయి నుంచి మొదలైన చదువుల ప్రస్థానం నిరంతర శ్రమ, ఏకాగ్రత, పట్టుదలతో సింగరేణి డైరెక్టర్ స్థాయికి ఎదిగేలా చేసింది. కృషి ఉంటే ఋషులవుతారనే భాష్యం డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) కె.వెంకటేశ్వర్లు విషయంలో స్ఫూర్తిదాయకంగా కనిపిస్తుంది. ఇటీవల పదోన్నతి పొందుతూ ఆయన డైరెక్టర్ విధుల్లో చేరి చిన్న పెద్ద లేకుండా అందరితో సమాన దృక్పథాన్ని ప్రదర్శించడం గమనార్హం. సింగరేణి ఉద్యోగుల పిల్లలు సింగరేణి పాలిటెక్నిక్ విద్యా సౌకర్యాలను వినియోగించుకోవాలని అయన తరచూ చెప్తున్నారు. తన చదువుల అనుభవాలను, జీవన ప్రస్థానాన్ని విద్యార్థులతో పంచుకుంటున్నారు. తాను తన విద్యా జీవితాన్ని మైనింగ్ ఇంజనీరింగ్‌లో డిప్లొమాతో ప్రారంభించినట్లు చెప్తున్నారు. దేన్నీ తక్కువ చేసి చూడకూడదనేది ఆయన భావజాలం. ఆ తర్వాత ఏఎంఐఇ (ఏఎమ్ఐఈ) పూర్తి చేసినట్లు వెంకటేశ్వర్లు వివరించారు. సింగరేణిలో వృత్తిపరంగా ఇంత బిజీ లో కూడా ప్రస్తుతం పీజీ డిప్లొమా ఇన్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌ను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. ఈ స్థాయికి చేరుకోవడంలో తన కృషి, అంకితభావం కీలకమని ఆయన వివరించారు. తన ప్రసంగంలో ఆయన విద్యార్థులకు కీలక సందేశాలు ఇస్తుంటారు. డిప్లొమా ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత ఉద్యోగాల కోసం ప్రాధాన్యత ఇవ్వకూడదని సూచించారు. డిప్లొమా పూర్తయ్యే సమయానికి విద్యార్థుల వయస్సు గరిష్టంగా 18 సంవత్సరాలు మాత్రమే ఉంటుందన్నారు. కనీసం 25 సంవత్సరాల వయస్సు వరకు ఉన్నత విద్యను అభ్యసించాలని ఆయన సలహాఇస్తున్నారు. తన చదువుల రోజుల్లో ఎస్‌సీ పాలిటెక్నిక్‌లో ఇప్పటి తరహా సౌకర్యాలు లేవన్నారు. కంప్యూటర్లు, డిజిటల్ లైబ్రరీ, క్రీడా సౌకర్యాలు అందుబాటులో లేవని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు సింగరేణి కళాశాలలో అందుబాటులో ఉన్న అత్యాధునిక సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేవలం కొద్ది శాతం మంది విద్యార్థులు మాత్రమే కాకుండా అందరూ సమిష్టిగా విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుని, డిజిటల్ లైబ్రరీని ఉపయోగించి తాజా సాంకేతిక పరిజ్ఞానాన్ని అధ్యయనం చేయాలని డైరెక్టర్ సూచిస్తున్నారు. సమాంతరంగా క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు టీమ్ వర్క్, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునే వీలుంటుందన్నారు. ఉన్నత విద్య కోసం ప్రణాళికలు వేసుకుని, స్కాలర్‌షిప్‌లు, ఇంటర్న్‌షిప్‌ల వంటి అవకాశాలను అన్వేషించాలన్నారు. సాంకేతిక నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్, సమస్య పరిష్కార నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచిస్తున్నారు.

నూతన నర్సింగ్ కళాశాల భవనం ప్రారంభం

వైద్యరంగంలో నర్సుల పాత్ర ఎంతో త్యాగమయం : సీఎండీ బలరామ్

విశాలాంధ్ర - కొత్తగూడెం : వైద్య రంగంలో ప్రజలకు సేవలు అందించే నర్సుల పాత్ర ఎంతో త్యాగమయమని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరామ్ అన్నారు. వారి సేవలకు తగినంత గుర్తింపు సమాజం ఇవ్వాలని కోరారు. కొత్తగూడెం సింగరేణి మెయిన్ హాస్పిటల్‌లో రూ 3.46 కోట్ల వ్యయంతో అత్యధికంగా నిర్వహించిన సింగరేణి నర్సింగ్ కళాశాల భవనాన్ని ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఇంత అద్భుతమైన కళాశాలను తన చేతులతో ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. హాస్పిటల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.సుజాత అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభోత్సవానికి బలరామ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పేషెంట్లు హాస్పిటల్ లో చేరిన దగ్గర నుండి డిశ్చార్జ్ అయ్యే వరకు నర్సింగ్ సిబ్బంది ఎంతో అంకిత భావముతో సేవ చేస్తారని కొనియాడారు. సింగరేణి నర్సింగ్ కళాశాలను 1960 సంవత్సరము నుండి నిర్వహించు కుంటున్నట్లు చెప్పారు. కళాశాలలో విధ్య పూర్తి చేసుకున్న మొత్తం 825 మందిలో 500 మంది సింగరేణి సంస్థలో, 200 మంది ప్రభుత్వ ఆసుపత్రులలో, 153 మంది విదేశాలలో, ప్రైవేటు ఆసుపత్రులలో ఉద్యోగాలు పొందారన్నారు. 54 మంది ప్రస్తుతం కళాశాలలో చదువుతున్నారని, 21 మంది పరీక్షలు వ్రాసి ఫలితాల గురించి ఎదురుచూస్తున్నట్లు సీఎండీ వివరించారు. ప్రస్తుతం ఉన్న జీఎన్ఎం నర్సింగ్ కోర్సు తో పాటు బిఎస్‌సి నర్సింగ్ కోర్సు ను కూడా ప్రవేశపెట్టడానికి ప్రయత్నం చేస్తామన్నారు. సింగరేణి ప్రధాన ఆసుపత్రి సహా అన్ని ఏరియా ఆసుపత్రులను ఆధునికరించుకున్నట్లు చెప్పారు. త్వరలో మెయిన్ హాస్పిటల్ లొ సిటి, ఎంఆర్ఐ స్కాన్ ను ప్రారంభించుకోబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్లు డి.సత్యనారాయణ రావు, కే.వెంకటేశ్వర్లు, ఎల్.వి.సూర్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ ఎస్.వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం జనరల్ సెక్రటరీ సి.త్యాగరాజన్, సిఎంఓఏఐ ప్రెసిడెంట్ వెంకటా చారి, జీఎం(పర్సనల్) వెల్ఫేర్, కవితా నాయుడు, జిఎంలు సూర్యనారాయణ, దామోదర రావు, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, ఏసిఎంఓ ఎం.ఉష, ఏజిఎమ్ రాజీవ్ కుమార్, జి.సునీల, పి.రాజశేఖర్, డాక్టర్ మాలతి, మేట్రన్ మిస్ శాలి, రేణుక, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ భూముల వేలాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని సిపిఐ నేత టీజీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆదివారం విద్యార్థి సంఘాలు అడ్డుకుంటున్న ఆందోళనకారులను అక్రమ అరెస్టులు చేయటం హేయమైన చర్య అన్నారు. విద్యార్థి నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసారు. యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆక్రమించుకొని వేలం వేసేందుకు సిద్ధమైందన్నారు. ప్రభుత్వ ఆస్తులను ప్రవేట్ వ్యక్తులకు తాకట్టు పెట్టే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు. యూనివర్సిటీల అభివృద్ధికి కృషి చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా భూములనే కొల్లగొట్టడం బాధాకరమన్నారు. గత సియం కెసిఆర్ ను తలపించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని విమర్శించారు.

వక్ఫ్ బిల్లుపై తీవ్ర వ్యతిరేకత...

నల్ల బ్యాడ్జీలు ధరించి నమాజులో పాల్గొన్న ముస్లింలు

సంఘీభావం తెలిపిన వివిధ పార్టీలు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : కేంద్రంలో బిజెపి సారధ్యంలో ఉన్న ఎండిఎ ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులను హస్తగతం చేసుకునేందుకు కుట్రలు పన్నుతుందని దీన్ని ముస్లిం సమాజం ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోదని సంఘాల మత పెద్దలు, నాయకులు స్పష్టం చేస్తూ నిరసనలు తెలిపారు. ఆర్ఎస్ఎస్ భావజాలంతో ఉన్న బిజెపి ప్రభుత్వం అవకాశం చిక్కినప్పుడల్లా ముస్లిం సమాజాన్ని ఇబ్బందులకు గురిచేస్తుందని మత గురువులు ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లింలపై దేశవ్యాప్తంగా మోడీ సారధ్యంలోని ప్రభుత్వం ఇంత కాలం ఎన్ని దాడులు చేసినా, అక్రమ కేసుల్లో తమ యువతను నిర్బంధించినా, గోమాత పేర, మతఘర్షణాల పేర నేరుగా హత్యలు చేస్తున్నప్పటికి ఇంతకాలం సహిస్తూ వస్తున్నామని చెప్పారు. తాజాగా దేశవ్యాప్తంగా ఉన్న తమ పూర్వికులు దానం చేసిన వక్ఫ్ ఆస్తులను సైతం ఆర్ఎస్ఎస్, బిజెపి భావజాల కేంద్ర ప్రభుత్వం కాజేయాలని చూస్తే ముస్లింల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. రంజాన్ పండుగ నేపథ్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా ఈద్గా లలో జరిగిన ఈద్-ఉల్-ఫితర్ నమాజుల అనంతరం మతపండితులు అన్నిచోట్ల ఏక వాక్యాన్ని, తమ స్పష్టమైన దృక్పదాన్ని ప్రకటించారు. నల్ల రిబ్బన్ల నిరసన ఫోటోలను ముస్లిం వక్ఫ్ బోర్డు కేంద్ర నాయకత్వానికి వాట్సప్ ల ద్వారా పంపించారు. నమాజులకు వెళ్లే ముందే తమ కుడి చేతులకు నల్లబ్యాడ్జీలు ధరించి ప్రత్యేక ప్రార్థనలు పాల్గొన్నారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో ఉన్న ఈద్గాలలో మొత్తంగా ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ముస్లింలకు రాజ్యాంగబద్ధ హక్కుల హననం తాము కూడా సహించబోమని జిల్లా వ్యాప్తంగా సిపిఐ,సిపిఎం, కాంగ్రెస్, బి ఆర్ఎస్, న్యూ డెమోక్రసీ పార్టీల నాయకులు, ప్రతినిధులు ముస్లింలకు మద్దతుగా నిలిచారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలను ఈద్గాల వద్ద కలిసి ఆలింగనం చేసుకొని వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. దేశ సంపదలను, జాతీయ కంపెనీలను మోడీ ప్రభుత్వం పదేళ్ల కాలం నుంచి కుట్రపూరితంగానే తమ అనుకూల కార్పొరేట్ వ్యక్తులకు దార దత్తం చేస్తుందని వివిధ పార్టీల నాయకులు ఈ సందర్భంగా విమర్శలు చేశారు. కొత్తగూడెం ఈద్గాలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఏకంగా మోడీ విధానాలపై ఘాటైన విమర్శలు చేశారు. ముస్లిం సోదరులకు ఈ విషయంలో తమ పార్టీతోపాటు ఇండియా అలయెన్స్ లోని అన్ని పార్టీలు మద్దతు ప్రకటించాయని ఆయన గుర్తు చేశారు. మోడీ ముస్లింలను భయభ్రాంతులకు గురిచేసి రాజ్యాంగ విరుద్ధ విధానాలను అమలు చేస్తున్నారని కూనంనేని తీవ్రంగా విమర్శలు కూడా చేశారు. ఎన్నడూ లేని విధంగా ముస్లిం సమాజం తొలిసారిగా పండగ వేళ ప్రత్యేక నమాజుల్లో కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర అసంతృప్తి, నిరసన వ్యక్తం చేయటం దేశ చరిత్ర లోనే ఇది తొలిసారని ముస్లిం పెద్దలు వ్యాఖ్యానించడం గమనార్హం. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వంపై ముస్లింల ఆగ్రహ జ్వాలలు ఇంకా పెరుగుతాయని కమ్యూనిస్టు పార్టీల నాయకులు స్పష్టం చేస్తున్నారు.

సంపాదకీయం

ఆర్‌ఎస్‌ఎస్ ఆధిపత్యాన్ని అంగీకరించిన మోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం నాగపూర్ వెళ్లి ఆర్.ఎస్.ఎస్. ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఆర్.ఎస్.ఎస్. అధినేత మోహన్ భగవత్ తో చర్చలు జరిపారు. బీజేపీ ఆర్.ఎస్.ఎస్. ఛత్రఛాయల్లో నడిచే రాజకీయ పార్టీ కనక ఆ పార్టీ ప్రతినిధిగా ప్రధానమంత్రి నాగపూర్ వెళ్లడంలో ఆశ్చర్యం లేదు. ఇంతకు ముందు బీజేపీ ప్రభుత్వానికి మూడు సార్లు నాయకత్వం వహించిన అటల్ బిహారీ వాజపేయి కూడా ఆర్.ఎస్.ఎస్. ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన వారే. వాజపేయి లాగే మోదీ కూడా ఆర్.ఎస్.ఎస్. శ్రేణుల నుంచి రాజకీయ నాయకుడిగా ఎదిగిన వారే. అన్ని రాజకీయ పార్టీలకు అనుబంధంగా విద్యార్థి సంఘాలు, యువజన సంఘాల లాంటివి ఉంటాయి. కానీ బీజేపీ మాత్రం తమది స్వచ్ఛంద సంస్థ అని, రాజకీయాలతో సంబంధం లేదని ఎంతగా చెప్పుకున్నా అది ఆర్.ఎస్.ఎస్.కు అనుబంధ సంస్థే. దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చడం ఆర్.ఎస్.ఎస్. అంతిమ లక్ష్యం. ఆ మాట చెప్పకుండానే మోదీ అదే పని చేస్తున్నారు. తాను ఆర్.ఎస్.ఎస్. అడుగుజాడల్లో నడుస్తున్నందువల్ల ఇక తాను ఆ సంస్థకు లొంగి ఉండవలసిన అగత్యం లేదని మోదీ భావిస్తున్నట్టున్నారు. అందుకే ఆయన మోహన్ భగవత్‌ను ఖాతరు చేయని సందర్భాలున్నాయి. అలాగే అన్యాపదేశంగా మోహన్ భగవత్ ప్రధాన మంత్రి మోదీకి చురకలంటించిన సందర్భాలూ ఉన్నాయి. మోదీ ప్రధాన మంత్రి పదవి చేపట్టి పదకొండేళ్లు కావొస్తోంది. కానీ ఆయన ఒక్క సారి కూడా ఆర్.ఎస్.ఎస్. ప్రధాన కార్యాలయాన్ని సందర్శించలేదు. అప్పుడప్పుడు యథాలాపంగా ఎదుట పడినప్పుడు మోహన్ భగవత్‌తో ముచ్చటించిన ఉదంతాలు ఉండొచ్చు. కానీ ప్రత్యేకంగా నాగపూర్ వెళ్లి ఆర్.ఎస్.ఎస్. ప్రధాన కార్యాలయం సందర్శించి ఆర్.ఎస్.ఎస్. నాయకులతో భేటీ కావడం ఇదే మొదటి సారి. అరుదైన ఈ పర్యటనవల్ల అధికారంలో ఉన్న బీజేపీ తన మాతృసంస్థ అయిన ఆర్.ఎస్.ఎస్.తో మరింత సన్నిహితంగా మెలగుతుందా, ఆ సంస్థ పీఠాధిపతులు ఇచ్చే ఆదేశాలను పాటిస్తుందా అన్నది ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశంగా మారింది. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో, ప్రధానమంత్రి పదవికి ఆయనను నికరంగా అభ్యర్థిగా ప్రకటించవలసి ఉన్న సమయంలో మోదీ నాగపూర్ వెళ్లారు. సార్వత్రిక ఎన్నికలలో ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తలు మోదీ నాయకత్వంలోని బీజేపీ విజయం సాధించడానికి ఏ మేరకు తోడ్పడ్డారు అన్న అంశం మీద కూడా చర్చ జరిగింది. ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తలు ఎన్నికల సమయంలో దీక్షతో పని చేయనందువల్లే బీజేపీ 240 స్థానాలతో సంతృప్తి పడాల్సి వచ్చింది అన్న మాటలు కూడా వినిపించాయి. ఏమైతేనేమి కొయ్యకాళ్ల ఊతంగా మోదీ మూడో సారి ప్రధాని అయిపోయారు. మెజార్టీ తగ్గినందువల్ల భగవత్ మాటల్లో చెప్పాలంటే ఆయనలో గూడు కట్టుకున్న అహంకారం పాళ్లు ఏ మాత్రం తగ్గినట్టు లేదు. నాగపూర్‌లో మోదీ కార్యక్రమాలు ఆర్.ఎస్.ఎస్. వ్యవస్థాపకుడు కేశవ్ బలీరాం హెడ్గేవార్ స్మృతి మందిరం సందర్శించడంతో ప్రారంభం అయింది. ఆదివారం హెగ్డేవార్ జన్మ దినం కూడా. ఆ సమయంలో ఆయన వెంట ఆర్.ఎస్.ఎస్. అధినేత మోహన్ భగవత్ కూడా ఉన్నారు. అప్పుడు వారు యథాలాపంగా మాట్లాడుకున్నారు. ఆ తరవాత మోదీ డా.బి.ఆర్. అంబేద్కర్ బౌద్ధం స్వీకరించిన దీక్షా భూమిని కూడా సందర్శించారు. షరా మామూలుగా అంబేద్కర్ మీద మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ఆయన రూపొందించిన రాజ్యాంగం మనకు గౌరవాన్ని, సమానత్వాన్ని ప్రసాదించింది అని మోదీ చెప్పారు. నిజానికి సంఘ్ పరివార్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని ఆమోదించిన దాఖలా ఇప్పటి వరకూ లేదు. అధికారం అందిపుచ్చుకోవడానికి మోదీతో సహా బీజేపీ నాయకు లందరూ రాజ్యాంగాన్ని అప్పనంగా ఉపయోగించుకుంటూ ఉండొచ్చు. అధికారం దక్కాలంటే రాజ్యాంగాన్ని ఆమోదిస్తున్నట్టు కనిపించాల్సిందే. మోదీ అంబేద్కర్ మనకు సమానత్వాన్ని ప్రదర్శించామంటున్నారు. మైనారిటీలను ముఖ్యంగా ముస్లింలను పక్కకు తోసేస్తున్న మోదీ సమానత్వం గురించి మాట్లాడితే నవ్వొస్తుంది. మరో సందర్భంలో సాక్షాత్తు అంబేద్కరే దిగి వచ్చినా రాజ్యాంగాన్ని మార్చలేరు అని మోదీ అన్నారు. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని ప్రవేశ పెట్టడం సంఘ్ పరివార్ లక్ష్యం అయినప్పుడు, ఆ లక్ష్యానికి మోదీ కట్టుబడి ఉన్నప్పుడు ఆయన చెప్పే మాటలను నమ్మడం కుదరదు. గౌరవం, సమానత్వం ఇచ్చినందుకు తరతరాల దేశవాసులు అంబేద్కర్‌కు కృతజ్ఞులుగా ఉంటారు అన్న మోదీ మాట కూడా ఓ వైపరీత్యమే. వరదలు, భూకంపాలు, మరీ ముఖ్యంగా కుంభ మేళాలో ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తల సేవాతత్పరత మానవాళికి గొప్ప సేవ అని కూడా మోదీ అన్నారు. ఆ సేవ ఆర్.ఎస్.ఎస్. లక్షణాల్లో ఒకటి. దాన్ని కాదనడానికి వీల్లేదు.

ఆర్.ఎస్.ఎస్. ఇప్పుడు మహా వట వృక్షంగా తయారైందని కూడా అన్నారు. ఈ వటవృక్షం సామాన్యమైంది కాదని, ఇది శాశ్వతమైన సంస్కృతికి, ఆధుని కతకు చిహ్నం అని మోదీ అన్నారు. జాతి బానిస మనస్తత్వాన్ని వదిలి ముందుకు సాగుతోందని ఆయన చెప్పారు. ఇటీవల 2వేల మందికి పైగా ప్రాణాలు పోగొట్టుకున్న భూకంపంలో సాయం అందించిన భారత్ దక్షిణార్థ గోళంలోని దేశాల వాణిగా మారిందని మోదీ అన్నారు. ఇటీవల ఆయన అమెరికా సందర్శించినప్పుడు ట్రంప్ చూపిన నిరాదరణను మోదీ ఎంత సునా యాసంగా మరిచిపోగలరో! ప్రతి పర్యటనను మోదీ అద్భుతంగా చూపించ గలరు. ఆర్.ఎస్.ఎస్. ప్రధాన కార్యాలయాన్ని సందర్శించడాన్ని అలాగే చూపుతున్నారు. మోదీ నాగపూర్‌లో మాధవ్ నేత్రాలయ శంకుస్థాపన సభకూ హాజరయ్యారు. ఆ సమావేశంలో మోహన్ భగవత్ ప్రసంగిస్తున్నంత సేపు అత్యంత క్రమశిక్షణగల ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తగా ధీర గంభీర వదనంతో కూర్చున్నారు. ఈ సభకు మోదీని ఆహ్వానిస్తే ఆయన వస్తారో లేదో చూద్దాం అన్నట్టుగా ఆర్.ఎస్. ఎస్. వ్యవహార ధోరణి కనిపించింది. లేదంటే మోదీ నాగపూర్ సందర్శనకు అనువైన కార్యక్రమం ఏదైనా రూపొందించండి అని ప్రధాన మంత్రి కార్యాలయం కోరినా ఆశ్చర్యపడక్కర్లేదు. ఢిల్లీలో రూ.150 కోట్లు వెచ్చించి ఆర్.ఎస్.ఎస్. ఓ "భవ్యమైన" కార్యాలయం నిర్మించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అమిత్ షా, జె.పి.నడ్డా, రాజ్ నాథ్ సింగ్ లాంటి ప్రముఖులు వేదిక మీద కనిపించారు. కానీ మోదీ ఆ సభలో లేరు. అయినప్పటికీ మోదీ నాగపూర్ దాకా వెళ్లి మోహన్ భగవత్ దర్శనం చేసుకున్నారు. భగవత్‌తో మోదీ చర్చల్లో ఏం జరిగింది అన్న సమాచారం లేదు. అయితే బీజేపీ ఆర్.ఎస్.ఎస్. ఆధిపత్యాన్ని అంగీకరిస్తుంది అన్న సందేశం మాత్రం స్పష్టంగానే వ్యక్తమైంది. ఆర్.ఎస్.ఎస్., బీజేపీ ప్రభుత్వానికి మధ్య సంభాషణ అవసరం ఉందని మోదీ చెప్పడంలో అంతరార్థం ఇదే. మోదీ, భగవత్ ఏం మాట్లాడుకున్నారో అధికారికంగా బయటకు రాలేదు. ఈ విషయాన్ని చెప్పగలిగింది నితిన్ గడ్కరి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవిస్ మాత్రమే. బీజేపీ నూతన అధ్యక్షుడు ఎవరూ అన్న అంశం కూడా చర్చకు వచ్చి ఉండొచ్చు. మార్చిలో కొత్త అధ్యక్షుడెవరో తేలుతుందన్నారు. మార్చి ముగిసింది. బీజేపీ కొత్త అధినేత ఎవరో ఇంకా తేలలేదు. ఇంతకాలం మోదీ పేరెత్తకుండానే భగవత్ పరోక్ష విమర్శలు చేస్తూ వచ్చారు. ఇలాంటి వాటికి తెర పడ్తుందో లేదో తెలియదు. కానీ మోదీ ఆర్.ఎస్.ఎస్. ప్రధాన కార్యాలయానికి వెళ్లడం ఒక విధంగా లొంగుబాటుగానే కనిపిస్తోంది.

ఫన్‌చాంగం

చింతపట్ల సుదర్శన్

గుళ్లో ఎవరో మైకులో ఏదో చెబుతున్నారు. ఎంతో మంది రాజకీయ నాయకులు మైకులు బద్దలు కొట్టడం విన్నది చాలాసార్లు కానీ ఇప్పుడు వినవస్తున్నదంతా మరో రకంగానూ, ఇంకో రకంగానూ వినిపిస్తుండటంతో గుడి ఎదురుగ్గా ఓ మూల నిలబడి చెవులు రిక్కించి వినసాగింది డాంకీ.

మనుషులు మెసిలే చోట డాంకీలు డాగీలు ఉండటానికి లేదు కదా. ఈ లోకం వాళ్ల తాతగారి సొత్తాయె మరి. ఉన్నట్టుండి ఎక్కడ్నించో ఓ పలుగు రాయి వచ్చి వీపు మీద విమానం మోత మోగించింది. విషయమేమిటో వినాలని ఆసక్తిగా ఉంది కానీ ఒక రాయి తర్వాత మరొక రాయి వచ్చి తగలకపోదు శీఘ్రు బుద్ధే పలాయనః అనుకుని అక్కడ్నించి కదిలింది డాంకీ. గాడిదలకీ, కుక్కలకీ కూడా పంచాంగ శ్రవణం కావల్సి వచ్చిందా అన్న అరుపు వినిపించింది. పంచాంగం మనుషులకే కాని గాడిదలకు అక్కర్లేదన్న మాట మరి గాడిదల్లాంటి మనుషులకూ అవసరమా అని విసుక్కుంటూ, చిరాకు పడుతూ తన 'రెసిడెన్స్' వైపు అడుగులు వడివడిగా వేసింది డాంకీ. అప్పటికే అరుగు మీద కూచుని ముందు కాళ్ల మీద మూతి ఆనించి ఉన్నది డాగీ. ఆ పక్కనే బండరాయి మీద కూచుని ఉన్నాడు అబ్బాయి.

రంగస్థలం

అరుగు ఎక్కిన గాడిదని పలకరించింది డాగీ. ఏంటి బ్రో హడావిడిగా వస్తున్నావు. ఎవరైనా చేజ్ చేస్తున్నారా అంది. నా వెనక ఎవడైనా వస్తే 'బ్యాక్ లెగ్ త్రో' తో మక్కెలిరగ్గొట్టనూ. ఎవడూ లేడు. గుడి దగ్గర పంతులు గారు మైక్‌లో ఏదో చెప్తుంటే విందామనుకున్నా కానీ ఎదవ రాయి పుచ్చుకు కొట్టాడు. పైగా పంచాంగ శ్రవణానికి గాడిదలు పనికి రావట, పంచాంగాల మీద మనుషులకే 'పేటెంట్ హక్కులు' ఉన్నాయట అంటూ రుసరుసలాడింది డాంకీ. అయ్యిందీ నీకూ అయ్యిందీ. నేనూ బుద్ధి గడ్డి తిని చెవులు ముఖం మీద నిలబెట్టి విందామనుకున్నా. గ్రహాలూ, ఇళ్లూ, ఆదాయమూ, వ్యయమూ ఇలాగ ఏవో వినపడ్డయి. కానీ ఓ లుచ్చా బచ్చా నా కొడుకొకడు రాయి విసిరేసి పారిపోయేడు. ఈ యవ్వారం మనకు సంబంధించింది కాదులే అనుకుని వచ్చేశాను అంది డాగీ.

అసలీ పంచాంగం ఏమిటి తంబీ. జనం అంతా మైకు ముందు గుంపులుగా కూచుని వింటున్న దేమిటి అనడిగింది డాంకీ. ఇవాళ ఉగాది కదా. ఉగాది అంటే కొత్త సంవత్సరం ప్రారంభం కాబోతుందన్న మాట. ఈ సందర్భంగా పై లోకాల్లో ఉండే గ్రహాలు కొన్ని ఈ ఇంట్లోంచి ఆ ఇంట్లోంచి ఇంకో ఇంట్లోకీ మారతాయన్నమాట అన్నాడబ్బాయి. అవునా ఆ గ్రహాలేంటో ఎక్కడుంటాయో నాకైతే తెలీదుగానీ ఒకవేళ అవి ఉంటే గింటే, వాటిష్ట ప్రకారం ఇళ్లు మారితే, మారనీ వీళ్లకేవిటంట అంది డాగీ. అసలు పాయింటుకి వస్తా. పైన ఎక్కడో ఉండే గ్రహాల కదలికల కారణంగా ఇక్కడ ఈ భూమ్మీద ఉండే మనుషుల తలరాతలు మారుతాయట. ఆ గ్రహాలు మనుషుల్లో కొందరి పట్ల ప్రేమ, మరికొందరి పట్ల కోపం చూపుతాయంట. గ్రహాలు అనుకూలంగా ఉంటే మనుషులు రాజకీయ నాయకులు, మంత్రులు, సినిమా హీరోలు, గొప్ప క్రీడాకారులూ కావచ్చు అన్నాడబ్బాయి.

ఓహో గ్రహాలు అనుగ్రహిస్తే అధికార పార్టీ వారు 'సేఫ్' అన్న మాట. అదే కోప్పడితే మాత్రం ప్రతిపక్షంలో కూర్చోవాలన్న మాట. మరి ప్రజల మాటేమిటి, ఓట్ల సంగతేమిటి? అన్నీ గ్రహాలే చూసుకుంటే ఇంక ఈ మనుషులెందుకు, వాళ్ల పెత్తనాలెందుకు అంది డాగీ. బాగా అన్నావోయి. మనుషులు చేసే ఏ పనికయినా గ్రహాలే కారణమయితే నేరాలు, జైళ్లూ, బెయిళ్లూ అవసరమా అని పళ్లికిలించింది డాంకీ.

అది సరేగానీ అబ్బాయి గుడి దగ్గర విందామంటే వీలు పడలేదు. ఈసారి ఏ పార్టీ తలరాత ఎలా ఉందో చెప్పే ఉంటారు కదా. కాస్త మాకూ వివరించరాదూ అంది డాగీ. ఏ పార్టీకి ఆ పార్టీ పంచాంగం 'వేరేగా' తయారు చేశార్లే. ఓ పార్టీ వాళ్ల పంచాంగం ఆ పార్టీ మరో ముప్ఫయి యేళ్లు రాజ్యం చేస్తుందన్నది. ఓ పార్టీ పంచాంగం అధికార పార్టీ కుప్ప కూలుతుందని ఏడాది తిరక్కుండా ఎన్నికలు వస్తాయని అన్నది. ఎవరి ఇష్టం వచ్చినట్టు వాళ్లు గ్రహాలని అటూఇటూ తిప్పి అంతా తమకే మేలని చెప్పిస్తున్నారు అన్నాడు అబ్బాయి.

మనుషులంతా గ్రహాలకు భయపడతారేమో కాని అవి మా జోలికి రావు. వాటికి పరిహారాలు చేసి మంచి చేసుకునే అవసరమూ మాకు లేదు అంది డాంకీ. ఈసారి నీ గ్రహాలు ఏమంటున్నాయి బ్రో జాబ్ గ్యారంటీ అంటున్నాయా? అంది డాగీ. ఆదాయం రెండు వ్యయం పద్నాలుగన్నాడు నాకు పంతులు. ఇంకేం ఉద్యోగం? ఏలిన నాటి శని గుర్రుమంటున్నాడంట. అపాయింట్‌మెంటు ఆర్డరు కళ్ల చూసే యోగం ఇప్పట్లో లేనట్టే అన్నాడు అబ్బాయి.

కమలనాథుల కబంధ హస్తాల్లో ప్రాంతీయ పార్టీలు

వి.శంకరయ్య

భారత దేశంలో బీజేపీ చరిత్ర ఎవరైనా రాసే సందర్భంలో రెండు అధ్యాయాలుగా రాయవలసి ఉంటుంది. గుజరాత్ నాయకద్వయం వెనుక, ముందుగా లిఖించ వలసి వుంటుంది. 2014 సాధారణ ఎన్నికల తర్వాత నరేంద్రమోదీ ప్రధానమంత్రి పదవి చేపట్టిన తదుపరి వివిధ రాష్ట్రాల్లో అనేక ప్రాంతీయ పార్టీలు కమలనాథుల కుట్రలకు బలై చీలి పోవడమో లేక వాతంతట అవి అంతర్ధానం కావడమో జరిగింది. అందువల్ల ప్రాంతీయ పార్టీల చరిత్ర లిఖించే సమయంలో కూడా రెండు అధ్యాయాలుగా పేర్కొనవలసి ఉంటుంది. దేశ స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించి స్వాతంత్ర్యం తర్వాత అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ తదనంతర పరిణామ క్రమంలో అంతర్గత కలహాలు కావచ్చు, పటిష్టమైన నాయకత్వ లేమితో కావచ్చు లేదా అవినీతి అక్రమాల ఊబిలో కూరుకుపోవడంతో ఏర్పడిన ప్రజా వ్యతిరేకతతో రాజకీయ శూన్యత ఏర్పడి అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చి అధికారం చేపట్టాయి. తెలుగుదేశం పార్టీ ఈ విధంగా ఆవిర్భవించినదే. ఇది ఒక దశ. గుజరాత్ నాయక ద్వయం బీజేపీ నాయకత్వం చేపట్టిన తర్వాత రెండవ దశ మొదలైంది. దేశంలో వివిధ ప్రాంతీయ పార్టీలు శంకరగిరి మాన్యాలు పట్టడం రెండవ దశ. బీజేపీ నేత వాజపేయి అయిదేళ్లు ప్రధాన మంత్రిగా వున్నా ఏ ఒక్క ప్రాంతీయ పార్టీ బలి పశువు కాలేదు. వాజపేయి ప్రభుత్వానికి బయట వుండి బలపర్చిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గుజరాత్ లో నరేంద్రమోదీ ముఖ్యమంత్రిగా వున్న సమయంలో జరిగిన మారణహోమానికి ఆయన బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని నిర్భీతిగా కోరారు. మరి ఇప్పుడు తాను ప్రతిపక్షంలో వున్నప్పుడు నిక్కచ్చిగా వ్యతిరేకించిన సెకీ ఒప్పందాన్ని రాష్ట్ర ప్రజల క్షేమం దృష్ట్యానైనా రద్దు చేయలేని సంకటస్థితిలో చంద్రబాబు వున్నారు. గుజరాత్ నాయక ద్వయం రాజకీయంగా నేడు ఎంత బలీయంగా వుందో దీనిబట్టి అవగతం చేసుకోగలం. ఈ ఇబ్బంది ముమ్ముందు మరింతగా ఎదుర్కొనవలసి రావచ్చు.

ప్రాంతీయ పార్టీల అంశానికొస్తే మహారాష్ట్రలో మరాఠా నినాదంతో బాల్‌థాక్రే నాయకత్వంలో ఆవిర్భవించిన శివసేన తొలి నుంచి బీజేపీకి అనుకూలంగా వ్యవహరించేది. బాల్ థాక్రే శకం గడచి పోయి రెండవ తరం నాయకత్వం చేపట్టిన తర్వాత స్వతంత్రంగా వ్యవహరించగానే శివసేనను కమలనాథులు నిట్టనిలువునా రెండుగా చీల్చారు. ఒక వర్గ నేతను ముఖ్యమంత్రిని చేశారు. తుదకు ఏమైంది? షిండేకు ముఖ్యమంత్రి పదవి మున్నాళ్ల ముచ్చట అయింది. నేడు పూలు అమ్మిన చోటే కట్టెలమ్మ వలసి వచ్చింది. అలాగే ఒకప్పుడు ఇందిరాగాంధీతో ఢీ అంటే ఢీ అనగలిగిన మహారాష్ట్ర నుంచి జాతీయ నాయకుడుగా వున్న నేషనల్ కాంగ్రెస్ నేత శరద్‌పవార్ కుటుంబంలోనే కమలనాథులు చిచ్చు పెట్టి పార్టీని రెండుగా చీల్చారు. ఇప్పుడు రెండు వర్గాలు గిలగిల తన్నుకు లాడుతున్నాయి. చీలిక వర్గ నేత అజిత్‌పవార్ తమ మాటలకు చేతలకు సంబంధం లేకుండా వ్యవహరించ వలసిన దుస్థితిలో వున్నారు. ఈ జాబితాలోనికి ముమ్ముందు ఎంత మంది ప్రాంతీయ పార్టీల నేతలు రాబోతున్నారో వేచి చూద్దాం!

ఒడిశాలో బిజూపట్నాయక్ వారసత్వంతో సుదీర్ఘ కాలం అధికారం వెలగ బెట్టిన నవీన్ పట్నాయక్ 2014 తర్వాత అంశాల వారీగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని బలపరుస్తున్నానని చెప్పినా ఏనాడు ఏ అంశంపై కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించిన సందర్భం లేదు. అంత అణకువుగా ఉన్న ప్రాంతీయ పార్టీ మిత్రుణ్ణి కమల నాథులు సమయం చూచి బలహీనత ఆధారం చేసుకొని చావుదెబ్బ కొట్టి ఒడిశాలో అధికారం కైవశం చేసుకొన్నారు. ఇక పంజాబ్‌లో అకాలీ దళ్ పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. ప్రకాశ్‌సింగ్ బాదల్ అకాలీదళ్ క్షీణదశకు చేరుకొంది. మన పక్కనే వున్న తమిళ నాడులో బీజేపీ ఆడిన ఆట బెడిసికొట్టినా అంతిమంగా జయలలిత నెచ్చెలి శశికళ జైలు పాలైంది. కమలనాథులు వ్యూహంలో చిక్కుకున్న అన్నాడిఎంకె రెండుగా చీలిపోయి తుదకు అధికారమూ కోల్పోయింది. మరొక రాష్ట్రం కర్నాటక. దేవగౌడ జేడీయూ పార్టీ ఆధారంగా బీజేపీ ఆడిన ఫిరాయింపుల నాటకం చెబితే చరిత్ర చర్విత చరణం అవుతుంది. దేవగౌడ లాగే జేడీయూ పార్టీ కూడా నేడు ముసలిదై పోయి పూర్తిగా బలహీనపడింది. మిత్ర లాభమంటే మిత్రుడు ఏ కారణం చేతనైనా బలహీన పడితే చేయి అందించే విధంగా వుండాలి. కాని కమలనాథులు వ్యూహం ఏలా వుంటుందంటే అవసరమైన మేరకు ఉపయోగించుకొని అంతిమంగా వారి బలహీనతలు ఆధారం చేసుకొని తొక్కేసి ఆ స్థానం ఆక్రమించే విధానమే మిత్రభేదం. ఈ మిత్రభేదంతో కమలనాథుల చేతిలో అనేక ప్రాంతీయ పార్టీలు దెబ్బతిన్నాయి.

యూపీలో చరణ్‌సింగ్ నాయకత్వాన వున్న ఆర్‌ఎల్‌డి పార్టీ, అసోంలో బలీయంగా వున్న అస్సాం గణతంత్ర పరిషత్ (ఏజీపీ), హర్యానాలో చౌతాలా పార్టీ, ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌మోహన్‌రెడ్డి వైసీపీ ఇంకా చాల ప్రాంతీయ పార్టీలు ఈ జాబితాలో వున్నాయి. బీహార్‌లో నితీశ్ కుమార్ జేడీయూ పార్టీ బీజేపీతో ఎన్ని మార్లు జట్టుకట్టిందో, ఎన్ని మార్లు విడిపోయిందో రాస్తే పెద్ద ఉద్గంధమే అవుతుంది. ప్రస్తుతం చంద్రబాబునాయుడుతో పాటు పవన్‌కల్యాణ్ తెర మీదకు వచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు జాతీయ స్థాయిలో వున్న పరపతి ప్లస్‌గా వున్నా కమలనాథుల వద్ద అది మైనస్‌గా వుంది. గుజరాత్ నాయకద్వయం తమ ముందు జాతీయ స్థాయిలో పరపతి వుండే నేతగా మెలగడానికి ఇష్టముండదు. బీహార్‌లో నితీశ్ కుమార్‌కు ఆ ఇమేజ్ లేదు - కాబట్టి అనేక మార్లు విడిపోయి కలిసినా ఇప్పుడు రాజకీయంగా సజీవంగా వున్నారు. నరేంద్ర మోదీ అధికారంలోనికి వచ్చిన తర్వాత ఎన్డీఏలో భాగస్వామిగా లేక బయట వుండి గాని బలపర్చిన వారిలో చంద్రబాబునాయుడు లాగా జాతీయ స్థాయిలో పేరు వున్న నేత ఒక్కరూ లేరు. 2014-19 మధ్య ఆఖరు దశలో టీడీపీ బీజేపీ మధ్య చెడటానికి ఇది కూడా ఒక కారణం. చాలా మందికి గుర్తు వుండక పోవచ్చు. 2014 తర్వాత కేంద్ర మంత్రిగా వున్న బీజేపీ నేత వెంకయ్యనాయుడు ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చిన ప్రతి సందర్భంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అంతరించి పోయిందని దాని స్థానంలో ఏర్పడిన రాజకీయ శూన్యతను బీజేపీ పూర్తి చేస్తుందని పదే పదే చెప్పేవారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా వుంది. దాని స్థానం వైసీపీ ఆక్రమించగా సంఘ్ పరివార భావజాలం వ్యాప్తికి అనువైన సామాజిక భౌతిక సైద్ధాంతిక పరిస్థితులు ఆంధ్రప్రదేశ్‌లో లేకపోవడం వెంకయ్యనాయుడు గమనించలేదంటే నమ్మగలమా? కాబట్టే ఆ కాలంలో ఒక వేపు టీడీపీతో మైత్రి వున్నా పరోక్షంగా మరో ప్రాంతీయ పార్టీ నేత జగన్ మోహన్‌రెడ్డికి అండదండలు ఇవ్వసాగారు. ఎప్పుడూ కమలనాథుల వ్యూహం ఇలాగే వుంటుంది. అప్పట్లో టీడీపీ -బీజేపీ మధ్య చెడటానికి ఇదొక కారణంగా వుంది. జగన్ మోహన్‌రెడ్డి తనపై కేసులు లేకుంటే ఎలా వ్యవహరించే వారో ఏమోగాని బీజేపీ తాన అంటే తందానా అంటూ ఐదేళ్లు గడిపారు. ఈ లోపు లడ్డూలాగా బీజేపీకి మూడో ప్రత్యామ్నాయంగా పవన్ కల్యాణ్ లభ్యమైనాడు. కాబట్టి టీడీపీతో పొత్తుకు సిద్ధమయ్యారు. అయిదేళ్లు తమ కొమ్ము కాచిన జగన్‌మోహన్‌రెడ్డికి నిర్దాక్షిణ్యంగా రాంరాం చెప్పారు. దేశంలో బీజేపీ కబంధ హస్తాల్లో చిక్కుకొని బక్క చిక్కిన ప్రాంతీయ పార్టీల నేతల జాబితాలో జగన్‌మోహన్‌రెడ్డి కూడా చేరిపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడు ముక్కలాట సాగుతోంది. వాస్తవంలో కూటమి ప్రభుత్వానికి వచ్చే ప్రమాదం ఏమాత్రం లేకున్నా ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఏమాత్రం తొట్రుపాటు లేకుండా వ్యవహరిస్తున్నా పవన్‌కల్యాణ్ మాత్రం పదేపదే పాతికేళ్లు కూటమి ప్రభుత్వం వుంటుందని చెప్పడం పైననే చాలామంది సందేహించవలసి వస్తోంది. అదీ అధికారంలోకొచ్చి సంవత్సరం కాకముందే!

విశ్రాంత పాత్రికేయులు 9848394013

సీపీఐ ప్రధాన కార్యదర్శులు - 3

పీసీ జోషి

ఆర్వీ రామారావ్

పి.సి.జోషిగా ప్రసిద్ధుడైన పూసం చంద్ జోషి తొలితరం కమ్యూనిస్టు నాయకులలో ఒకరు. ఆయన 1935 నుంచి 1947 దాకా పన్నెండేళ్ల పాటు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆయన ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు చాలా కాలం సీపీఐపై నిషేధం ఉండేది. తెలంగాణా సాయుధ పోరాటం, కయ్యూరు పోరాటం, ఆర్.ఐ.ఎన్. తిరుగుబాటు, తేభాగ ఉద్యమం లాంటివన్నీ ఈ సమయంలోనే కొనసాగాయి.

1907 ఏప్రిల్ 14న అల్మోరాలో బడిపంతులు హరినందన్ జోషి కడుపున జన్మించారు. అది ఇప్పుడు ఉత్తరాఖండ్‌లో ఉంది. 1928లో అలహాబాద్ విశ్వవిశ్వవిద్యాలయం నుంచి ఎమ్మే పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. పరీక్ష పూర్తి చేయగానే ఆయనను అరెస్టు చేశారు. 1928-29లో పండిత్ నెహ్రూ, యూసుఫ్ మెహెరల్లీ మరికొందరితో కలిసి జోషీ యువజన సంఘాల్లో (యూత్ లీగ్)చురుకుగా పని చేశారు. ఆ తరవాత కొద్ది కాలానికే ఉత్తరప్రదేశ్ వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1929లో బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను మీరట్ కుట్రకేసులో నిందితుణ్ని చేసి అరెస్టు చేసింది. అప్పటికి ఆయనకు 22 ఏళ్లు మాత్రమే. ఆయనను ఆరేళ్ల పాటు అండమాన్ దీవుల్లో నిర్బంధించాలనుకున్నారు. కానీ ఆయన పిన్న వయస్కుడైనందువల్ల ఆ శిక్ష మూడేళ్లకు తగ్గించారు. 1933లో జైలు నుంచి విడుదలైన తరవాత దేశంలోని వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న కమ్యూనిస్టు బృందాలను ఐక్యం చేయడానికి ప్రయత్నించారు.

కమ్యూనిస్టు సిద్ధాంతం, ఆచరణలో పి.సి.జోషి చేసిన కృషి అద్వితీయమైంది. సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమంలో ఆయన పాత్ర ప్రత్యేకమైంది. ఒక రకంగా గ్రాంసీ నిర్వహించిన పాత్రను భారత్‌లో జోషీ నిర్వహించారు. ఆయన కార్యకలాపాలు జన చేతనపై గాఢమైన ప్రభావాన్ని చూపాయి. జోషీ తన సమకాలీన రాజకీయ ఉద్యమాన్ని విప్లవీకరించినట్టుగా మరెవరూ చేయలేదనేది వాస్తవం. సామ్రాజ్యవాదానికి, వలసవాదానికి, ఫాసిజానికి వ్యతిరేకంగా "నేషనల్ ఫ్రంట్" ఉండాలని ఆయన సూత్రీకరించారు. ఇది విద్యావంతులైన వారిని బాగా ఆకర్షించింది. కమ్యూనిస్టు పార్టీలో చేరకపోయినా యువత, విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ వృత్తుల్లో ఉన్నవారు, చైతన్యవంతమైన బూర్జువా వర్గాల వారు వామపక్ష

రాజకీయాల వేపు ఆకర్షితులయ్యారు. మార్క్సిజం ను ఆమోదించారు. ఆయన సీపీఐ నాయకుడిగా ఉన్న కాలంలో కాంగ్రెస్ మీద వామపక్ష ప్రభావం విపరీతంగా ఉండేది. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ, పెజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ, అనేకానేక ప్రజా సంఘాలు ఏర్పడడానికి ప్రధానంగా జోషి కృషే కారణం. కమ్యూనిస్టు పార్టీకి ఆవల కమ్యూనిస్టు ప్రభావం విపరీతంగా ఆ రోజుల్లో పెరిగింది.

కాంగ్రెస్‌లో విధాన నిర్ణయాలు తీసుకునే పరిశ్రమలు, వ్యవసాయ రంగం లాంటి వాటి మీద కమ్యూనిస్టుల ప్రభావం విపరీతంగా ఉండేది. అనేక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలకు కమ్యూనిస్టులే నాయకత్వం వహించే వారు. ఎ.ఐ.సి.సి.లో కనీసం 20 మంది కమ్యూనిస్టులు ఉండేవారు. మహాత్మా గాంధీ, సుభాష్ చంద్ర బోస్, పండిట్ నెహ్రూతో కలిసి కమ్యూనిస్టు నాయకులు పని చేసే వారు. మార్క్సిజం ప్రభావం కమ్యూనిస్టు ఉద్యమ పరిధిని దాటి విస్తరించింది. 1930లు, 1940లలో అనేక మంది మార్క్సిజం గొడుగు కింద చేరారు. సైద్ధాంతికంగా మార్క్సిజం గణనీయమైన విజయాలు సాధించింది.

కళలు, సాహిత్యం మొదలైనవి ప్రజాస్వామ్య లక్షణాలే కాక ప్రజోద్యమాలుగా రూపు దిద్దుకున్నాయి. అవి విప్లవ రాగం ఆలపించడం మొదలైంది. పాటలు, నాటకం,



కవిత్వం, సాహిత్యం, నాటక రంగం, సినిమా...ఇలా సకల రంగాలపై మార్క్సిజం ప్రభావం కనిపించింది. దీనికి కావలసిన నేపథ్యం సమకూర్చింది పి.సి.జోషీనే. ఇది సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని వేగవంతం చేసింది. సకల కళా రూపాలను కమ్యూనిస్టులు స్వాతంత్ర్యోద్యమంలో భాగం చేయడానికి జోషీ విధానాలు ఉపకరించాయి. పి.సి.జోషి కృషి వల్లే 1936లో అభ్యుదయ రచయితల సంఘం, అఖిల భారత రైతు సంఘం, అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎ.ఐ.ఎస్.ఎఫ్.) అవతరించాయి. అనాడు లబ్ధ ప్రతిష్టితులైన వివిధ కళా రంగాలకు చెందిన వారు వామపక్షం వేపు మొగ్గారు. కొద్ది కాలానికి 1943లో ప్రజానాట్య మండలి (ఇప్టా) కూడా అవతరించింది. జోషీ రాజకీయ సంస్కృతిని, ప్రజా సంస్కృతిని, జనం ఆకాంక్షలను కలగలిపి ముందుకు నడిపించారు.

జోషీ ప్రజల మనిషి. ఎప్పుడు ఎటు అడుగు వేయాలో, ఏ సమయంలో ఏ నినాదం ఇవ్వాలో ఆయనకు బాగా తెలుసు. బెంగాల్ కరువు పంజా విసిరినప్పుడు జోషీ అద్వితీయమైన కృషి చేశారు. నిజానికి ఆ కృషి కారణంగానే ప్రజానాట్య మండలి ఏర్పడింది. బి.టి.రణదివే ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయంలో అంటే స్వాతంత్ర్యం తరవాత పి.సి.జోషి మీద మితవాది, రెనెగేడ్ లాంటి ముద్రలు వేశారు. 1948లో కలకత్తాలో జరిగిన పార్టీ మహాసభలో ఆయన మీద దండయాత్ర చేసి ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తొలగించారు. 1949 జనవరి 27న జోషీని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. 1949 డిసెంబర్ లో పార్టీ నుంచి బహిష్కరించారు. 1951 జూన్ ఒకటిన ఆయనకు మళ్లీ సీపీఐలో ప్రవేశం దక్కినా పెద్దగా పట్టించుకున్నది లేదు. కానీ ఆయనను పార్టీ అధికార పత్రిక "న్యూ ఏజ్" కు సంపాదకుడిని చేశారు. పార్టీలో ఆయనకు ఎప్పుడూ పూర్వ వైభవం దక్కనే లేదు. జీవిత చరమాంకంలో ఆయన జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో పరిశోధన, ప్రచురణ కార్యకలాపాల్లో నిమగ్నమై పోయారు. కమ్యూనిస్టు ఉద్యమాన్ని సమకూర్చడానికి ప్రయత్నించారు.

చిట్టగాంగ్ ఆయుధాగారం మీద జరిగిన దాడిలో పాల్గొన్న కల్పనా దత్తాను ఆయన పెళ్లి చేసుకున్నారు. ఆయన కుమారుల్లో ఒకరైన చంద్ హిందుస్థాన్ టైమ్స్ పత్రికలో పని చేసిన పత్రికా రచయిత. చంద్ భార్య మానిని కూడా పత్రికా రచయితే. జోషి హయాంలో సాయుధ పోరాటాలు జరిగాయి. శాంతియుతంగా ఉద్యమించిన రోజులూ ఉన్నాయి. ఏ ఎత్తుగడ ఎప్పుడు అనుసరించాలో ఆయనకు బాగా తెలుసు. ప్రజా పోరాటాలు స్వాతంత్ర్యోద్యమంతో ముడిపడేట్టు చేయడంలో జోషి దిట్ట.

పి.సి.జోషీని సంస్కరణవాది అని ఈ నాటికీ నిందించే వారికి కొదవలేదు. కానీ అనేక చోట్ల సాయుధ పోరాటాలు ఆయన సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయంలోనే జరిగాయి. అందులో కొన్ని పోరాటాలు ఆయన నాయకత్వంలోనే జరిగాయి. ఆయన మార్గదర్శకత్వంలో ఏర్పడిన ప్రజా సంఘాలు ఇప్పటికీ పని చేస్తున్నాయి. పి.సి.జోషి నాయకత్వంలో పోరాటం, ప్రజోద్యమాలు, సమ్మెలు, ఊరేగింపు, భూ ఆక్రమణలు, భూ పంపిణీలు...ఇలా అనేక రూపాల్లో సాగింది. 1945 నుంచి 1947 దాకా సాగిన వివిధ ఉద్యమాలే దీనికి తార్కాణం.

రాజకీయ పార్టీలతోనే అరాచకాలు

మమత ఆరోపణలు

కోల్‌కతా: 'బెంగాల్‌లో అల్లర్లను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇలాంటి ఉచ్చులో ఎవరూ పడవద్దని, బెంగాల్ ప్రభుత్వం మైనారిటీలకు అండగా నిలుస్తుందని, రాష్ట్రంలో ఎవరూ ఉద్రిక్తతలను రెచ్చగొట్టలేరని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం అన్నారు. కోల్‌కతాలోని ఈద్గాలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మమతా బెనర్జీ మాట్లాడుతూ 'మేము లౌకికవాదులం. ఒకవైపు నవరాత్రులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగానూ శుభాకాంక్షలు చెబుతున్నాం. ఇటువంటి సమయంలో ఎవరూ అరాచకాన్ని వ్యాప్తి చేయకూడదని కోరుకుంటున్నాం. సామాన్యులెవరూ అరాచకాన్ని వ్యాప్తి చేయరు. రాజకీయ పార్టీలు అలాంటి చర్యలకు పాల్పడతాయి. ఇది సిగ్గుచేటు. అన్ని మతాలను పరిరక్షించేందుకు ప్రాణత్యాగం చేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం. మైనారిటీలను రక్షించడం మెజారిటీల కర్తవ్యం. మైనారిటీల కర్తవ్యం మెజారిటీల మధ్య జీవించడం' అని పేర్కొన్నారు. 'ఈద్ కోసం తాను లండన్ నుండి ముందుగానే ఇక్కడికి తిరిగి వచ్చాను. అందరూ శాంతియుతంగా జీవించాలి. సామరస్యంగా మెలగాలి. మేము ఎల్లప్పుడూ మైనారిటీలకు మద్దతు అందిస్తాం. వామపక్షాలవారు, 'రాముడు' కలిసి నేను హిందువునా కాదా అని నన్ను అడిగారు? నేను హిందువును, ముస్లింను అని గర్వంగా వారికి సమాధానం చెప్పాను. వారు ఐక్యతను విచ్ఛిన్నం చేయాలనుకుంటున్నారు. అల్లర్లు సృష్టించాలనుకుంటున్నారు. వారి ఉచ్చులో పడకండి. నేను మీతో ఉన్నారు. అభిషేక్ మీతో ఉన్నారు. ప్రభుత్వమంతా మీతోనే ఉంది'అని ఆమె అన్నారు. 'వారు అల్లర్లు సృష్టించి, రాష్ట్రపతి పాలన గురించి మాట్లాడుతు న్నారు. ఉత్తరప్రదేశ్‌లో, మణిపూర్‌లో ఏమి జరిగింది? రాజ్యాంగాన్ని సురక్షితంగా ఉంచండి. అల్లర్లు సామా న్యులు చేయరు. రాజకీయ పార్టీలవారే చేస్తారు. మైనారి టీతో కలిసి జీవించడమే మెజారిటీ మతం. మేము రామ కృష్ణుడు, వివేకానందులను నమ్ముతాం. కానీ జుమ్లా పార్టీ సృష్టించిన మతానికి మేం వ్యతిరేకం. అది హిందూ వ్యతి రేకం. వారు ఒప్పందాలు చేసుకుంటారు. నేను ఎవరినీ అల్లర్లు చేయనివ్వను' అని మమత వ్యాఖ్యానించారు.

రోడ్లపై నమాజ్ ఆపడంపై ముస్లింల నిరసన

లక్నో: రంజాన్ సందర్భంగా ముస్లింలు రోడ్లపై నమాజ్ చేయవద్దని ఉత్తరప్రదేశ్ పోలీసులు అల్టిమేటం జారీ చేయడంపై ముస్లింలు మండిపడ్డారు. మీరట్ ప్రాంతంలో ఎవరైనా రోడ్లపై నమాజ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని, పాస్‌పోర్టు, లైసెన్సులు రద్దు చేస్తామని అధికారులు హెచ్చరించడంపై ఆగ్రహం వెలిబుచ్చారు. కాగా, సోమవారం ఈద్ ప్రార్థనల సందర్భంగా మీరట్ రోడ్లపై నమాజ్ చేయడాన్ని అడ్డుకోవడంతో ముస్లిం మైనారిటీలు నిరసన చేపట్టారు. 'ముస్లింలు మాత్రమే వీధుల్లో నమాజ్ చేయరు' అనే పోస్టర్లను నిరసనకారులు ప్రదర్శించారు. హోలీ, శివరాత్రి, దీపావళి, గణేష్ చతుర్థి, రామనవమి వంటి పండుగలను హిందువులు కూడా వీధుల్లోనే జరుపుకుంటారని పోస్టర్లలో పేర్కొన్నారు. కన్వార్ యాత్ర కూడా రోడ్లపైనే జరుగుతుందని పోస్టర్లపై రాసి ఉంది. ఇదిలా ఉంటే, మొరాదాబాద్‌లో నమాజ్ చేయడానికి ఈద్గాలోకి ప్రవేశించకుండా ఆపినందుకు కొందరు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. లోపల పెద్ద సంఖ్యలో ప్రజలు ఉండటంతో ఈద్గాలోకి ప్రవేశించకుండా అడ్డుకున్నారు. దీని తర్వాత, మళ్లీ నమాజ్ చేశారు. ఈద్-ఉల్-ఫితర్ ఉత్సవాలు ప్రారంభం కావడంతో యూపీలోని సంభల్‌లోనూ భద్రతను కట్టుదిట్టం చేశారు.

మమత బ్రిటన్ పర్యటన ఫలితమేంటి?

అధీర్ రంజన్ చౌదరి

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బ్రిటన్ పర్యటన ఆద్యంతం 'వివాదాలు... నాటకీయ పరిణామాలు' మినహా రాష్ట్రానికి ఒనగూరిన ప్రయోజనం ఏదీ లేదని కాంగ్రెస్ నాయకుడు అధీర్ రంజన్ చౌదరి సోమవారం అన్నారు. ఆమె పర్యటన ఫలితంపై రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా ఒక ప్రకటన విడుదల చేయాలని కోరారు. గత వారం ఆక్స్‌ఫర్డ్‌లోని కెల్లాగ్ కళాశాలలో తన ప్రసంగం సందర్భంగా నిరసనకారులు సృష్టించిన గందరగోళంపై చౌదరి మాట్లాడుతూ ముఖ్య మంత్రి అధికారిక పర్యటనలో ఉన్నప్పుడు ముఖ్యంగా ఆమె అధికారిక పర్యటనలో ఉన్నప్పుడు ప్రజలు ఆమెను అగౌరవ పరచడాన్ని తాను వ్యతిరేకిస్తున్నానని అన్నారు. 'లండన్‌లో పెద్దగా ఏమీ జరగలేదు. లండన్‌కు ఎవరు వెళ్లారో మేము తెలుసుకోవాలనుకుంటున్నాం. ఈ పర్యటనలో ఎంత ఖర్చు అయింది? ఆమె అక్కడ కలిసిన వ్యక్తులు ఎవరు?, అందిన ప్రతిపాదనలు ఏమిటి, రాష్ట్రం వాటి నుంచి ప్రయోజనం పొందుతుందా లేదా అని' చౌదరి ఇక్కడ విలేకరులతో అన్నారు. ఆమె అక్కడికి పన్ను చెల్లింపుదారుల డబ్బుతో ప్రయాణించారని, తిరిగి వచ్చిన తర్వాత సందర్శన ఫలితం గురించి పత్రికా ప్రకటన విడుదల చేయడం ఆమె ప్రభుత్వ బాధ్యత అని కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

వజ్రాల కార్మికుల భారీ ప్రదర్శన

సూరత్: ప్రధాని మోదీ స్వరాష్ట్రం, బీజేపీ పాలిత గుజరాత్‌లో లక్షలాది మంది వజ్రాల పరిశ్రమ కార్మికులు సమస్యల వలయంలో అల్లాడిపోతున్నారు. వజ్రాలను మెరుగుదిద్దే రంగంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన సూరత్‌లో దాదాపు 2,500 యూనిట్లలో సుమారు 10 లక్షల మంది కార్మికులు పని చేస్తున్నారు. ప్రపంచంలో దాదాపు 90 శాతం ముడి వజ్రాల కటింగ్, పాలిషింగ్ ఇక్కడే జరుగుతాయి. డిమాండ్లు నెరవేర్చాలంటూ వందలాది మంది కార్మికులు ఆదివారం భారీ ప్రదర్శన నిర్వహించారు. డైమండ్ వర్కర్స్ యూనియన్ గుజరాత్ ఉపాధ్యక్షుడు భవేశ్ టంక్ మాట్లాడుతూ, రెండేళ్ల నుంచి వజ్రాల పరిశ్రమ మాంద్యంలో కొట్టుమిట్టాడుతున్నదని, కార్మికులకు సరైన పని, వేతనాలు ఉండటం లేదని చెప్పారు. కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, తమ సమస్యలను సీఎం భూపేంద్ర పటేల్‌కు విన్నవించామని అన్నారు.

భారీగా తగ్గిన నియామకాలు

పార్లమెంటరీ కమిటీ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: సాంకేతిక విద్యాలయాల్లో క్యాంపస్ నియామకాలు భారీగా తగ్గాయి. కొన్ని ఐఐఎంలలో నియామకాలు తగ్గుముఖం పట్టాయి. గత మూడు సంవత్సరాలతో పోల్చితే ఈసారి ఐఐటీ క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో దాదాపు 10 శాతం తగ్గుదల కనిపించింది. విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడలపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ నివేదికలో ఈ విషయం వెల్లడైంది. క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించడంపై కృషి చేయాలని పార్లమెంటరీ కమిటీ తన నివేదికలో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేసింది. 2021-22 సంవత్సరం, 2022-23 విద్యా సంవత్సరం, 2023-24 సెషన్ మధ్య 23 ఐఐటీలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లలో తగ్గుదల ఉందని పార్లమెంటులో ప్రవేశపెట్టిన పార్లమెంటరీ కమిటీ నివేదిక పేర్కొంది. అతిపెద్ద ఐఐటీగా పేరొందిన ఐఐటీ రూర్కీలోనే భారీగా నియామకాలు తగ్గాయి. ఇక్కడ 2021-22 సంవత్సరంలో 98.54 శాతం ఉంటే 2023-24 సంవత్సరానికి వచ్చేసరికి 79.66 శాతానికి పడిపోయింది. దాదాపు 18.88 శాతం తగ్గుదల. రెండవ స్థానంలో ఐఐటీ ఢిల్లీ ఉంది. 2021-22 సంవత్సరం, 2023-24 సంవత్సరం మధ్య 14.88 శాతం తగ్గుదల ఉంది. ఐఐటీ బాంబే మూడో స్థానంలో ఉంది. 2021-22, 2023-24 సంవత్సరాల మధ్య 12.72 శాతం తగ్గుదల ఉంది. 2021-22 సంవత్సరంలో ఇది 96.11 శాతం ఉండగా, 2023-24 మధ్యకాలంలో ఇది 83.39 శాతానికి పడిపోయింది. కరోనా మహమ్మారి తర్వాత నియామకాల్లో తగ్గుదల ఉందని కమిటీ తెలిపింది. ఇంతకుముందు కంటే గత విద్యా సంవత్సరంలో తక్కువ మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్లు పొందారని ఐఐటీ బాంబే సెప్టెంబర్ 2024 నాటి తన నివేదికలో పేర్కొంది. అత్యల్ప జీతం ప్యాకేజీ సంవత్సరానికి కేవలం రూ.4 లక్షలకు పడిపోయింది. ఈ తగ్గుదల విద్యార్థుల్లో ఆందోళనను పెంచుతోంది. 2021-22, 2023-24 సంవత్సరాల మధ్య ఐఐటీ మద్రాస్ నియామకాలలో 12.42 శాతం తగ్గుదల కనిపించింది. 2021-22 సంవత్సరంతో పోలిస్తే 2023-24 సంవత్సరంలో ఐఐటీ బీహెచ్‌యూలో నియామకాలు మెరుగుపడ్డాయి, అయితే మునుపటి విద్యా సంవత్సరంతో పోలిస్తే 2023-24 సంవత్సరంలో 7.58 శాతం తగ్గుదల ఇప్పటికీ ఉంది. ఐఐటీ కాన్పూర్‌లో 11.15 శాతం క్షీణత ఉండగా, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో అత్యల్పంగా 2.8 శాతం క్షీణత ఉంది. 2021-22, 2023-24 విద్యా సంవత్సరాల మధ్య రెండవ, మూడవ తరం ఐఐటీలలోని అనేక విద్యా సంస్థల్లో నియామకాలు 10 శాతానికి పైగా పడిపోయాయి. 2008, 2009 మధ్య స్థాపించిన ఈ ఐఐటీలలో ఐఐటీ హైదరాబాద్ కూడా ఉంది. దీంట్లో అతి తక్కువ క్యాంపస్ నియామకాలు నమోదయ్యాయి. 2021-22లో 86.52 శాతం ఉన్న ప్లేస్‌మెంట్ రేటు 2023-24లో 69.33 శాతానికి పడిపోయింది. ఐఐటీ మండి 14.1 శాతం తగ్గింది. 2015, 2016 మధ్య స్థాపించిన ఐఐటీ జమ్మూలో 21.83 శాతం తగ్గుదల కనిపించింది.

ఐపీఆర్ దాఖలుచేయని ఐఏఎస్‌లకు జరిమానా

న్యూఢిల్లీ: నిర్ణీత కాలపరిమితి లోపు ఐఏఎస్ అధికారులు తమ ఆస్తి వివరాలను దాఖలు చేయడంలో విఫలమైతే వారిపై జరిమానాల విధింపు లేదా దిద్దుబాటు చర్యలను పార్లమెంటరీ కమిటీ సూచించింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ) విభాగానికి సంబంధించి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదిక ప్రకారం 91 ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్) అధికారులు 2024లో తమ స్థిరాస్తి రిటర్న్(ఐపీఆర్)లను దాఖలు చేయలేదు. ఈ నివేదికను మార్చి 27న పార్లమెంటులో ప్రవేశపెట్టారు. సంబంధిత సంవత్సరాలకు ఐపీఆర్‌లను దాఖలు చేయకపోవడంతో కొన్ని పోస్టుల్లో చేరడానికి తప్పనిసరైన విజిలెన్స్ క్లియరెన్స్‌ను 2023లో 15 మంది ఐఏఎస్ అధికారులకు, 2022లో 12 మందికి ,2021లో 14 మందికి తిరస్కరించారు. ఐఏఎస్ అధికారులందరూ ఐపీఆర్‌లను సకాలంలో దాఖలు చేసేలా చూసేందుకు కేంద్రీకృత సమ్మతి పర్యవేక్షణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేసింది. 'ఈ యంత్రాంగంలో అధికారుల స్థితిని ట్రాక్ చేసి దాఖలు చేయడం కోసం బాధ్యత వహించే విభాగంలో ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలి. అదిగాక రిమైండర్‌లు ఉన్నప్పటికీ వారి ఐపీఆర్‌లను దాఖలు చేయడంలో విఫలమైన అధికారులకు ఆటోమేటిక్ ఎస్కలేషన్ విధానాలతో సహా జరిమానాలు లేదా దిద్దుబాటు చర్యలను ప్రవేశపెట్టాలని కమిటీ ప్రతిపాదించింది" అని నివేదిక వివరించింది.

ప్రైవేటు... మైనార్టీయేతర విద్యా సంస్థల్లో

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కోటా చట్టం

కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ: దేశంలోని ప్రైవేట్, మైనారిటీయేతర విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కోటా కోసం ప్రభుత్వం చట్టం తీసుకురావాలని కాంగ్రెస్ సోమవారం డిమాండ్ చేసింది. విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడలపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆర్టికల్ 15(5) ను అమలు చేయడానికి కొత్త చట్టాన్ని సిఫార్సు చేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్ వ్యవహారాలు) జైరాం రమేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి కోసం చట్టం ద్వారా ప్రత్యేక నిబంధనలను రూపొందించడానికి ఆర్టికల్ 15(5) రాష్ట్రాన్ని అనుమతిస్తుంది. మైనారిటీ విద్యాసంస్థలు మినహా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు కూడా ఉన్నాయి. గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ రాజ్యాంగం లోని ఆర్టికల్ 15(5) ను ప్రైవేటు విద్యా సంస్థల్లో అమలు చేయడానికి చట్టం తీసుకురావడానికి కట్టుబడి ఉందని జైరాం రమేశ్ అన్నారు. 'ఉన్నత విద్యా శాఖకు గ్రాంట్ల డిమాండ్‌పై తన 364వ నివేదికలో విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడలపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కూడా ఆర్టికల్ 15(5) ని అమలు చేయడానికి కొత్త చట్టాన్ని సిఫార్సు చేసింది. భారత జాతీయ కాంగ్రెస్ ఈ డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తుంది' అని ఆయన తెలిపారు. ఆర్టికల్ 15 (5) అమలుకు సంబంధించిన చట్టాల కాలక్రమాన్ని జైరాం రమేశ్ వివరిస్తూ, కేంద్ర విద్యా సంస్థల (ప్రవేశంలో రిజర్వేషన్లు) చట్టం-2006 పార్లమెంటులో ఆమోదం పొందిందన్నారు. కేంద్ర విద్యా సంస్థలలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, సామాజికంగా, ఆర్థిక, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల పౌరులకు రిజర్వేషన్లు జనవరి 3, 2007 నుంచి అమలులోకి వచ్చాయని ఆయన వివరించారు. ఏప్రిల్ 10, 2008న అశోక కుమార్ ఠాకూర్ వర్సెస్ భారత ప్రభుత్వం కేసును ఉదహరిస్తూ, 2-0 తేడాతో ఆర్టికల్ 15(5) రాజ్యాంగబద్ధంగా ప్రభుత్వ నిర్వహణ, రాష్ట్ర-సహాయ సంస్థలకు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ సంస్థలలో రిజర్వేషన్‌లు సముచిత కోర్సులో నిర్ణయించబడతాయని తెలిపారు. మరో కేసును ఉటంకిస్తూ జైరాం రమేశ్ మాట్లాడుతూ 'ప్రమతి ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ ట్రస్ట్ వర్సెస్ భారత ప్రభుత్వం జనవరి 29, 2014. 5-0 తేడాతో ఆర్టికల్ 15(5) మొదటిసారిగా స్పష్టంగా సమర్థించిందన్నారు. 'దీని అర్థం ప్రైవేట్ విద్యా సంస్థలలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల పౌరులకు రిజర్వేషన్లు కూడా రాజ్యాంగబద్ధంగా అనుమతిస్తుంది' అని అన్నారు.

కునాల్‌కు శివసేన బెదిరింపులు

ముంబై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై అనుచిత వ్యాఖ్యల వివాదంలో చిక్కుకున్న స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రకు మద్రాసు హైకోర్టు ఏప్రిల్ 7వ తేదీ వరకూ ముందస్తు బెయిలు ఇవ్వడంపై శివసేన యువజన విభాగం నేత రాహుల్ కనల్ స్పందించారు. కునాల్ ముంబై వచ్చి లీగల్ సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని, కునాల్ మహారాష్ట్రలో ఎప్పుడు అడుగుపెట్టినా ఆయనకు 'శివసేన స్టైల్'లో స్వాగతం పలుకుతామని హెచ్చరించారు. కునాల్ కామెడీ షో అనంతరం ముంబై హాబిటాట్ స్టూడియోపై దాడి చేసిన శివసేన కార్యకర్తలకు రాహుల్ నాయకత్వం వహించారు. ఈ దాడిలో రాహుల్‌తో పాటు మరో 11 మంది కార్యకర్తలను ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం వీరంతా బెయిలుపై విడుదలయ్యారు. ఇదే సమయంలో తనను చంపుతామంటూ బెదిరింపులు వస్తున్నాయని కునాల్ మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. తనను తాను విల్లిపురం వాసినని చెప్పుకోవడంతో ఆయనకు ఏప్రిల్ 7 వరకూ షరతులతో కూడిన ముందస్తు బెయిలును మద్రాసు హైకోర్టు మంజూరు చేసింది.

కొండచరియలు విరిగిపడి ఆరుగురి మృతి

కులు: హిమాచల్ ప్రదేశ్‌లోని కులు పరిధిలోగల మణికరణ్‌లో కొండచరియలు విరిగిపడటంతో ఆరుగురు మృతిచెందారు. బలమైన గాలుల కారణంగా ఒక భారీ వృక్షం రోడ్డుపై నిలిపివుంచిన వాహనాలపై పడింది. అదే సమయంలో కొండచరియలు కూడా విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. ముగ్గురు గాయపడ్డారు. ఈ ప్రమాదంపై హిమాచల్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు విచారం వ్యక్తం చేశారు. ప్రమాదప్రాంతంలో తక్షణం సహాయక చర్యలు చేపట్టాలని ఆయన సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మణికరణ్ ప్రముఖ మతపరమైన ప్రదేశంగా గుర్తింపు పొందింది. ఆదివారం రాష్ట్రంలో 'నవ సంవత్' ఉత్సవం జరుగుతున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడం స్థానికంగా విషాదాన్ని నింపింది. ప్రమాదానికి సంబంధించిన సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతులు ఎవరన్నదీ గుర్తించలేదు.

ఘనంగా రంజాన్ వేడుకలు

దేశ వ్యాప్తంగా మసీదుల్లో ముస్లింల ప్రార్థనలు

న్యూఢిల్లీ: భారతదేశం అంతటా ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) ను జరుపుకున్నారు. ఉపవాస దీక్షల ముగింపు సంకేతమైన నెలవంక ఆదివారం కనిపించడంతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది ముస్లింలు సోమవారం ఉదయం మసీదులలో ఈద్-ఉల్-ఫితర్ వేడుకలో నమాజ్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ప్రసిద్ధ జామా మసీదు వద్ద, ముంబైలోని జుమా మసీదు వద్ద వేలాది మంది ముస్లిం సోదరులు నమాజ్ నిర్వహించారు. ముస్లిం కుటుంబాలు, స్నేహితులు రంజాన్ ఆనందాన్ని పంచుకోవడానికి కలిసి వచ్చారు. ఈ పండుగ ఐక్యత, భక్తి స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది. బీహార్‌లోని పాట్నాలో వేలాది మంది నమాజ్ చేశారు. మరోవైపు, భోపాల్‌లో వక్ఫ్ సవరణ బిల్లును నిరసిస్తూ ముస్లింలు నల్ల బ్యాండ్‌లు ధరించి ఈద్గా వద్ద నమాజ్ చేశారు స్థానికులు ఈద్ స్ఫూర్తిని కూడా జరుపుకుంటూ తమ ఆందోళనలను వ్యక్తం చేశారు. దేశమంతటా రంజాన్ ఉత్సాహం స్పష్టంగా కనిపించింది. ఆదివారం నుంచి ప్రజలు దుస్తులు, స్వీట్లు, ఇతర పండుగ వస్తువులను కొనుగోలు చేయడానికి స్థానిక మార్కెట్లకు తరలి వచ్చారు. దీంతో నగర మార్కెట్లు సందడిగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో నఖోడా మసీదు సమీపంలోని మార్కెట్లు రంజాన్ వేడుకలకు అందంగా, ఈ ప్రాంతం రంగురంగుల లైట్లతో అలంకరించారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని చారిత్రక చార్మినార్ చుట్టూ ఉన్న మార్కెట్లు విద్యుత్ దీపాలతో, రంగురంగుల అలంకరణలతో శోభిల్లాయి. ఉత్తర ప్రదేశ్‌లోని నోయిడాలో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పోలీసు సిబ్బంది అన్ని మసీదుల వద్ద పహారా కాస్తున్నారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలోని ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా ముస్లింలు మహీం దర్గాలో నమాజ్ నిర్వహించారు.

రాష్ట్రపతి, ప్రధాని మోదీ ఈద్ శుభాకాంక్షలు

భారతదేశం, విదేశాలలో నివసిస్తున్న భారతీయులందరికీ, ముఖ్యంగా ముస్లిం సోదర సోదరీమణులకు... రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. 'ఈ పండుగ అందరికీ శాంతి, పురోగతి, ఆనందాన్ని తెస్తుంది. సానుకూల దృక్పథంతో ముందుకు సాగడానికి మాకు బలాన్ని ఇస్తుంది' అని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ తన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇస్లామిక్ పండుగ 'మన సాంస్కృతిక వైవిధ్యం, మనల్ని ఏకం చేసే ఉమ్మడి బంధాల నుంచి మనం పొందే బలాన్ని గుర్తు చేస్తుంది' అని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్' లో ఒక పోస్ట్‌లో ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. 'ఈ పండుగ మన సమాజంలో ఆశ, సామరస్యం, దయ స్ఫూర్తిని పెంపొందిస్తుంది. మీ అన్ని ప్రయత్నాలలో ఆనందం, విజయం ఉండాలి. ఈద్ ముబారక్!' అని పేర్కొన్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అందరికీ ఆనందం, ఆశీర్వాదాలు, సోదర స్ఫూర్తిని కోరుకుంటున్నట్లు తెలిపింది. 'ఈద్-ఉల్-ఫితర్ ఆనందకరమైన సందర్భంగా ప్రతి ఇంటిలోనూ ప్రేమ, శాంతి, శ్రేయస్సు నిండాలి' అని పార్టీ తన సందేశంలో పేర్కొంది.

ఆఫ్‌షోర్ మైనింగ్ టెండర్లు రద్దు చేయండి

ప్రధానికి రాహుల్ గాంధీ లేఖ

న్యూఢిల్లీ: కేరళ, గుజరాత్, అండమాన్ నికోబార్ దీవుల్లో ఆఫ్‌షోర్ మైనింగ్ టెండర్లను రద్దు చేయాలని ప్రధాని మోదీకి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేఖ రాశారు. ఆఫ్‌షోర్ మైనింగ్‌కు అనుమతి ఇవ్వడం వల్ల... సముద్ర జీవాల మనుగడ ప్రమాదంగా మారుతుందన్నారు. ప్రైవేటు కంపెనీలకు ఆఫ్‌షోర్ మైనింగ్ అనుమతి ఇవ్వడం ఆందోళనకరంగా ఉందన్నారు. కేరళ, గుజరాత్ రాష్ట్రాలతో పాటు అండమాన్ నికోబార్ దీవిలో మైనింగ్‌కు అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు. ఆఫ్‌షోర్ మైనింగ్ టెండర్ల ప్రక్రియను కోస్టల్ ప్రజలు వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

పర్యావరణ ప్రభావాన్ని అంచనా వేయకుండానే అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. తమ జీవనోపాధి, జీవితాలపై తీవ్ర ప్రభావం పడుతుందని లక్షల సంఖ్యలో జాలర్ల కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేసినట్లు రాహుల్ తన లేఖలో గుర్తు చేశారు. స్థానికుల అభిప్రాయాలు తీసుకోకుండా, పర్యావరణ పరిస్థితుల్ని పరిగణలోకి తీసుకోకుండా ఆఫ్‌షోర్ మైనింగ్‌కు అనుమతి ఇవ్వడాన్ని ఖండిస్తున్నట్లు రాహుల్ తన లేఖలో తెలిపారు. ప్రభుత్వం తక్షణమే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఆఫ్‌షోర్ ఏరియాస్ మినరల్ సవరణ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. ఆఫ్‌షోర్ మైనింగ్‌తో మెరైన్ లైఫ్‌కు ప్రమాదం ఏర్పడుతుందని, కోరల్ రీఫ్స్ డ్యామేజ్ జరుగుతుందని, మత్స్య సంపద కూడా తగ్గిపోతుందని తెలిపారు. 13 ప్రదేశాల్లో ఆఫ్ షోర్ మైనింగ్ కోసం ఖనిజ మంత్రిత్వశాఖ టెండర్లు ఆహ్వానించింది. ఆ సమయంలో తీవ్ర నిరసనలు జరిగినట్లు రాహుల్ తన లేఖలో తెలిపారు. కొల్లాంలో మెరైన్ మానిటరింగ్ ల్యాబ్ ఏర్పాటు చేయడం వల్ల ఫిష్ బ్రీడింగ్ సమస్య ఏర్పడనున్నట్లు చెప్పారు. కేరళలో 11 లక్షల మంది చేపల వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం నడపడం వారికి తెలియదు

ఢిల్లీలో విద్యుత్ కోతలకు బీజేపీయే కారణం: ఆతిశీ

న్యూఢిల్లీ: గత నెలలో పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశ రాజధాని నగరంలో విద్యుత్ అంతరాయాలు పెరిగాయని ఆరోపిస్తూ, నగరంలోని బీజేపీ ప్రభుత్వం విద్యుత్ సరఫరాను నిర్వహించడంలో విఫలమైందని ఆ పార్టీ సీనియర్ నాయకురాలు, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి ఆతిశీ విమర్శించారు. అయితే బీజేపీ దీనిపై వెంటనే స్పందించలేదు. ఇక్కడ విలేకరుల సమావేశంలో ఆతిశీ మాట్లాడుతూ ఆప్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు... దేశ రాజధానిలో దీర్ఘకాల విద్యుత్ కోతలు సాధారణంగా ఉండేవి. ప్రతి ఇంట్లో ఇన్వర్టర్లు ఉండేవి. కానీ 2015 ఫిబ్రవరిలో అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రి అయిన విద్యుత్ విద్యుత్ కోతలు ఒక చరిత్రగా మారాయి' అని గుర్తు చేశారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో సమర్పించిన డేటాను ఉటంకించి ఆమె మాట్లాడుతూ ఆప్ ప్రభుత్వ హయాంలో ఢిల్లీకి 24 గంటలూ విద్యుత్ సరఫరా అందినట్లు చెప్పారు. 'ఆప్ 10 సంవత్సరాల పాలనా కాలంలో ఎటువంటి అంతరాయం లేకుండా ఉన్న విద్యుత్ కోతలు ఇప్పుడు తిరిగి ఎందుకు వచ్చాయి? దీని అర్థం ఒకే ఒక విషయం : బీజేపీకి ప్రభుత్వాన్ని ఎలా నడపాలో తెలియదు. వారికి ఢిల్లీ ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశం లేదా సామర్థ్యం లేదు' అని అన్నారు.

మోదీకి పదవీ విరమణ తప్పదా? సంజయ్ రౌత్

ముంబై: గత పదేళ్లలో ఎన్నడూ ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి వెళ్లని ప్రధాని మోదీ ఇప్పుడు వెళ్లడం... బహుశా ఆయన పదవీ విరమణ చేయాలని యోచిస్తున్నారేమోనని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మోదీ ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించడంపై ఆయన మాట్లాడుతూ మోదీ... తన పదవీవిరమణ ప్రణాళికల గురించి ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్‌తో చర్చలు జరపడానికే అక్కడికి వెళ్లి ఉంటారన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. 'ఆర్ఎస్ఎస్ దేశ నాయకత్వంలో మార్పును కోరుకుంటున్నట్లు నేను నమ్ముతున్నాను. వారు తదుపరి బీజేపీ అధినేతను ఎన్నుకోవాలనుకుంటున్నారు. ఆ సంస్థ నియమాల ప్రకారం మోదీ కూడా రాజకీయాలకు విరమణ ప్రకటించాలని అనుకుం టున్నారు. అందుకే ఆయన మోహన్ భగవత్‌ను కలిసి పదవీవిరమణ పత్రాన్ని సమర్పించడానికి వెళ్లి ఉంటారు. అయితే మోదీ రాజకీయ వారసుడు మహారాష్ట్ర నుంచే వస్తాడని బలంగా నమ్ముతున్నాను' అని సంజయ్ రౌత్ అన్నారు.

2029లోనూ మోదీనే ప్రధాని: ఫడ్నవీస్

ప్రధాని మోదీ రిటైర్మెంట్‌పై సంజయ్‌రౌత్ చేసిన వ్యాఖ్యలను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కొట్టిపడేశారు. మోదీ నాయకత్వంలో తాము ఇంకా చాలా ఏళ్లు పని చేస్తామని అన్నారు. 2029లోనూ ఆయన ప్రధానిగా సేవలందిస్తారని పేర్కొన్నారు. సమర్థవంతమైన నాయకుడు తమను నడిపిస్తున్నప్పుడు వారసుడి కోసం వెతకాల్సిన అవసరం ఏముంటుందని ప్రశ్నించారు. 11 ఏళ్ల క్రితం ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రధాని మోదీ తొలిసారిగా ఆదివారం నాగ్‌పూర్‌లోని సంఘ్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. తొలుత డాక్టర్ హెడ్గేవార్ స్మృతి మందిరానికి వెళ్లిన ప్రధాని.. సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్, రెండో సర్‌సంఘ్‌చాలక్ ఎంఎస్ గోళ్వాల్కర్‌లకు నివాళులు అర్పించారు. అనంతరం స్మృతిభవన్‌లో ఆర్ఎస్ఎస్ పదాధికారులతో భేటీ అయి వారితో గ్రూప్‌ఫొటో దిగారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ను దేశ అజరామర సంస్కృతి, ఆధునికీకరణ వటవృక్షంగా అభివర్ణించారు. కాగా దేశ ప్రధానులు ఆర్ఎస్ఎస్ కార్యాలయాన్ని అధికారికంగా సందర్శించడం ఇది రెండోసారి. 2000లో వాజ్‌పేయి మూడోసారి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు దీనిని సందర్శించారు.

ప్రియాంక కాన్వాయ్ అడ్డగింత... యూట్యూబర్ అరెస్ట్

వయనాడ్: కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఎంపీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కాన్వాయ్‌ను అడ్డుకున్నందుకు త్రిస్సూర్ జిల్లాలో ఒక యూట్యూబర్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి మన్నుత్తి పోలీసులు ఎలనాడు నివాసి అనీశ్ అబ్రహాంతో పాటు అతడి కారును కూడా అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఆ తరువాత స్టేషన్ బెయిల్‌పై ఆ యూట్యూబర్‌ను విడిచిపెట్టినట్లు వెల్లడించారు. శనివారం తన నియోజకవర్గంలోని మలప్పురం జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన తర్వాత మలప్పురంలోని వండూర్ నుంచి కొచ్చి విమానాశ్రయానికి వెళ్తుండగా రాత్రి 9.30 గంటల ప్రాంతంలో మన్నుత్తి బైపాస్ జంక్షన్ దగ్గర ప్రియాంక గాంధీ వాద్రా కాన్వాయ్‌లోని పైలట్ వాహనం హారన్ మోగించడంతో విసుగు చెందిన అనీశ్ అబ్రహాం తన కారును తీసుకెళ్లి ప్రియాంక గాంధీ కాన్వాయ్ ముందు ఆపాడు. దీంతో అక్కడ ఒక్కసారిగా గందరగోళ పరిస్థితి ఏర్పడింది. కాన్వాయ్ ముందు నుంచి కారు తొలగించాలని నిందితుడిని కోరగా అతడు పోలీసులతో ఘర్షణకు దిగాడని పేర్కొన్నారు. అనీశ్ అబ్రహాంపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ప్రత్యేక ప్రార్థనలో ఎమ్మెల్యే మర్రి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మౌలాలి సాదుల్లా నగర్‌లోని ఈద్గాలో ప్రార్థనలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఉపవాస దీక్ష చేసి ఎంతో నిష్ఠగా ఉంటారని, అదే విధంగా రంజాన్ కులమతాలకతీతంగా ఎంతో ఆత్మీయంగా అందరూ కలిసి పండుగ చేసుకోవడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు.

మొరాయించిన పంపులు... 5 గంటల్లో సరఫరా పునరుద్ధరణ..!!

విశాలాంధ్ర - హైదరాబాద్ : జలమండలి ఓ అండ్ డివిజన్ నంబర్-8 పరిధిలోని అలియాబాద్ సెక్షన్‌లో సోమవారం ఉదయం 5.30 గంటలకు అలియాబాద్ రిజర్వాయర్ పరిసరాలలో విద్యుత్ కేబుల్ సమస్య ఏర్పడిందని, దీని వల్ల షార్ట్ సర్క్యూట్ కారణంగా 100 హెచ్‌పీ పంపులు ఆగిపోయాయని, దీంతో డివిజన్-1, డివిజన్-8 పరిధిలోని ప్రాంతాల్లో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఈ విషయాన్ని అధికారులు ఎండీ అశోక్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే రంజాన్ పండుగ దృష్ట్యా వెంటనే మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరణ చెయ్యాలని అధికారులను ఆదేశించారు. దీంతో వీటిని ఓ అండ్ ఎం, ఎలక్ట్రికల్ వింగ్ అధికారులు సమన్వయంతో కార్మికుల సాయంతో జలమండలి అధికారులు, సిబ్బంది స్థాయిలో 11.00 గంటలకు పూర్తి చేశారు. నీటి సరఫరా పునరుద్ధరించారు. ప్రభావిత ప్రాంతాలలో మిస్రిగంజ్ సెక్షన్ ప్రాంతాలు షక్కర్‌గంజ్, రూప్‌లాల్ బజార్, ఫరీదియా మసీదు, షాలిబండ మెయిన్ రోడ్, లసల్‌దర్వాజా మూడ్, గాజీ బండ్, హమల్‌వాడి, కాజీపుర ప్రాంతాల్లో దాదాపు 650 కనెక్షన్లకు నీటి సరఫరాను పునరుద్ధరించారు. 5 గంటల వ్యవధిలోనే పూర్తి చేసి, సరఫరా పునరుద్ధరించిన అధికారులు, సిబ్బందిని ఎండీ అశోక్ రెడ్డి అభినందించారు. భవిష్యత్తులోనూ ఇలాగే కష్టపడి పనిచేయాలని సూచించారు.

కాలనీ సంక్షేమ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా చుంకు శ్రీనివాస్

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి సర్కిల్ మౌలాలి డివిజన్ పరిధిలోని లక్ష్మి నగర్ కాలనీ సోమవారం జరిగిన వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలలో అసోసియేషన్ అధ్యక్షులుగా చుంకు శ్రీనివాస్ 23 ఓట్ల మెజారిటీతో ప్రత్యర్థి బి.ప్రతాప్ రెడ్డిపై ఘనవిజయం సాధించారు. చుంకు శ్రీనివాస్ వరుసగా రెండోసారి ప్రెసిడెంట్‌గా గెలవడం, అంతకుముందు లక్ష్మీ నగర్ కాలనీకీ ప్రధాన కార్యదర్శిగా 12 సంవత్సరాలుగా సేవలందించారు. శ్రీనివాస్ ప్యానెల్‌లోని ప్రధాన కార్యదర్శి బి.నరసింగ్ రావు, కోశాధికారి హెచ్.సతీష్ తమ సమీప ప్రత్యర్థిలపై విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా చుంకు శ్రీనివాస్ మాట్లాడుతూ మరొకసారి తనను అధ్యక్షునిగా గెలిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఇప్పటి వరకు తాను చేసిన సేవల్ని గుర్తించి విజయనందించిన కాలనీ ప్రజలకు నిరంతర అందుబాటులో ఉంటూ, గతంలో చేసిన సేవలకంటే మరింత సేవలను పెంచి ఎక్కువగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని ఆయన తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.

మైనార్టీ నేతల గృహాల్లో ఘనంగా ఈద్ మిలాప్

విశాలాంధ్ర- అమనగల్లు : మైనార్టీ నేతల స్వగృహాల్లో వారి వారి గ్రామాల్లో పెద్ద ఎత్తున రంజాన్ వేడుకలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాలకు తోటి నాయకులు మీడియా ప్రతినిధులు హాజరవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మహ్మద్ అబ్దుల్ ఖలీల్ స్వగృహంలో జరిగిన రంజాన్ విందుకు ఎఐసిసి చల్లా వంశీ చంద్ రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, పిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ అధ్యక్షులు యాట నర్సింహా, తదితరులు పెద్ద ఎత్తున హాజరై విందును స్వీకరించారు. అదేవిధంగా బిఆర్ఎస్ మైనార్టీ నాయకులు సయ్యద్ ఖలీల్ నివాసంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెంకటేష్ గుప్తా, మాజీ జెడ్పిటిసిలు దశరథ్ నాయక్, విజితా రెడ్డి, ఆయా మండలాల మీడియా ప్రతినిధులు తదితర నాయకులు తదితర నాయకులు కార్యకర్తలు ప్రజలు హాజరై ఈద్ ముబారక్ చెప్పారు.

రంజాన్ వేడుకల్లో మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : రంజాన్ పండగ సందర్భంగా కరీంనగర్ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. కరీంనగర్‌లో వారి స్నేహితులు సయ్యద్ షా ఖాజా మొహినుద్దీన్ ఖాద్రి, షాస మొల్ల నివాసానికి వెళ్ళి ఉత్సాహంగా గడిపారు. వారికి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ సందర్భంగా వారి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ అహ్మద్ అలీ ఇంటికి వెళ్లి వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్ ఏ మోసిన్ నివాసానికి వెళ్ళారు. వారికి కుటుంబ సభ్యులకు స్వీట్స్ తినిపించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

పండుగలు సోదర భావానికి ప్రతీకలు

ఎమ్మెల్యే యెన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : పండుగలు సోదర భావానికి ప్రతీకలు అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని మహబూబ్ నగర్ నియోజకవర్గం లోని మయూరి నర్సరీ దగ్గర గల అహిలే అద్దీస్ ఈద్గా వద్ద జరిగిన రంజాన్ ప్రత్యేక ప్రార్థనలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పవిత్రమైన ఈ రంజాన్ మాసంలో మీరు చేసిన ప్రార్థనలు సఫలం కావాలని, ఈ మహబూబ్ నగర్ అందరి సహాయ సహకారాలతో అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ఇసా అమోది, నియమతుల్లా, సైఫ్ జియాయుద్దీన్, షయకత్ హుస్సేన్, నూర్ మక్సూద్ తదితరులు పాల్గొన్నారు.

అల్లా దీవెనలతో అందరికీ సకల శుభాలు కలగాలి....

అల్లా దీవెనలతో అందరికీ సకల శుభాలు కలగాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని మహబూబ్ నగర్ పట్టణంలోని ఈద్గా దగ్గర ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్లిం సోదరులను కలిసి వారికి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, ధార్మిక చింతన కలయికనే రంజాన్ మాసం విశిష్టత అని, మనిషిలోని చెడు భావాన్ని, అధర్మాన్ని, ద్వేషాలను రూపుమాపే గొప్ప పండగ రంజాన్ అని ఆయన తెలిపారు.

అల్లా చూపిన మార్గంలో నడవాలని అల్లా చల్లని దీవెనలు మనందరిపై ఉండాలని ఆయన మనస్ఫూర్తిగా కోరారు. రంజాన్ పండగ ఎంతో పవిత్రమైన పండగ అని మతసామరస్యానికి, సహృద్భావానికి, సర్వ మానవ సమానత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక రంజాన్ పండుగ అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, వినోద్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్‌పి వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మిథున్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, సిరాజ్ ఖాద్రీ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, సిజె బెనహర్, అవేజ్, ఏర్పుల నాగరాజు మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి : రాచాల

విశాలాంధ్ర-బషీర్ బాగ్: సమయం వచ్చినప్పుడల్లా ప్రధాని మోదీ తాను బీసీ అని చెప్పుకోవడం కాదు బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ తెలంగాణ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని పార్లమెంటులో వెంటనే ఆమోదించాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఢిల్లీ జంతర్ మంతర్లో ఏప్రిల్ 2 న బీసీ సంఘాల ఆధ్వర్యంలో జరగబోయే బీసీల మహాధర్నా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను బీసీ సంఘాల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ రాహుల్ గాంధీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం కూడా చేసిందన్నారు. బీసీల ఆకాంక్షల పట్ల కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని, బీసీలకు భరోసా కల్పించిన రాహుల్ గాంధీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ సమాజం తరపున ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం బీసీల వైపా, అగ్రవర్ణాల వైపా తేల్చుకోవాలని, పేద ప్రజల వైపు ఉంటారో... పెట్టుబడిదారుల వైపు ఉంటారో నిర్ణయించుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. మాటిమాటికి బీసీ ఎజెండా అనడం కాదు, నిజంగా చిత్తశుద్ధి ఉంటే 42 శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలపాలని అని డిమాండ్ చేశారు.తెలంగాణ మాదిరిగానే అన్ని రాష్ట్రాల్లో కులగణన చేయాలని, మెజారిటీగా ఉన్న బీసీల కోసం కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసం బీసీ ఎజెండా కాకుండా బీసీల రాజ్యాధికారం కోసం విధానం ప్రకటించాలన్నారు. బుధవారం జరగబోయే మహాధర్నాకు వచ్చే వారికి ప్రత్యేక రైలు సదుపాయం, భోజనం, వసతి సౌకర్యం కల్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల సరేందర్ గౌడ్, జాతీయ ఓబీసీ మేధావుల ఫోరం అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ, జైగౌడ ఉద్యమం జాతీయ అధ్యక్షులు వట్టికూటి రామారావు గౌడ్, ఓబీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు కిరణ్ కుమార్, పరికిపండ్ల అశోక్, బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు బడేసాబ్, చింతపల్లి సతీష్, వివి గౌడ్, అంజన్న యాదవ్, దేవర శివ, రాఘవేందర్, బిక్షపతి, రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఇంద్రియా' జ్యువెలరీ షోరూమ్ ప్రారంభం

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : ఆభరణాల ప్రియుల ప్రియమైన గమ్యస్థానంగా మారడమే లక్ష్యంగా 'ఇంద్రియా' ఆదిత్య బిర్లా జ్యువెలరీ విస్తరణ చేపట్టింది. అందులో భాగంగా ఏఎస్ రావు నగర్‌లో తన మూడో షోరూమ్‌ను ప్రారంభించింది. కేవలం వారం రోజుల్లోనే కొండాపూర్, కొంపల్లి ప్రాంతాల్లో షోరూమ్‌లు ప్రారంభించిన తర్వాత ఇప్పుడు ఈ స్టోర్ ప్రారంభించడం ద్వారా ఇంద్రియా హైదరాబాద్ మార్కెట్లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ఈ సందర్భంగా ఇంద్రియా సీఈఓ సందీప్ కోహ్లీ మాట్లాడుతూ దేశవ్యాప్త విస్తరణలో భాగంగా దక్షిణాదిలోకి ప్రవేశించామన్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో మరిన్ని దుకాణాలు ప్రారంభించాలన్న ప్రణాళికలు ఉన్నాయన్నారు. హైదరాబాద్ చాలా కాలంగా అద్భుతమైన ఆభరణాలకు పర్యాయపదంగా ఉందన్నారు. ఇది దాని రాజ వారసత్వం, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు. ముత్యాల నగరం అని పిలువబడే ఈ నగరం చక్కటి హస్తకళకు ప్రసిద్ధి చెందిందన్నారు. క్లిష్టమైన కుందన్, పోల్కి డిజైన్లతో పాటు బస్రా ముత్యాల కళాత్మక ఆకర్షణ ఈ నగరానికి ప్రత్యేక గౌరవాన్ని తీసుకు వచ్చాయన్నారు. హస్తకళను గౌరవించే హైదరాబాద్ ఇప్పటికి సంప్రదాయ ఆభరణాల శైలిని ప్రదర్శించే ఒక ప్రధాన గమ్యస్థానంగా ఉందన్నారు. అందం, ప్రాచీనత సమ్మిళితంగా రూపొందించిన ఈ షోరూమ్‌లో ప్రత్యేకంగా 'కారిగరి గది' ఉందన్నారు. ఇది ఇంద్రియా ప్రత్యేక శిల్పకళను, సృజనాత్మకతను కొత్త వినియోగదారులకు చేరువ చేస్తుందన్నారు. గత జూలైలో మొదటి షోరూమ్ ప్రారంభించినప్పటి నుంచి ఇంద్రియా దేశవ్యాప్తంగా తన నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరించుకుందన్నారు. భారతదేశంలో 18 స్టోర్లను నెలకొల్పిందన్నారు. వీటిలో ఢిల్లీలో ఐదు, ముంబయిలో మూడు, అహ్మదాబాద్, జైపూర్, పుణే, హైదరాబాద్‌లో రెండు చొప్పున, ఇండోర్, సూరత్‌లో ఒక్కొక్కటి ఉన్నాయన్నారు. 15,000 పైగా ఎంపిక చేసిన ఆభరణాలు, 5,000 పైగా ప్రత్యేక డిజైన్లతో ఇంద్రియా ఆభరణాల ప్రేమికుల కోసం అపూర్వమైన ఎంపికను అందిస్తుందన్నారు. ఇది దక్షిణాదిలో బ్రాండ్ అభివృద్ధికి బలమైన వేదికను సిద్ధం చేస్తుందన్నారు.

ఆభరణాలు ఇప్పుడు కేవలం పెట్టుబడిగా మాత్రమే కాకుండా, వ్యక్తిత్వాన్ని తెలియజేసే ప్రత్యేక ప్రతీకగా మారుతున్నాయని చెప్పారు. ఇంద్రియాలో అపురూపమైన డిజైన్లు కలవన్నారు. ప్రాచీన సాంస్కృతిక వారసత్వం, విలాసవంతమైన ఆభరణాలపై నమ్మకం కలిగిన హైదరాబాద్‌లో మా కొత్త షోరూమ్లు ప్రారంభించడం గర్వంగా ఉందన్నారు.

బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో కీలక పరిణామం

ఐదుగురితో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు

విశాలాంధ్ర - హైదరాబాద్ : బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. సిట్ ఏర్పాటు చేస్తూ డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. సిట్ ప్రధాన అధికారిగా ఐజీ రమేశ్‌ను నియమించారు. ఇందులో సభ్యులుగా ఎస్పీలు సింధు శర్మ, వెంకటలక్ష్మి, అదనపు ఎస్పీలు చంద్రకాంత్, శంకర్ ఉన్నారు. ఇక బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో ఇప్పటికే పంజాగుట్టతో పాటు సైబరాబాద్, మియాపూర్ పోలీస్ స్టేషన్లలో 25 మంది సెలబ్రిటీలపై కేసులు నమోదయ్యాయి. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం ఇప్పుడు సిట్‌ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై నెలన్నర రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని డీజీపీ జితేందర్ సిట్‌ను ఆదేశించారు.

బోడుప్పల్‌లో ఘనంగా రంజాన్ వేడుకలు

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రంజాన్ పర్వదిన వేడుకలను సోమవారం ఉదయం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. నగరంలోని ప్రఖ్యాత కుతుబ్షాహీ అలంగీర్ మస్జీద్ నందు ముస్లింలు ప్రత్యేక ఈదుల్ ఫితర్ ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్ద మొహమ్మద్ షఫీ రంజాన్ సందేశంలో భాగంగా ప్రతివ్యక్తి దానగుణం కలిగి ఉండాలని, తనకు ఉన్నదాంట్లో దానం చేయడమే గొప్పలక్ష్యంగా భగవంతుడు పేర్కొన్నారని గుర్తుచేశారు. ప్రతిఒక్కరూ మహ్మద్ ప్రవక్త చూసిన మార్గాన్ని అనుసరించాలని సూచించారు. అనంతరం ఒకరికొకరు అలాయ్ బలయ్ చేసుకుంటా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ తాజుద్దీన్, మహబూబ్ అలీ, షఫీ, ఉరూజ్, ఫిరోజ్, అబ్బాస్, నిజాం, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈదుల్ ఫితర్

విశాలాంధ్ర - అమనగల్లు: ముస్లింల పవిత్ర పండుగ రంజాన్‌ను అమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల్, ఆయా గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల ఉపవాస దీక్షల అనంతరం సోమవారం రంజాన్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. రంజాన్ సందర్భంగా ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థలకు వేలాది మంది ముస్లింలు తరలివచ్చారు. మత గురువు అబ్దుల్ వాహేద్ ఖురాన్ సూక్తులను వినిపించి, ప్రార్థనలు చేయించారు. ముస్లింల జీవితంలో రంజాను ఎంతో ప్రాధాన్యత కలదని, ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ రంజాన్ మాసంలో ఆవిర్భవించిందన్నారు.దాంతో రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు పాటించాలన్నారు.

ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ

విశాలాంధ్ర,షాద్ నగర్,రూరల్: పవిత్ర రంజాన్ మాసంలో ప్రజలందరికీ సుఖ సంతోషాలు కలగాలని, ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండల మాజీ వైస్ ఎంపిపి కంసాన్ పల్లి బసిరెడ్డి నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఈ మేరకు రంజాన్ పర్వదిన సందర్భంగా ముస్లిం సోదరులకు కంసాన్పల్లి గ్రామంలో 40 ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... హిందూ, ముస్లిం భాయి భాయి అనే విధంగా ఇలాంటి పర్వదిన వేడుకలు నిలుస్తాయని, ముస్లింలు రంజాన్ మాసంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తుపాకుల శేఖర్, వార్డ్ మెంబర లు బాలవర్ధన్ రెడ్డి, గొల్ల వెంకటయ్య, మాల రవి, వడ్డె కృష్ణ, కుమార్, డిప్యూటీ సర్పంచ్ తనయుడు నరసింహ మరియు సయ్యద్, వాహబ్, మహబూబ్, అన్వర్,మున్ను, శుక్రుఫ్, కురువ మల్లయ్య, కాకరజాల చెన్నయ్య, ఇక్బాల్, మహబూబ్, అయూబ్, కురువ సత్యనారాయణ, హనుమంత్ రెడ్డి, అజయ్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, అంజాద్, పాషా, ఆటో పాషా తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు నగేష్ ముదిరాజ్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : రంజాన్ పర్వదిన సందర్భంగా భోలకపూర్, ముషీరాబాద్ లో ముస్లిం సోదరుడు సమద్ కు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు నాగేష్ ముదిరాజ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, సృష్టికర్త అల్లా అనుగ్రహం మన అందరిపైన ఎల్లవేళలా ఉండాలని జీవితాలలో సుఖశాంతులు ఆనందం ఎల్లప్పుడు ఉండాలని కోరుకుంటూ, పవిత్ర రంజాన్ పర్వదినం మన అందరిలో సోదర భావాన్ని పెంపొందించి మనలో కొత్త ఉత్సాహాన్ని నింపాలని ఆకాంక్షిస్తూ ముస్లిం సోదర, సోదరీమణు లందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

మత సామరస్యానికి ఆదర్శం తెలంగాణ : మేయర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రంజాన్ పండుగ సందర్భంగా భోలక్ పూర్ వార్డు కార్పొరేటర్ గౌస్ మొయినుద్దీన్ ఆహ్వానం మేరకు సోమవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కార్పొరేటర్ ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మేయర్‌ను సన్మానించి షిరుకుమను అందించారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ... మత సామరస్యానికి తెలంగాణా రాష్ట్రం ఇతర రాష్ట్రాల కంటే ఆదర్శంగా నిలుస్తుందని, ముస్లిం హిందువులు స్నేహపూర్వకంగా ఉంటూ మతాలకు అతీతంగా స్నేహభావంతో ఉంటారని ముఖ్యంగా హైదరాబాద్ నగరం గంగా యమునా తేహజీబ్‌గా భారతంలోనే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ముస్లిం హిందూ పండగలకు కలిసి మెలిసి ఉంటూ అన్నదమ్ముల జరుపుకునే వేదికగా హైదరాబాద్. నిలుస్తుందన్నారు. ఈదుల్ ఉల్ ఫితర్ (రంజాన్) పండుగకు ఆహ్వానించిన కార్పొరేటర్ గౌస్ మొయినుద్దీన్, వారి కుటుంబ సభ్యులకు మేయర్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగకు ఇంటికి పిలిచి దావత్ ఇచ్చిన కార్పొరేటర్ గౌస్ మొయినుద్దీన్‌కు హృదయపూర్వక అభినందనలు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు.

ఘనంగా హిందీ ప్రచార సభ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-బషీర్ బాగ్: నగరంలోని హిందీ ప్రచార సభ హైదరాబాద్ స్థాపించి 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 90వ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఎస్. గైబువల్లి మాట్లాడుతూ జాతీయ సమైక్యతను చాటే లక్ష్యంతో 1935వ సంవత్సరంలో ఉగాది పర్వదినాన తమ సంస్థ ఆవిర్భవించిందని తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా సంస్థ ప్రారంభించబడి పలు రాష్ట్రాల్లో విస్తరించిందని గుర్తు చేశారు. హిందీ ప్రచార సభ హైదరాబాద్ కోర్సుల ద్వారా లక్షలాది మంది విద్యార్థులు హిందీ భాష నేర్చుకొని హిందీ ఉపాధ్యాయులుగా, అధ్యాపకులుగా స్థిరపడ్డారని తెలిపారు. హిందీ ప్రచార, సాహిత్య, కవి సమ్మేళనాలు, డిగ్రీ పట్టా ప్రధానోత్సవ కార్యక్రమాలు, జాతీయ, అంతర్జాతీయ హిందీ భాషా దినోత్సవాలతో పాటు హిందీ భాషాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. దేశ ప్రథమ రాష్ట్రపతి దివంగత డాక్టర్ బి రాజేంద్రప్రసాద్, మాజీ రాష్ట్రపతి దివంగత జ్ఞాని జైల్ సింగ్, మాజీ ప్రధానమంత్రి దివంగత పివి నరసింహారావు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుతో పాటు అనేక మంది కేంద్ర, రాష్ట్ర మంత్రులు, గవర్నర్లు హిందీ ప్రచార సభ కార్యక్రమాలకు హాజరయ్యారని వివరించారు. రెండు నెలల పాటు 90వ వార్షికోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హిందీ ప్రచార సభ హైదరాబాద్ పరీక్షా సంచాలకులు ప్రొఫెసర్ సురేష్, కన్వీనర్ శృతికాంత్ భారతి, తెలంగాణ హిందీ ప్రచార సభ అధ్యక్షుడు కె.రామచందర్, కార్యదర్శి ఏకే రాజు, రిజిస్ట్రార్ నామ్ దేవ్ వాగ్మడే, కార్యాలయ కార్యదర్శి కె.వెంకటేశ్వర్ ఉద్యోగ సంఘం కార్యదర్శి శివ, హిందీ భాషా ప్రముఖులు శంకర్ సింగ్ ఠాకూర్, కల్పన, మిలింద్ ప్రకాశన్ అధినేత విభా భారతి, ఆర్థికవేత్త ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

అధికారుల అండతోనే భూకబ్జాలు...

బినామీల పేర్లతో దొంగ పత్రాలు.....

కలెక్టర్ ఆదేశాలను లెక్కచేయని రెవెన్యూ అధికారులు...

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికుల ఆరోపణ...

విశాలాంధ్ర-దుండిగల్: పట్టణంలో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు రియల్ మాఫియా సాగిస్తున్నారు. వివాదాల్లో ఉన్న ప్రభుత్వ మిగులు స్థలాలపై కన్నేస్తున్నారు. ప్రభుత్వ శాఖలకు చెందిన వాటినీ కూడా వదలట్లేదు. ఖాళీగా కనిపిస్తే చాలు గద్దలాగా వాలిపోయి కబ్జాలకు పాల్పడుతూ కాంగ్రెస్ పార్టీ పరువు తీస్తున్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని, యంత్రాంగంపై ఒత్తిళ్లు తీసుకొచ్చి, అక్రమ మార్గాల్లో రిజిస్ట్రేషన్లు చేసేసుకుని, కోట్ల విలువైన భూములను వశం చేసుకుంటున్నారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండి మైసమ్మ మండలం పరిధిలోని ప్రభుత్వ భూములు రోజు రోజుకి కబ్జాకు గురవుతున్నా అధికారులు మాకేం పట్టింది లే అన్నట్టుగా చాటు మాటున చేతులు చాసి జేబులు నింపుకునే పనిలో నిమగ్నమ య్యారు. రెవెన్యూ అధికారుల అండదండలతో యదేచ్ఛగా సర్కారు భూములను ఆక్రమించి యంత్రాలతో చదును చేయించి, సెంట్ల చొప్పున విక్రయిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాలంటూ కలెక్టర్ జారీ చేస్తున్న ఆదేశాలను గండి మైసమ్మ రెవెన్యూ అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల తర్వాత అధికారంలోకి రావడంతో... మళ్లీ తర్వాత గెలుస్తామో లేదో... దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే కోణంలో కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు వారి అనుచరులు మండలం పరిధిలోని ఖాళీగా కనిపించిన ప్రభుత్వ భూములను ఆఫీసర్ల కొండంత బలంతో వాటికి తమ పేర్లు, బినామీల పేర్లతో దొంగ పత్రాలను సృష్టించి దర్జాగా కబ్జాకు పాల్పడుతున్నారు. స్మశానాలు, చెరువులు, ప్రభుత్వ భూములు ఇలా ఏదైనా కాదేది కబ్జాకు అనర్హం అనే రీతిలో చెలరేగిపోతున్నారు. వివరాల్లోకి వెళితే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మండలం డి.పోచంపల్లి 8 వార్డ్ సాయి పూజ కాలనీ సర్వే నెంబర్ 120/23 లో ఏకంగా 50 లక్షలు విలువ చేసే 200 గజాల ప్రభుత్వ భూమిని కొందరు అధికార పార్టీకి చెందిన నాయకులు చెరబట్టి స్లాబ్‌తో కూడిన నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. వీటిపై ఆ కాలనీకి చెందిన పలువురు ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేసిన తహసిల్దార్ సయ్యద్ మతిన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అన్వేష్ కుమార్, వీఆర్ఏలు జితేందర్, జశ్వంత్ పట్టించుకోవడంలేదని పలువురు మండిపడుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రభుత్వ భూములు మాయం...

రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నాయి. ప్రభుత్వ భూములలో సూచికల బోర్డులు ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. దీంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి.

అందులో భాగంగానే గండి మైసమ్మ మండలం చర్చి గాగిల్లాపూర్ సర్వే నెంబర్ 214 రాజీవ్ గాంధీ నగర్ కాలనీలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతుంటే సంబం ధిత అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోజులు గడుస్తుం డడంతో భూముల ధరలకు రెక్కలు వస్తున్నాయి. దీంతో ఓ కబ్జాదారుడు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఒక ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఈ నిర్మాణంపై కొందరు దాదాపు 20 రోజుల నుంచి ఫిర్యాదు చేసిన రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

మండలంలో ఇంత జరుగుతున్నా రెవెన్యూ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అదికారులు ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరుతున్నారు.

ఇటుక బట్టీల్లో బాల కార్మికులు...

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : జిల్లాలోని పలు పట్టణ ప్రాంతాలలో ఇటుక బట్టీలలో, బడి ఈడు పిల్లలు కార్మికులు గా ఇటుకలను తయారు చేస్తున్నారు వారిని చూస్తున్నారే తప్ప పట్టింపు ఉన్నవారు కరువయ్యారు. వివరాల్లోకి వెళితే నిర్మల్ పట్టణ ప్రాంతానికి దగ్గరలో కనకాపూర్ హైవే 64 పెట్రోల్ బంక్ వెనుక భాగంలో కనకాపూర్ శివారులో ఉన్న చెరువును అనుకొని ఇటుక బట్టీలలో బడి ఈడు పిల్లలు బాల కార్మికులుగా పనిచేస్తున్నారు. అదేవిధంగా ఖానాపూర్ పట్టణ ప్రాంత సమీపాన గంగాయిపేట శివారులోని హరి చెరువులో అదే తరహాలో ఖానాపూర్ టు నిర్మల్ రహదారి ప్రక్కన అటవీ అధికారుల పాత గలై డిబు ఎదురుగా ఖానాపూర్ పట్టణ ప్రాంతానికి సమీపాన బ్రహ్మంగారి గుడి ముందర ఇటుక బట్టి లలో బడి ఈడు పిల్లలు చదువుకునే వయసులో శ్రమజీవులుగా మారారు. మహారాష్ట్ర నాగపూర్ ప్రాంతానికి చెందిన వలస కూలీలు, ఇటుకలు తయారు చేస్తూ సహజీవనం సాగిస్తూన్నప్పటికీ, బడి ఈడు పిల్లలు మాకు రెక్కాడితే కానీ డొక్క నిండదని మేము బడికి వెళ్తా ఉంటే కూడు పెట్టేది ఎవరు అని వాపోతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా దారిద్రరేఖకు దిగువన ఉన్న పేదల బతుకులు మారడం లేదు. దేశవ్యాప్తంగా ప్రభుత్వం ఎన్ని పథకాలు ప్రవేశపెట్టిన నిరుపేదలకు అందటం లేదని, ఇటుక బట్టీలలో బాల కార్మికులుగా పనిచేస్తూ పొట్టపోసుకుంటున్నాము అని వలస కార్మికులు వ్యాఖ్యానిస్తున్నారు. బడి ఈడు పిల్లలను కార్మికులుగా మార్చిన తల్లిదండ్రులైన కార్మిక యజమానులైన శిక్షకు అర్హులు అని ప్రభుత్వం చట్టం చెబుతోంది ఈ చట్టం వలస జీవులకు వర్తించదా... అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రజా సంక్షేమ, అభివృద్ధి పనులకు ప్రాధాన్యత

రూ.6 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమ, అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాకే సామాన్య, పేద కుటుంబాల్లో నిజమైన పండుగ వచ్చిందన్నారు. సోమవారం ములకలపల్లి మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. రూ. 6 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. పాత జిన్నెలగూడెం, రాజుపేట గ్రామాలలో 4.90 కోట్లతో నిర్మించే రెండు చెక్ డ్యామ్ లతోపాటు మండల కేంద్రంలో వైయస్సార్ నగర్‌లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.40 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లు, రాజుపేటకాలనీలో రూ. 60 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు శంఖుస్థాపన, భూమి పూజలు చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ కుమార్, డిఈ మోతిలాల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్, నాయకులు బత్తుల అంజి, కారం సుధీర్ కుమార్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మత సామరస్యానికి రంజాన్ ప్రతీక

విశాలాంధ్ర-కొమరోలు : పవిత్రత, త్యాగానికి, మత సామరస్యానికి రంజాన్ ప్రతీక అని మహ్మద్ ఇక్బాల్ హజరత్ అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని కొమరోలు మండలంలోని కొమరోలు, నల్లగుంట్ల, గుండ్రెడ్డిపల్లి, రాజుపాలెం, ద్వారాకచర్ల, రెడ్డిచర్ల, అల్లినగరం గ్రామాలలో ముస్లిం సోదరులందరూ కలిసి రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ముస్లిం సోదర, సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు : మాజీ ఎంపీ నామ

విశాలాంధ - ఖమ్మం : ఖమ్మం, మార్చి 28: పవిత్ర రంజాన్ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోకసభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపవాస దీక్ష, ప్రార్ధనలతో పండుగ జరుపుకునే రంజాన్ ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాలను అందించాలని ఆకాంక్షించారు. ఈ పవిత్ర మాసం త్యాగం, సహన, సమానత్వం, దయకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముస్లిం సోదరులు చేపట్టే రోజా, నమాజ్, జకాత్ వంటి ఆచారాలు మనుషుల మధ్య ప్రేమాభిమానాలు పెంచేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయం లో సామాజిక, ఆర్థిక, విద్యా, మతపరమైన అభివృద్ధిలో ముస్లిం ప్రజలకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, తెలంగాణను మైనారిటీలకు ఆదర్శ రాష్ట్రముగా నిలిపిందన్నారు. తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ స్థాపన ద్వారా ముస్లిం విద్యార్థులకు ఉచిత విద్య, వసతి, భోజనం కల్పించటంతో పాటు మైనారిటీ విద్యార్థులకు విదేశీ విద్యా స్కాలర్షిప్ ద్వారా ఉన్నత విద్యకు సహాయపడటం జరిగిందన్నారు. షాదీ ముబారక్ పథకం ద్వారా పేద ముస్లిం యువతికి ప్రత్యేక ఆర్థిక సహాయం అందజేసిందన్నారు. నాడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఓబీసీ ముస్లిం మైనారిటీ కమ్యూనిటీకి 4 శాతం నుంచి 12 శాతానికి రిజర్వేషన్ పెంచుతూ రాష్ట్ర అసెంబ్లీలో చట్టాన్ని ఆమోదించిందని ఈ సంధర్బంగా నామ గుర్తు చేసారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముస్లిం సోదర, సోదరీమణులకు అభ్యున్నతి కోసం తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని నామ పేర్కొన్నారు. రంజాన్ వేడుకలు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, నూతన ఆశలు నింపాలని, అందరికీ సంపద, ఆరోగ్యం, శుభఫలితాలను అందించాలని ఆకాంక్షిస్తూ, మరోసారి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు

విశాలాంధ్ర-పిసిపల్లి :

రానున్న ఈ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పిసిపల్లి మండలంలోని దివాకర్లపల్లిలో ఈనెల 2న రిలయన్స్ సిబిసి ప్లాంట్ శంకుస్థాపన ఏర్పాట్లను స్థానిక శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుమల అశోక్‌రెడ్డి జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి పరిశీలించారు. ముందుగా జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణతో కలిసి జిల్లా అధికారులు మండల అధికారులతో శంకుస్థాపన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు సలహాలు తెలియజేశారు. అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఉద్యోగాల కల్పన నిరుపయోగ భూములను ఉపయోగంలోకి తీసుకురావటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దిష్టి సారించారని దానికి అనుగుణంగా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 500 ప్లాంట్ల ఏర్పాటుకు రిలయన్స్ సంస్థ ముందుకు వచ్చిందని అందులో భాగంగా రాష్ట్రంలోని మొట్టమొదటిగా ప్రకాశం జిల్లాలోని కనిగిరి నియోజకవర్గం పిసిపల్లి మండలంలోని దివాకర్ పురం సమీపంలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు అందులో భాగంగా ఈ నెల 02న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రిలయన్స్ అధినేత తనయుడు అనంత అంబానీ శంకుస్థాపన చేస్తారని తెలియజేశారు. నిరుపయోగంలో ఉన్న భూములను సైతం వినియోగంలోకి తీసుకువచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. త్వరలోనే మార్కాపురం గిద్దలూరు దర్శి నియోజకవర్గాల్లో సిబిజి యూనిట్లు ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. ప్రభుత్వ భూమిని రిలయన్స్ సంస్థకు 5000 ఎకరాలు కేటాయించినట్లు ప్రభుత్వ భూమికి ఎకరాకు రూ. 16 వేలు, ప్రైవేటు భూమికి రూ. 31వేలు కౌలు చెల్లించటం జరుగుతుందని తెలియజేశారు. రైతులు తమ భూములను కౌలుకు ఇచ్చుకోవచ్చని లేకపోతే రైతులే గడ్డిని పండించి ప్లాంటుకు వినియోగించుకోవచ్చునని నిరుపయోగంలో ఉన్న భూములు సైతం ఉపయోగములకు తెచ్చేందుకు ఈ ప్లాంట్ దోహదపడుతుందన్నారు. ఈ పారిశ్రామిక పెట్టుబడులతో గ్రామీణ ప్రాంతాలతో పాటు జిల్లాలో జీవన ఉపాధి అవకాశాలు పెరగటంతో పాటు వలసలు తగ్గుతాయని ఆకాంక్షించారు. జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఈనెల 2న శంకుస్థాపన ఏర్పాట్లను పూర్తిచేసినట్లు జిల్లాస్థాయి మండల స్థాయి అధికారులు ఆర్గనైజింగ్ వారితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేసినట్లు తెలియజేశారు. ప్రతినిధులు కానీ ఎటువంటి సభ ప్రాంగణానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచినీళ్లు ఆహారం సౌకర్యాలు ఏర్పాట్లులో నిర్లక్ష్యం వహించకూడదని తెలియజేశారు. హెలిప్యాడ్ నిర్మాణం సభా ప్రాణానికి చేరుకునేందుకు రోడ్ల నిర్మాణం పూర్తి చేయటం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంలో ఏపీ గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా మొట్టమొదటిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గంలోని పిసీపల్లి మండలం దివాకరపురం గ్రామంలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని తెలియజేశారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెంట గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ కుమార్ రెడ్డి స్థానిక శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ ఆర్డిఓ కేస వర్ధన్ రెడ్డి జిల్లా అధికారులు మండల అధికారులు ఉన్నారు.

ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర - మేడిపల్లి : రంజాన్ పర్వదినం (ఈద్ ఉల్ ఫితర్) సందర్భంగా సోమవారం ఉదయం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బండి గార్డెన్స్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ.. రంజాన్ పర్వదినం సామరస్యానికి, శాంతికి, సేవా భావానికి ప్రతీక అని అన్నారు. మత సామరస్యాన్ని కాపాడుతూ, ప్రేమాభిమానాలతో జీవించాలనే సందేశాన్ని ఈద్ ఉల్ ఫితర్ అందిస్తున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ శివ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దర్గా దయాకర్ రెడ్డి, రామ్ రెడ్డి, వంగూరి పరమేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీకలు పండుగలు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : పండుగలు మత సామరస్యానికి ప్రతీకలని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి అన్నారు.సుభాష్ నగర్ డివిజన్ పరిధి సూరారం కాలనీలో గల మస్జీద్‌లో స్థానికులతో కలిసి సోమవారం సురేష్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ముస్లింలందరికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతు డివిజన్‌లలో గల ప్రతి కాలనీలో ముస్లింలు పవిత్రంగా రంజాన్ పండుగ జరుపుకొంటారని, రంజాన్ పండుగ మానవాళికి హితాన్ని బోధిస్తుందని తెలిపారు. ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే "రమదాన్" పండుగ సైతం ఇదే హితాన్ని మానవాళికి అందిస్తుందని, ఈ నెలలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు, ఫిత్రా జకాత్ దానధర్మాలు చేస్తుంటారని అన్నారు. భగవంతుణ్ణి భక్తి శ్రద్దలతో ప్రార్థిస్తే ప్రజలు అన్ని రకాలుగా సుఖ సంతోషాలతో ఉంటారని అన్నారు. ఈ ప్రార్థనలో ముస్లిం పెద్దలు, మస్జీద్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు నగేష్ ముదిరాజ్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : రంజాన్ పర్వదిన సందర్భంగా భోలకపూర్, ముషీరాబాద్ లో ముస్లిం సోదరుడు సమద్ కు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు నాగేష్ ముదిరాజ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, సృష్టికర్త అల్లా అనుగ్రహం మన అందరిపైన ఎల్లవేళలా ఉండాలని జీవితాలలో సుఖశాంతులు ఆనందం ఎల్లప్పుడు ఉండాలని కోరుకుంటూ, పవిత్ర రంజాన్ పర్వదినం మన అందరిలో సోదర భావాన్ని పెంపొందించి మనలో కొత్త ఉత్సాహాన్ని నింపాలని ఆకాంక్షిస్తూ ముస్లిం సోదర, సోదరీమణు లందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

పేద ముస్లింలకు పీఆర్ ఫౌండేషన్ నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి : పవిత్ర రంజాన్ మాసంలో కఠిన ఉపవాస దీక్ష చేపట్టే నిరుపేద ముస్లిం కుటుంబాలకు పిఆర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని 10 వార్డులో నిత్యావసర సరుకులను నిరుపేద ముస్లిం కుటుంబాలకు పిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పెగడ రమేష్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రంజాన్ పవిత్ర మాసంలో నెలరోజుల పాటు ముస్లింలు కఠిన ఉపవాస దీక్ష చేపడతారని, రంజాన్ పవిత్ర పర్వదినం కోసం నిరుపేదలకు ఇప్పటినుండి ప్రతి సంవత్సరం ఇలాగనే అందిస్తామని పండుగ సందర్భంగా అని కాకుండా ఎల్లవేళల నిరుపేద కుటుంబాలకు పి.ఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి తాను సంపాదించే దాంట్లో కొంత దానం చేయాలని ఖురాన్‌లో రాసి ఉందన్నారు.

పదో వార్డ్ మైనార్టీ నాయకులు పి.ఆర్ ఫౌండేషన్ వారిని ఆదర్శంగా నిలవాలని నిరుపేదలకు ఏదో విధంగా సాయం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పెగడ రమేష్ యాదవ్, మైనార్టీ నాయకులు ఫైన్, అన్వర్, రబ్బాని, రియాజ్, మున్వర్ పలువురు పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజం కోసమే...

పీ-4కు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పీ-4 విధానానికి శ్రీకారం చుడుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. సమాజంలోని సంపన్నులను పేదలతో అనుసంధానించి... పేదరికాన్ని నిర్మూలించేందుకు ఉద్దేశించిన 'మార్గదర్శి- బంగారు కుటుంబం, పీ4- జీరో పావర్టీ' కార్యక్రమాన్ని సీఎం ఆదివారం అమరావతిలో ప్రారంభించారు. పారిశ్రామిక, విద్య, వ్యాపార, వాణిజ్య రంగాల ప్రముఖులను ఒకే వేదికపైకి ఆహ్వానించిన ప్రభుత్వం... పేదల అభ్యున్నతికి వారు మార్గదర్శనం చేసేలా కర్తవ్యాన్ని నిర్దేశించింది. ఈ విధానం మాటలతో అయ్యేది కాదు. మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులతోపాటు డబ్బులు సంపాదించిన వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలందరూ సమష్టిగా కదలిరావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్రప్రదేశ్‌కు పీ4- జీరో పావర్టీ ఒక ఆయుధంగా పేర్కొన్నారు. ఆగస్టు 15 నాటికి దీనికొక రూపం తీసుకొస్తామని, వచ్చే ఉగాది నాడు దీని ప్రగతిని ప్రజలముందు పెడతామన్నారు. మార్గదర్శకులు అందరూ సమాజం వల్ల పైకి వస్తున్నారు. వారికి సమాజం పట్ల బాధ్యత ఉంది. మేఘా సంస్థ అధినేత కృష్ణారెడ్డి తన సొంత మండలాన్ని దత్తత తీసుకున్నారు. ఆయనలాగే పారిశ్రామికవేత్తలు ఎవరికి వారు శక్తి మేరకు గ్రామాన్ని, కుటుంబాన్ని తీసుకోవచ్చునన్నారు. 2029 నాటికి సమాజం జీరో పావర్టీకి రావాలని, మార్గదర్శకులకు అప్పగించిన బంగారు కుటుంబాలన్నీ పేదరికం నుంచి బయటకు రావాలని ఆకాంక్షించారు. బాగా పనిచేసిన వారికి ఏటా అవార్డులు ఇచ్చి సన్మానిస్తామన్నారు. ప్రభుత్వమిచ్చే గుర్తింపు డబ్బులతో రాదన్నారు. రేపటి నుంచి ఆన్‌లైన్‌లో నమోదు ఉంటుంది. టాప్ 10 శాతం కిందనున్న 20 శాతం జనాభాను గుర్తించి పేదరిక నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఇది విజయవంతమైతే ప్రపంచానికే స్ఫూర్తిదాయక మవుతుందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ సమాజంలో ఉన్నతస్థాయికి వెళ్లిన వారు కింది వారి కోసం సహాయపడే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన చంద్రబాబుకు హ్యాట్సాప్ అంటూ కొనియాడారు.

ఉగాది పురస్కారాల ప్రదానం

తొలుత విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం అధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. మొత్తం 86 మంది కళారత్న అవార్డులు, 116 మంది ఉగాది అవార్డులు అందుకున్నారు. అనంతరం పద్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ నిర్వహించిన పంచాంగ శ్రవణంలో చంద్రబాబు పాల్గొన్నారు. టీటీడీ పంచాంగం సహా వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ పంచాంగాలను సీఎం ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ వార్షిక ఉత్సవాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో నూతన ఆవిష్కరణలు జరుగుతూనే ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ హార్డ్‌వర్క్ కాకుండా స్మార్ట్ వర్క్ చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో మనదేశం అగ్రస్థానంలో ఉంటే... దేశాన్ని నడిపించే శక్తి తెలుగుజాతికి ఇవ్వాలని ఆ భగవంతుణ్ని కోరుకుంటున్నానని అన్నారు.

'మంచిపల్లి సత్యవతి' పురస్కారాలకు నలుగురి ఎంపిక

విశాలాంధ్ర- పార్వతీపురం: మన్యంజిల్లా పార్వతీపురంలో సాహితీలహరి, మంచిపల్లి సేవా సంస్థ ప్రతి సంవత్సరం సాహితీ రంగంలో నిష్ణాతులకు అందజేసే 'మంచిపల్లి సత్యవతి' జాతీయ ఉగాది పురస్కార గ్రహీతల పేర్లను వ్యవస్థాపకులు డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు, మంచిపల్లి పార్థసారథి సోమవారం ప్రకటించారు. గత 14 సంవత్సరాలుగా పురస్కారాలు అందజేస్తున్నామని వారు వివరించారు. 2022 నుంచి 2025 వరకు అంటే నాలుగు సంవత్సరాలకు గాను బాలసాహిత్యంలో అనేక కథలు, బాల గేయాలు, బాల కవితలురాసి అనేక పుస్తకాలు ప్రచురించి, బాల సాహిత్యానికి ఎనలేని కృషి చేసిన బెహరా ఉమామహేశ్వరరావు (పార్వతీపురం), దార్ల బుజ్జిబాబు (గుంటూరు), అమరావది నీరజా (హైదరాబాద్), ఆకెళ్ళ వెంకటసుబ్బలక్ష్మి (రాజమండ్రి) లను ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. ఈ నలుగురు సాహితీవేత్తలకు ఏప్రిల్ 13న పార్వతీపురంలో జరిగే సాహిత్యసభలో పురస్కారం అందజేస్తామని చెప్పారు. గతంలో రెడ్డి రాఘవయ్య , పాయల సత్యనారాయణ , బెలగాం భీమేశ్వరరావు, స్వరాజ్యం వెంకట రాజ్యలక్ష్మి, వెలగా వెంకటప్పయ్య, ఆలపాటి వెంకటరావు, ఎన్.వి.వి . సత్యనారాయణమూర్తి, గంగిశెట్టి శివకుమార్, నారంశెట్టి ఉమామహేశ్వరరావు, దాసరి వెంకటరమణ, డి.కె. చదువులబాబు , ప్రత్తిపాక మోహనరావు, ముంజలూరు కృష్ణకుమారి, ఎం.వి.వి. సత్యనారాయణకు పురస్కారాలు అందజేసినట్టు వివరించారు.

దిగొచ్చిన టోల్ చార్జీలు

విజయవాడ-హైదరాబాద్ రహదారిపై వాహనదారులకు ఊరట

మార్చి 31, 2026 వరకు అమలు

ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయంతో తగ్గుముఖం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు టోల్ చార్జీలను తగ్గిస్తూ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) నిర్ణయం తీసుకుంది. తగ్గిన టోల్‌చార్జీలు సోమవారం తెల్లవారుజాము నుంచి మార్చి 31, 2026 వరకు అమలులో ఉంటాయి. విజయవాడ-హైదరాబాద్ 65వ నంబరు నేషనల్ హైవేపై తెలంగాణలోని పంతంగి కొర్లపహాడ్, ఏపీలోని నందిగామ దగ్గర గల చిల్లకల్లు వద్ద టోల్‌గేట్లు ఉన్నాయి. గతంలో ప్రతి ఏప్రిల్ ఒకటో తేదీన టోల్ చార్జీలను జీఎంఆర్ సంస్థ పెంచేది. 2024, జూన్ 31తో ఆ సంస్థ ఒప్పందం ముగిసిపోయింది. దీంతో ఏడాదిపాటు నిర్వహణను ఏజెన్సీలకు ఎన్‌హెచ్‌ఏఐ అప్పగించింది. స్వయంగా ఎన్‌హెచ్‌ఏఐ టోల్‌చార్జీల నిర్వహణతో ఈ చార్జీలు తగ్గుముఖం పట్టాయి. ఈ టోల్ రేట్లు తగ్గించడంతో వాహన దారులకు కాస్త ఊరట లభించనుంది. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై చిల్లకల్లు టోల్ ప్లాజా దగ్గర అన్ని వాహనాలకు కలిపి ఒక వైపునకు రూ.5, ఇరువైపులా కలిపి రూ.10చొప్పున రేట్లు తగ్గించారు. అక్కడ 24 గంటలలోపు ప్రయాణించే అన్ని రకాల వాహనాలకు టోల్‌చార్జీలో 25శాతం మినహాయింపు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. తెలంగాణలోని చౌటుప్పల్ మండలం పంతంగి, కేతనపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌గేటు వద్ద జీపులు, కార్లు, వ్యాన్లకుగాను ఒక వైపు ప్రయాణానికి రూ.15, రెండు వైపులా ప్రయాణానికి కలిపి రూ.30, లైట్ వెయిట్ వాహనాలకు ఒక వైపు ప్రయాణానికి రూ.25, రెండు వైపులా కలిపి రూ.40, బస్సు, ట్రక్కులకు ఒక వైపు ప్రయాణానికి రూ.50, ఇరువైపులా కలిపి రూ.75 వరకు తగ్గించినట్లు ప్రకటించారు. పండుగ సమయాల్లో తెలుగు రాష్ట్రాల మధ్య భారీగా వాహనాల రాకపోకలు కొనసాగు తుంటాయి. దీన్ని ఆసరాగా చేసుకుని వాహన చోదకుల నుంచి పెద్దఎత్తున టోల్ రుసుం వసూలు చేయడంతో ప్రయాణికులకు భారంగా మారింది. ప్రధానంగా సంక్రాంతి, దసరా పండుగల సమయంలో హైదరాబాద్-విజయవాడ మధ్య భారీగా వాహనాల రాకపోకలు కొనసాగుతాయి. ఈ సమయంలో వాహన చోదకులకు టోల్ ట్యాక్స్‌ల పేరుతో భారీగా చిల్లు పడుతోంది. ఈ టోల్ ట్యాక్స్‌లను భరించలేక కొందరు ప్రయాణాలు వాయిదా వేసుకుంటున్నారు. మరికొందరు కుటుంబ సమేతంగా రైళ్లు, బస్సుల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రెండు తెలుగు రాష్ట్రాలను కలిపే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ప్రయాణించే వారికి భారీ ఊరట కలిగించింది.

మెరుగైన చికిత్స కోసం ముంబైకు కొడాలి నాని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) మెరుగైన చికిత్స కోసం ప్రత్యేక విమానంలో ముంబైకు సోమవారం తరలించారు. ఇటీవల ఆయన తీవ్ర అనారోగ్యానికి గురవగా, హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గుండెకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఆయనను తీసుకుని హైదరాబాద్ నుంచి ముంబైకు వెళ్లారు. ఆయనకు గుండె వ్యాధితో పాటు ఇతర వ్యాధులు సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. గుండెకు సంబంధించి మూడు వాల్‌లు పూడుకుపోయినట్లు తెలుస్తోంది. మాజీ సీఎం వైఎస్ జగన్ ...హైదరాబాద్ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడిన సమయంలో ఈ విషయాన్ని తెలిపారు. హైదరాబాద్ ఆస్పత్రిలో చేసిన ప్రయత్నాలు సఫలీకృతం కాకపోవడంతో కొడాలి నానిని వెంటనే ఎయిర్ అంబులెన్స్‌లో ముగ్గురు డాక్టర్ల పర్యవేక్షణలో హైదరాబాద్ నుంచి ముంబైలోని ఏసియన్ హార్ట్ ఇనిస్టిట్యూట్‌కు తరలించారు. ఇటీవల వల్లభనేని వంశీని అరెస్ట్ చేసిన సమయంలో విజయవాడ జిల్లా జైలు వద్దకు కొడాలి నాని వచ్చారు. ఆరోజు చాలా యాక్టివ్‌గా ఉన్నప్పటికీ ఆ తర్వాత జీర్ణకోశ సంబంధిత వ్యాధి ఉందంటూ హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేరారు. నానికి వెంటనే సర్జరీ చేయాలని వైద్యులు సూచించారు. సర్జరీ క్రిటికల్‌గా మారడంతో బైపాస్ సర్జరీ నిమిత్తం ముంబైకు తరలించాలని వైద్యులు సూచించారు. కొడాలికి ప్రముఖ వైద్యనిపుణులు పాండా ఆపరేషన్ చేయనున్నారు. గతంలో మన్మోహన్‌సింగ్, లాలూ ప్రసాద్‌కు ఆయన సర్జరీలు చేశారు.

భవిరి రవికి 'కళారత్న' పురస్కారం

విశాలాంధ్ర-విజయవాడ: మిమిక్రీ మాంత్రికుడు భవిరి రవి కళారత్న పురస్కారం అందుకున్నారు. ఉగాదిని పురస్కరించుకుని సోమవారం తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ... రాష్ట్ర అత్యున్నత పురస్కారమైన 'కళారత్న' హంస అవార్డును భవిరికి అందించి సత్కరించారు. నాలుగు దశాబ్దాలకు పైబడి ఆయన చేస్తున్న కృషిని గుర్తించి కళారత్న అవార్డుకు ఎంపిక చేశారు. రూ.50 వేల నగదుతో పాటు సర్టిఫికెట్ అందజేసి శాలువాతో సత్కరించారు. భాషా సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, దేవదాయ ధర్మదాయశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మాజీ శాసనసభాపతి మండలి బుద్ధప్రసాద్ ... భవిరి రవిని అభినందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ ధర్మదాయశాఖలో టెక్నికల్ ఆఫీసర్‌గా భవిరి పనిచేస్తున్నారు. నాగాయలంక వాస్తవ్యులు భవిరి కామరాజు-చంద్రావతి దంపతుల కుమారుడైన భవిరి రవి... చిన్ననాట మాతృమూర్తి చంద్రావతి వద్ద మిమిక్రీ కళను అభ్యసించారు. నేరెళ్ల వేణుమాధవ్ ఏకలవ్యశిష్యుడిగా పేరొందిన ఆయన మిమిక్రీ విద్యను 1977 నుంచి దేశ విదేశాలలో వేలాది ప్రదర్శనలు ఇచ్చి అంతర్జాతీయ మిమిక్రీ కళాకారుడిగా పేరు ప్రఖ్యాతులు పొందారు. ధ్వన్యనుకరణ చక్రవర్తి, నిరర్గళ స్వరధురీణ, నిరర్గళ సమ్మోహన సామ్రాట్, మిమిక్రీ స్టార్ మొదలైన ఎన్నో బిరుదులు సొంతం చేసుకున్నారు.

ఎంపీలో నేటినుంచి మద్యం షాపులు బంద్

భోపాల్: నవరాత్రులు ప్రారంభం కావడంతో మధ్యప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మైహార్ పట్టణంలో మాంసం, మద్యం విక్రయాలు తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించింది. ఈ ఆదేశాలు అతిక్రమిస్తే షాపుల లైసెన్స్ రద్దు చేస్తామని మధ్యప్రదేశ్ ప్రభుత్వం తీవ్రంగా హెచ్చరించింది. నవరాత్రులను మైహార్ పట్టణంలో తొమ్మిది రోజులు ఘనంగా నిర్వహిస్తారు. పట్టణవాసులు సైతం భక్తి శ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తారు. ఈ శక్తిపీఠాన్ని దర్శించుకునేందుకు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచే కాకుండా... ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది మైహార్ పట్టణానికి తరలివస్తారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని భోపాల్, ఇండోర్‌లో సైతం మాంసం షాపులు మూసివేయనున్నారు. ఇక ఏప్రిల్ 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా మైహార్ సహా 17 పట్టణాల్లో మద్యం దుకాణాలు శాశ్వతంగా మూసివేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఏటా అమ్మవారి నవరాత్రులు నాలుగుసార్లు జరుపుకుంటారు. చాలామందికి ఆశ్వయుజ మాసంలో వచ్చే దసరా పండగ వేళ జరిగే నవరాత్రి వేడుకలు మాత్రమే తెలుసు. శరన్నవరాత్రులకు ఎంత ప్రాధాన్యత ఉందో... చైత్ర శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు జరుపుకొనే వసంత నవరాత్రులకు అంతే ప్రాధాన్యం ఉంది. ఉగాది నుంచి వసంత నవరాత్రులు ప్రారంభమయ్యాయి. దీంతో మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

హారతి అంటుకొని గిరిజా వ్యాస్‌కు గాయాలు

జైపూర్: కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, కేంద్ర మాజీమంత్రి గిరిజా వ్యాస్ అగ్నిప్రమాదానికి గురయ్యారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో తన నివాసంలో పూజ సమయంలో హారతి నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో ఆమెకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు... మెరుగైన వైద్యం కోసం ఆమెను అహ్మదాబాద్‌కు తరలించాలని సూచించినట్లు తెలుస్తోంది. ఇంట్లో ఆమె హారతి ఇస్తుండగా కింద వెలుగుతున్న దీపం నుంచి మంటలు ఆమె దుపట్టాకు అంటుకోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు గిరిజా వ్యాస్(79) సోదరుడు గోపాల్ శర్మ తెలిపారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారన్నారు. గిరిజా వ్యాస్ గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలందించారు. రాజస్థాన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా, జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గానూ పనిచేశారు.

కాకినాడ పోర్టు నుంచి ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం

జెండా ఊపిన ప్రారంభించిన తెలంగాణ మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర-కాకినాడ రూరల్ : కాకినాడ పోర్టు నుంచి ఫిలిప్పీన్ దేశానికి ఓడ ద్వారా బియ్యం రవాణాను తెలంగాణ రాష్ట్ర జల వనరులు, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. సోమవారం మంత్రి ఉత్తమ్ హైదరాబాద్ నుంచి కాకినాడ పోర్టుకి హెలికాప్టర్ ద్వారా వచ్చారు. కాకినాడ పోర్టు నుంచి ఫిలిప్పీన్స్ దేశానికి తెలంగాణ బియ్యం రవాణా చేసే ప్రక్రియ ప్రారంభమైంది. తెలంగాణలో పోర్టు లేని నేపథ్యంలో డ్రై పోర్టు నిర్మించాలని అప్పటి తెలంగాణ సీఎం కె.చంద్రశేఖరరావు ప్రయత్నించినా కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చొరవతో ఈ ప్రక్రియ కార్యరూపం దాల్చింది. ఈ మేరకు ఫిలిప్పీన్స్‌తో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ కాకినాడ పోర్టు నుంచి షిప్ ద్వారా 8 లక్షల టన్నుల బియ్యం ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకోవడంతో తొలి విడతగా 12,500 మెట్రిక్ టన్నుల తెలంగాణ బియ్యం ఎగుమతి కానుంది. ఆదిత్య బిర్లా గ్లోబల్ ట్రేడింగ్ (సింగపూర్) పిటిఇ లిమిటెడ్ ఫిలిప్పీన్స్ ప్రభుత్వం తరపున ఈ రవాణా చేయనుంది. వియత్నాంకు చెందిన ఎంవి ట్రోస్ట్ ఎస్ షిప్ ద్వారా ఈ ఎగుమతి జరిగింది. తొలిసారిగా జరగనున్న ఈ అరుదైన కార్యక్రమాన్ని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు.

గ్రంథాలయాలు పునర్వికాసం పొందాలి

పునర్వికాస ఉద్యమ కన్వీనర్ వల్లూరి శివ ప్రసాద్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ : ప్రతి గ్రామంలో గ్రంథాలయాలు పునర్వికాసం పొందాలని గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ అన్నారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ సమావేశ మందిరం నందు సోమవారం 'గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం' జరిగింది. ఈ సభకు గుంటూరు జిల్లా అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కోసూరి రవికుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శివ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు కడుతున్న పన్నుల నుంచి గ్రంథాలయాల సెస్‌ను తప్పక గ్రంథాలయాలకు కేటాయించాలని కోరారు. గ్రామ గ్రామాన గ్రంథాలయ ఉద్యమం జరగటం కోసం సామాజిక చైతన్య కార్యక్రమాలు రూపొందించాలన్నారు. కళా రూపాల ద్వారా కూడా జనం దగ్గరకు వెళతామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ సీహెచ్ సుశీలమ్మ మాట్లాడుతూ పుస్తకాల మధ్య ఎదిగిన తరం రేపటి తరానికి గ్రంథాలయాలను మిగల్చడం కోసం ఈ పునర్వికాస ఉద్యమం అవసరమని అన్నారు. అనంతరం ప్రముఖ సాహిత్యకారులు షేక్ బాబూజీ మాట్లాడుతూ అవసరమైతే కళారూపాలు రూపొందించి పునర్వికాస ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళతామన్నారు. సభకు అధ్యక్షత వహించిన కోసూరి రవికుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాలు మానవ జీవితానికి దారిదీపాలు అన్నారు. గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక కన్వీనర్‌గా ప్రొఫెసర్ యల్లాప్రగడ మల్లిఖార్జునరావు, కో-కన్వీనర్లుగా ప్రొఫెసర్ సీహెచ్ సుశీలమ్మ, షేక్ బాబూజీ, సభ్యులుగా మోదుగుల రవికృష్ణ, సోమేపల్లి శ్రీవశిష్ఠ, పెనుమాక నాగేశ్వరరావు, చందు నాగేశ్వరరావు, భూసురుపల్లి వెంకటేశ్వర్లు, కందిమళ్ల శివప్రసాద్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ, అరసం నాయకులు శరశ్చంద్ర, వీవీ కుమార్, సోమేపల్లి శ్రీవశిష్ఠ, అరసం సభ్యులు, అనేక మంది సాహిత్యాభిమానులు, గ్రంథాలయ ఉద్యమ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పాలకుల హామీలతో విసిగిపోయి...

నిధులు సేకరించి వంతెన నిర్మాణం

యూపీలో గ్రామస్తుల చొరవ

లక్నో: వంతెన కోసం పాలకులు, అధికారులు ఇచ్చిన హామీలతో గ్రామస్తులు సొంతంగా నిధులు సేకరించుకుని వంతె నిర్మా ణం చేపట్టారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఘాజీపూర్ జిల్లా కాయంపూర్, సోనా గ్రామాల పరిధిలోని మాంగై నదిని దాటేందుకు గ్రామస్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నదిపై వంతెన నిర్మాణం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో విసిగిపోయిన గ్రామస్తులు సొంతంగా బ్రిడ్జి నిర్మించేందుకు రంగంలోకి దిగారు. దీని కోసం సుమారు కోటి నిధులు సేకరించారు. కాగా, ఆర్మీ కార్ప్స్ ఆఫ్ ఇంజనీర్స్‌లో పనిచేసి పదవీ విరమణ చేసిన రవీంద్ర యాదవ్ ఈ వంతెన నిర్మాణం కోసం చొరవ చూపారు. దీని కోసం రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చారు. నిర్మాణ రంగంలో అనుభవం ఉన్న ఆయన బ్రిడ్జి నిర్మాణాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి శేఖర్ కుమార్ యాదవ్ సమక్షంలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. దీంతో విరాళాలు ఇచ్చేందుకు మరింత మంది ముందుకు వచ్చారు. మరోవైపు వంతెన నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. 108 అడుగుల ఎత్తులో నదిపై నిర్మిస్తున్న ఈ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే 50 గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని గ్రామస్తులు తెలిపారు. జిల్లా కేంద్రమైన ఘాజీపూర్‌కు దూరం 25 కిలోమీటర్లు తగ్గుతుందని చెప్పారు. విద్య, వైద్యం కోసం నది దాటేందుకు పడవలపై ఆధారపడాల్సిన అవసరం, వరదల వల్ల ఇబ్బందులు ఉండవని అన్నారు. అయితే గ్రామస్తులు సొంతంగా వంతెన నిర్మిస్తున్న విషయం అధికారుల దృష్టికి వెళ్లింది. అనుమతి లేకుండా నిర్మిస్తున్న నేపథ్యంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు? అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, భారీ వాహనాల రాకపోకలు సాగేలా దీనిని నిర్మిస్తున్నారని తెలిపారు. అయితే ప్రజల భద్రతకు సంబంధించిన విషయమని అన్నారు. దీంతో ఈ వంతెన వల్ల ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు నిర్మాణ నాణ్యతను నిర్ధారించడానికి తనిఖీ చేస్తామని మీడియాకు వెల్లడించారు.

ప్రజారోగ్యానికి రూ.64 వేల కోట్లు ఖర్చు: అమిత్ షా

హిసార్ (హర్యానా): ప్రజారోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.64 వేల కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారు. హర్యానా హిసార్‌లో సోమవారం జరిగిన మహారాజా అగ్రసేన్ మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అమిత్‌షా... మోదీ ప్రభుత్వ విజయాలను ప్రస్తావించారు. 'గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం 25 కోట్ల మందిని దారిద్ర్యరేఖ నుంచి బయటకు తీసుకొచ్చింది. 20 కోట్ల మందికి ఆశ్రయం కల్పించడానికి నాలుగు కోట్ల ఇళ్లు నిర్మించాం. 81 కోట్ల మందికి నెలకు ఐదు కిలలో ఉచిత రేషన్‌ను కేంద్ర ప్రభుత్వం అందించింది' అని అమిత్‌షా అన్నారు. '2014 వరకు 12 కోట్ల కుటుంబాలకు మరుగుదొడ్ల సౌకర్యాలు లేవు. రాష్ట్రంలో ప్రతి ఇంటికి మరుగుదొడ్డి అందించిన రాష్ట్రంగా హర్యానా నిలిచింది. దానికి హర్యానా ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. మోదీ ప్రభుత్వం మౌలిక సదుపాయాల రంగంలో విశేష కృషి చేసింది. ప్రజారోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ కేంద్రాల కోసం రూ.64 వేల కోట్లు ఖర్చు చేశాం. గత పది సంవత్సరాల్లో 700కిపైగా ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లు, 382 బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు, 602 క్రిటికల్ కేర్ బాక్స్‌లు స్థాపించాం. నేడు దేశంలో 23 ఎయిమ్స్ ఆసుపత్రులు ఉన్నాయి. వైద్య విద్యార్థులకు మెడికల్ సీట్ల సంఖ్యను 1,15,000కు పెంచాం. రాబోయే ఐదు సంవత్సరాల్లో మరో 85 వేల సీట్లు పెంచనున్నాం' అని ఆయన పేర్కొన్నారు. గతంలో హర్యానాలో కులతత్వం కారణంగా ఉద్యోగాలలో అవినీతి పెరిగిపోయి రాష్ట్ర పరువుపోయింది. బీజేపీ ప్రభుత్వ హయాంలో 80 వేల ఉద్యోగాలు ఇచ్చి ప్రజాస్వామ్యంలో కులం ఆధారంగా రాజకీయాలు జరగవని నిరూపించామని అమిత్‌షా అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర బడ్జెట్ రూ.37 వేల కోట్లు ఉండేది. అది ఇప్పుడు నయాబ్ సింగ్ సైనీ హయాంలో రెండు లక్షల కోట్లకు పెరిగిందని అమిత్‌షా చెప్పుకొచ్చారు.



చెట్ల నరికివేతపై శవ యాత్రతో నిరసన

డెహ్రాడూన్: అభివృద్ధి పనుల కోసం చెట్లను నరికివేయడంపై పర్యావరణ వేత్తలు, పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేశారు. నరికిన చెట్లకు నివాళి అర్పించారు. శవ యాత్ర నిర్వహించి నిరసన తెలిపారు. ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో ఈ సంఘటన జరిగింది. రిషికేశ్-డెహ్రాడూన్ రహదారిని విస్తరించేందుకు 3 వేలకు పైగా చెట్లను నరికేందుకు ప్రతిపాదించారు. ఇప్పటికే వందలాది చెట్లను నరికివేశారు. కాగా, అభివృద్ధి పనుల కోసం చెట్లను విచక్షణారహితంగా నరికివేయడంపై పర్యావరణ వేత్తలు, మేధావులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం డెహ్రాడూన్‌లో 'సేవ్ ఎన్విరాన్‌మెంట్ మూవ్‌మెంట్ 2.0' పేరుతో ఉద్యమం చేపట్టారు. ఇప్పటి వరకు నరికిన చెట్లకు, త్వరలో నరికివేయనున్న చెట్లకు నివాళి అర్పించారు. నరికిన చెట్ల కొమ్మలతో సచివాలయం వరకు అంత్యక్రియల ఊరేగింపు నిర్వహించారు. అయితే మార్గమధ్యలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు మరోవైపు అభివృద్ధి పేరుతో చెట్లను నరికివేయడాన్ని నిషేధించాలని ప్రముఖ సామాజిక కార్యకర్త అనూప్ నౌటియాల్ డిమాండ్ చేశారు. 51 ఏళ్ల కిందట చిప్కో ఉద్యమం ఉత్తరాఖండ్‌లో ప్రారంభమైందని గుర్తు చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.